

# దారితప్పకు!

అనుకోని పరిస్థితులలో హంతకుడిగా మారి ప్రాణంగా ప్రేమించే భార్యకు దూరంగా పారిపోయిన అతన్ని ఆదరించి అతనే సర్వస్వంగా మనసిచ్చింది మరో అమ్మాయి. విధి ఆడిన ఆటలో ముగ్గురూ చేరుకున్న గమ్యం?

కప్పగంతుల మల్లికార్జునరావు



అది రాష్ట్రంలో వో వెనుక బడ్డ ప్రాంతం. యిప్పుడిప్పుడే ఆ ప్రాంత అభివృద్ధికి కంకణం కట్టుకొని పథకాలు వేసేమని ప్రభుత్వం మాటి మాటికి పత్రికల ద్వారా ప్రజలకు చెప్పి బెదరకొట్టోంది.

అలాంటి ప్రాంతంలో నిన్న మొన్నటి దాకా నిద్రపోతున్న వో బస్తీ అది. ఆ బస్తీకి అయిదు మైళ్లదూరంలో వో పల్లెటూరు వుంది. కావటానికి పల్లెటూరైనా నేషనల్ హైవే మీద, బస్తీకి దగ్గరగా వుండటం వల్ల అది కూడా రోడ్డు మీద సవ్వడితో కళకళలాడు తుంటుంది.

బస్తీకి పల్లెకు మధ్యగా వో చిన్న ఏరు వుంది. అటు బస్తీ వారికి యిటు పల్లెవారికీ ఆ ఏటి నీరే జీవనాధారం.

బస్తీ వైపున ఆ ఏటి ఒడ్డున కొంతదూరంలో వో కట్టడం పని ఆరంభమయింది. రాళ్లు, ఇసుక, లారీలతో వచ్చి గుట్టలుగా పడుతున్నాయి. పాకలు వెలుస్తున్నాయ్. టీ దుకాణాలు ఆరంభమవుతున్నాయ్ రోడ్డు పొడుగున.

కట్టడం పని జోరుగా సాగుతోంది. బేస్‌మెంట్ పనిపూర్తి కావస్తోంది. త్వరలోనే అక్కడికి ఏవేవో పరిశ్రమలు రాబోతున్నాయని, గుడ్డల మిల్లులో ఏవో కద్దారని రకరకాల పుకార్లు బయల్దేరేయి.

తాము కట్టున్నది ఫ్యాక్టరీయో, బట్టల మిల్లో, సినిమాహాలో, నాటకశాలో, బియ్యం గోడౌనో కట్టేకూలీలకే తెలియదు. తెల్సుకుందామన్న వుత్సాహమూ వారికి లేదు.

వారికి తెల్సింది వొక్కటే. అక్కడ కొన్ని నెలలపాటు పనివుంటుంది. ఏరోజుకు ఆరోజు కూలీ వెతుక్కోవాల్సిన బాధ వుండదు. మామూలుగా గిట్టే కూలీకన్నా ఎక్కువ రేటే యిక్కడ గిట్టుబాటు అవుతుంది.

కూలీలలో అధిక భాగం పక్కలవున్న నాలుగు పల్లెల నుంచి వచ్చిన వారే. నాలుగు వూళ్లకూలీలకు నలుగురు మేస్త్రీలు నాయకులు.

'ఎంకన్నా పనయ్యాక సాయంకాలం పెదబాబు గోరు విన్నోపాలి బంగళా కొచ్చి కన్పించమన్నారు. వెళ్లటం మర్చిపోవుగా?'

'మర్చిపోనయ్యా ఎల్తా'.

ఎంకన్న ఏటి కవతల గ్రామం నుంచి వచ్చిన కూలీల మేస్త్రీ-వయసులో, బుద్ధిలో, మంచి తనంలో పనిలో మిగతా ముగ్గురు మేస్త్రీకన్నా పెద్దవాడు. కూలీలందరికీ అతనంటే గౌరవం వుంది.

పెదబాబు గారంటే వాళ్లను కూలీకి నియోగించిన ధనంజయరావు. ధనంజయరావు గొప్పవాడు అని చెప్పటానికి నిదర్శనం ఆయన వేసే వేషాలు. ఆయన కాంట్రాక్టరు. బిజి నెస్ మేన్ ఇండస్ట్రియలిస్ట్ అగ్రికల్చరిస్ట్ ఆపైన పొలిటీషియన్.

ధనంజయరావుగారికి బస్తీలో నాలుగు వైపుల నాలుగు బిల్డింగులున్నాయ్. మధ్యలో అసలు బిల్డింగు వుంది. అసలు బిల్డింగ్‌లో ఆయన అసలు భార్యపిల్లలు వుంటారు. మిగతా నాలుగు

బిల్డింగ్‌లలో ఆయన 'వుంపుడు గత్తె' లుంటారు. అసలు బిల్డింగ్‌లో వుదయం దర్శనం యిస్తాడు. సాయంకాల దర్శనం ఏ బిల్డింగ్‌లో లభ్యమవుతుందో చెప్పటం కష్టమే.

కానీ కూలీలకు తెల్సింది ఆయన అసలు బిల్డింగ్ మాత్రమే. పనిచేస్తున్నాడన్న మాటేకాని ఎంకన్నకు మనసంతా 'బాబుగారు తనని ఎందుకు పిలిపించారా?' అన్న ఆలోచనపైనే వుంది.


ఆ మధ్య అక్కడికి వూళ్లోని రాజకీయ నాయకులు కొందరొచ్చారు. కొందరు మేస్త్రీలను కల్సి, ధనంజయరావు వారి శ్రమశక్తిని ఎలా దోపిడీ చేస్తున్నారో చెప్పి హెచ్చు కూలీ డిమేండ్ చేయమని పురెక్కించా రు. ఆశ కలిగింది కొందరికి. ధనంజయరావుకు చెప్పుకొన్నాడు.

కానీ వెంకన్న వారితో కలవలేదు.

'ఒరేయ్ మనకి కూలీ ఎక్కువ కావాలంటే బాబుగోర్ని అడగటంలో తప్పులేదు. కానీ మూడో మనుష్యులెవరో సెప్తే దాన్ని మనం అడగటం బాగుండదు. మనకి పనిచ్చిన పెద్ద మనిషి మనసు కష్టపెట్టుకొంటాడు. మనకి మనూళ్లలో నిన్న దాకా యింతకన్నా తక్కువ కూలీ యిచ్చారుగదా? అప్పుడు వీళ్లు ఎక్కడికి పోయారు? యిందులో ఏదోవుంది. మనం అలాంటి వాట్లోకి తల దూర్చటం మంచిది కాదు' తన అభిప్రాయంగా వెంకన్న మిగతా వారికి చెప్పేదుకాని, మిగతా వాళ్ళలో కొందరు తొందరపడి ఆయన దగ్గరికెళ్ళి అడగనే అడిగేరు.

కూలీ పెంచే విషయం తనతో మాట్లాడటానికి కాదు గదా? అలా ఆలోచిస్తుండగా ఎంకన్నకు తలనొప్పి వచ్చినట్లయింది. ఆ తర్వాత వొళ్లు నొప్పులు పనిచేయలేక పోయాడు.

"ఒరేయ్ హనుమంతూ? మీ అమ్మ ఏడరా దాన్ని పిలువ్. నా పేణం కటగట్టి పోతున్నట్టుంది."



అన్నాడు నీరసంగా కూలబడి.

హనుమంతు ఎంకన్న కొడుకు. ఇటీవలే పెళ్లయింది. హనుమంతు చిన్నతనంలో నాలుగు అక్షరమ్ముక్కలు నేర్చుకొన్నాడు. కానీ చదువుకొంటే పనిచేయలేనేమోనన్న భయం వేసింది. పైగా పంతుళ్లు చదువుపట్ల అభిరుచిని అతనిలో పెంచలేదు. ఫలితంగా చదువుమానేసి తండ్రితో పనికి పోవటం ఆరంభించాడు.

హనుమంతు మంచి బలవంతుడు 'తల దువ్వి తెల్లబట్టలేసుకొంటే నువ్వు అచ్చం ఎన్టీవోడిలాగా వుంటావురా' అంటారంతా అతడిని. అంతటి అందగాడు అంతటి పర్సనాలిటీ.

అయితే హనుమంతుడికి తానంత అందగాడినన్న స్పృహ లేదు. అలాగే హనుమంతుకు తన 'శక్తి తనకి తెలియదు.

అతనికి ఎప్పుడో కాని కోపం రాదు. వొకరి జోలికి తను పోడు. వొకరు అనవసరంగా తన జోలికి వస్తే వూరుకోడు. కోపం వస్తే అతని శక్తి బయటికొస్తుంది. అప్పుడతని ధాటికి ఎవరూ ఆగలేరు.

'ఏంటయ్యా? యింతలోనే నీ పేణానికేం వచ్చింది? అమ్మో వొళ్లు మాడిపోతుండదే?' ఎంకన్న భార్య నర్సమ్మ వచ్చి భర్త వొళ్లు చూచి అంది.

అప్పుడే పనివేళ ఆ రోజుకి అయిపోయింది. కూలీలు పనిమంచి దిగి అక్కడ డ్రమ్ములో వున్న నీళ్లతో అలసి పోయిన మొహాలని మురికి పట్టిన చేతులు కాళ్లను కడుక్కొంటున్నారు.

"నా జొరం సంగతి అటుంచాలే. బాబుగోరు నన్ను పనయ్యాక రమ్మని కబురు పేసేరు. నేనేమో అటాత్తుగా ఇట్టా పడిపోతిని యిప్పుడెట్టా?"

"ఎందుకంట?"

"ఎందుకో ఏంటో? మనకి సెప్తారా? రమ్మంటే ఎల్లి పోటమే"

"అయితే నే ఎల్లనా?" నర్సమ్మ అంది.

నర్సమ్మ మంచి పని గత్తె. వ్యవహర్త. గుండె ధయిర్యం సాహసం వున్న మనిషి.

"నువ్వెల్తే అయ్యను ఎవరు సూత్తారే? నువ్వు అయ్యతోపాటు యింటికెల్లు. నేను ఎల్లొస్తాలే.' హనుమంతు అన్నాడు.

హనుమంతు వొట్టి అమాయకుడు అని అతని తల్లిదండ్రుల అభిప్రాయం. పెళ్లయి తండ్రి కాబోతున్నా అతడు వాళ్ల కళ్లకు యింకా పిల్లాడుగానే కన్పిస్తాడు. కాగా యిద్దరు ఆడ పిల్లల మధ్య పుట్టి పెరిగిన వొకే వొక్క కొడుకాయె' గారాబం కదూ?

'నువ్వొద్దులేరా. అయ్యతో నువ్వెల్లు. నీ కోసం కోడలు ఎదురు సూత్తుంటది. నేను తొరగా ఎల్లి పని సూసుకొత్తానుగా! నువ్వయితే ఆరి యిల్లుకనుగ్గానే పరికి వడిరేయి అవుతుంది. ఆరితో ఏం మాట్లాడబోయి ఏం మాట్లాడతావో? నువ్వెల్లి ఏం మాట్లాడగలవ్ లే. నే ఎల్లొత్తా."

హనుమంతుకు రోషం పొంగుకొచ్చింది.

'అమ్మా. నేను మగాడినే. వొక ఆడ కూతురి మొగుడుని, తండ్రి కాబోతున్నా. నువ్వింకా సిన్నపిల్లాడిగా నన్ను సూట్టం నాకు వచ్చలేదే సూత్తుండు. నేను బాబు గోరితో మాట్లాడి ఎంత నేరుపుగా ఎవ్వారం ఎట్టా సక్క బెట్టుకొత్తానో? సేమంతితో నేను పని సూసుకొని వొళ్ణం ఏలకి వత్తానని సెప్పు: ఎంకి అయ్య జాగరత్త కాంపౌడరు దగ్గరేదైనా మాత్తర్లు తీసుకొని మింగించు.'

హనుమంతు తల్లికి మారు మాట్లాడే ఛాన్సు యివ్వకుండా బస్తీ వైపుకు దౌడు తీసేడు!

* * *

అసలే పగలంతా పనిచేసి అలసి పోయివున్నాడేమో హనుమంతు నిల్చొని నిల్చొని అలసి పోయాడు. కాళ్ల నొప్పులు పుట్టసాగేయి.

లోపలికి పోయే మనుష్యులకి బయటికొచ్చే మనుష్యులకి కొదవేంలేదు. కానీ ఎవర్ని పలకరిద్దామన్నా వీలుపడందే! పలుకరించిన వొకరిద్దరూ విసుక్కొన్నారు! ఏం చెయ్యటం?

హనుమంతు కాస్సేపు ఆ యిల్లు చూచాడు. మరి కాస్సేపు ఆ యింట్లోకి వెళ్లి వచ్చే ఆడ మగల అలంకరణాల్ని చూచాడు. కాస్సేపు యింటిలోపలి కన్పించే వస్తువుల సొగసుల్ని చూచాడు.

అతను బాబుగారిని ఎప్పుడో రెండు మూడుసార్లు చూచాడు. అయినా యిప్పుడు చూస్తే పోల్చేసుకోగలడు. కానీ ఎంతకీ బాబుగారు కన్పించరందే?

పొద్దుపోతోంది. చామంతి తనకోసం ఎదురుచూస్తూ కళ్లల్లో వత్తులు వేసుకొని కూర్చుంటుంది. తను వెళ్తే కాని అన్నంతినదు.

పనిలో నుంచి తనువెళ్లగానే వుడుకుడుకు నీళ్లు సిద్ధం చేసి స్నానం చేయిస్తుంది. ఆ తర్వాత దగ్గర కూర్చొని కబుర్లు చెప్తూ అన్నం తినిపిస్తుంది. ఆ తర్వాత—

'ఎవ్వడా వాడు! దొంగనాకొడుకు. అక్కడ నిలబడ్డాడు?'

'మీరన్నారు కనుక— వాడు దొంగనాకొడుకే అయ్యుంటాడు చిన్నబాబూ. ఎందుకు నిలబడ్డాడో కనుక్కొంత్తానుండండి'.



**ముచ్చట**

హుండీలో మూడొందలను మూడు సార్లుగా వేసిన భర్తను అడిగింది పెళ్లాం.

"అదేంటండీ? మూడు వొక్కసారే వేయొచ్చుగా"

"పిచ్చిదానా మొదటి వందేమో వ్యాపారంలో లాభం వచ్చినందుకు. రెండోదేమో ఇన్‌కంటాక్స్ వాళ్ల బారినుంచి బైట పడ్డందుకూ, మూడోదేమో వంశం నిలబడినందుకు"

"అయ్యో నాకు పిల్లలు పుట్టందే?"

"బావుంది. వంశం నిలబడాలంటే నీకే పిల్లలు పుట్టాలిటే వెర్రిదానా?"

—కె.సురేఖ (హైదరాబాద్)

చినబాబు!?

పెదబాబును చూచినట్లే సంతోషించి పోయాడు హనుమంతు. వాళ్ల తిట్లు అతడిని బాధించలేదు.

చినబాబు అని పిలవబడే శ్యాప్ సుందర్ ధనంజయరావుగారి నలుగురు సుపుత్రుల్లో మూడోవాడు. పట్నంలో ఎక్కడో డిగ్రీ చదువు చాలా రోజులుగా చదువుతూనేవున్నాడు. చదువుకన్నా కాలేజీ రాజకీయాలంటే, బారులంటే, అమ్మాయిలంటే అతనికి ఆసక్తి. వాటికి కట్టుబడిపోయిన అతను కళాశాల చదువును వృత్తిగా స్వీకరించాడు.

అతను బొత్తిగా డబ్బులు లేనప్పుడు, అక్కడి ఆడ పిల్లల్తో బాగా విసిగిపోయినప్పుడు 'ఛేంజ్'కోసం స్వంత వూరికి వస్తాడు. వచ్చిన దగ్గరినుంచీ అతని పని వేటే! ఆడ పిల్లల వేట!

పేకాట, మందు, వేట ఏదీ ఒంటరిగా చేసేది కాదు. అంచేత అతనికి తోడు కావాలి. అయితే అతను పుట్టి పెరిగిన ఆ వూళ్లో అందరితో స్నేహం చెయ్యడు. 'స్టేటస్'కి తప్పనిసరిగా ప్రాధాన్యత యిస్తాడు. అలాంటి వాళ్లేరీ ఆ వూళ్లో?

అంచేత తండ్రి పెంచి పోషించే రౌడీ గ్రూపులో రత్తయ్య అతనికి ఆ వూరొస్తే తోడు.

ధనంజయరావు మాంసం ముక్కలు పెట్టి పోషించే కుక్కల్లో రత్తయ్యొకడు. రత్తయ్య ధనంజయ రావు దగ్గర కానీ అతని కుటుంబం వారి వద్దకానీ పిల్లిలా వుంటాడు. ఏం చేయమంటే అది చేస్తాడు. ఉచ్చనీచాలు ఆలోచించడు. చెప్పింది చెయ్యటమే తన ధర్మ మన్నట్లు భావిస్తాడు. స్వంత బుర్ర వున్నట్లే కన్పించదప్పుడు-కానీ-యితరుల వద్ద తానో పెద్ద మేధావిలా, గొప్ప వాడుగా పోజు గొడ్తుంటాడు.

'యీడు బాబూ మనకూలోడు'

తన గోడు చెప్పుకొనే అవకాశం వచ్చింది హనుమంతుకు."అవును బాబూ మేత్తిరీ ఎంకన్న కొడుకు హనుమంతుని. పెదబాబు గోరు మా అయ్యను పనయ్యాక వోపాలి కనబడమని కబురు సేసినారంట. కానీ మా అయ్యకు అటాత్తుగా జొరం వచ్చింది. అందుకని నేనొచ్చినాను. సినబాబూ.. పెదబాబుగోరు———"

"ఓ రాగరా ఎదవ దొంగనాకొడకా. నేనీడ వుండగా సినబాబు గోరితో నువ్వే నీ యిసమంతా సెప్పుకొంటున్నావేం సినబాబుగోరికి నీ మీద ప్రేమ పుట్టి నీ దగ్గర ఆగేరనుకొన్నవా? నువ్వు సెప్పే సొల్లు కబుర్లన్నీ ఇనటానికి ఆరికి టైమ్ లేదు. ఆరిప్పుడు అర్జంటుగా ఎళ్తున్నారు" రత్తయ్య అన్నాడు.

శ్యామ్‌సుందర్ అర్జంటుగా వెళ్తున్నట్టు అతని వేషమే చెప్తోంది. సిల్కులాల్చీ.... సిల్కు పైజమా... నున్నగా దువ్విన క్రాపు సెంటుకంపు చేతికి మల్లెపూల దండ... కళ్లల్లో కైపు...

"పెదబాబు గోరితో నాకేం పని లేదు బాబూ. ఆరే కబురు పెట్టినారు మా అయ్యకు. పనేంలేందే ఆరెందుకు కబురు పెడ్తారు? ఇప్పటికే ఆలిస్యం అయింది పెదబాబు గోరు..."

'ఒరే! ఎవడ్రా ఈ ఎర్రి నాకొడుకు! పెదబాబుగారు... అంటే మా అయ్య, మా అబ్బ, మా నాన్నగారైన ధనంజయ రావుగారు — రాత్రిళ్లు ఎక్కడుంటాడో కూడా తెలీని వెర్రినా కొడుకు రా రత్తిగా వీడు. పోరాభే... పో.. నువ్వేం పెద్ద గవర్నరువా? మంత్రివా? ఫిలిప్స్ స్టార్‌వా? మా అయ్య ఎక్కడుండేదీ నీకు నేను చెప్పాలా? మా నాన్నని కలుసుకోటం ఆలస్యం అయిందని ఇక్కడ నిల్చొని ఏడిస్తే ఏం లాభం? ఆయన ఎక్కడున్నాడో కనుక్కొని వెళ్లాలి. వెళ్లు.'

'అయితే పెదబాబు గోరు ఏడుంటాడో సెప్పండి బాబు. ఎల్లి కలుసుకుంటాను. అర్జి ఎంటనే దరసెనం సేసుకుంటాను'

ఈ లోగా రత్తయ్యకు ఏదో ఫ్లాష్ వెలిగింది మెదడులో.

"బాబుగారూ అన్నట్లు ఇప్పుడే ఓ విషయం గురుతుకు వచ్చింది. ఈ దొంగనాకొడుకు ఎవరనుకున్నారు? తమరు పోయిన మాటు — అదే ఎన్నార్థం క్రితం ఈడకొచ్చినాప్పుడు నో పిట్టను చూసారు. గుర్తుందా? సేతికి సిక్కినట్లే సిక్కి జారిపోయిందే — సేమంతి — దాని మొగుడు వీడు."

''చేమంతి! పూబంతి! అంటే కూలీపని చేసే గురవయ్య కూతురేనా?' అంటూ చామంతి అంగాంగ వర్ణన చేయసాగేడు శ్యామసుందర్. గురవయ్యది ఆ బస్తీనే. కూలీపని చేస్తూ చచ్చిపోయాడు.

వింటున్న హనుమంతుకు ఓవైపు అసహ్యం — మరోవైపు సిగ్గు కలిగేయి. అతను అక్కడి నుంచి వెళ్లిపోబోయాడు.

'ఆడి కాళ్లిరగ్గొట్టి నిలబెట్టరా. నేను చామంతిని గురించి మాట్లడుతుంటే వాడట్లా వెళ్లిపోతాడేం? బుద్ధిలేదా చామంతి నాకిప్పుడు కావాలి.'

''బాబుగారూ...'' హనుమంతుకు కోపం వచ్చింది. కళ్లు ఎర్రనయ్యాయి. తనని తాను మార్చిపోయాడు. శ్యామ్‌సుందర్ వైపు ఆవేశంగా నాలుగడుగులు వేసేడు.

''ఏరోయ్ — సినబాబుగోరినే అరస్తన్నావ్? ఆరివైపునే అడుగు లేస్తన్నావ్? సేనాలతో



## అసూయ పెళ్లిళ్లు

ఇప్పటికీ బహుభార్యాత్వం అనేక దేశాల్లో అమలులో ఉండడానికి చక్కని నిదర్శనం ఆఫ్రికా ఖండంలోని 'గాబోన్' దేశం. అక్కడి మగవారికి ఐదు నుంచి ఆరుగురి దాకా భార్యలు ఉంటారట! ఒకే భార్య వుంటే సుఖంగా ఉండదని వారు ఎక్కువ భార్యల్ని పెళ్లి చేసుకుంటారట! ఒక భార్య మరొక భార్యమీద 'అసూయ'తో భర్తను మంచిగా చూసుకుంటుందనే నమ్మకమే మగవారు ఎక్కువగా వివాహాలు చేసుకునేట్లు చేస్తోందట! ఇదేదో బాగుంది కదుసార్! మరీ ''అసూయ'' పెంచడానికి భార్యల్ని పెంచడం... వింతైన విషయమే!

—జూపిటర్

బతకాలని లేదా?''

రత్తయ్య బెదిరింపు వినిపించింది హనుమంతుకి. కోపం చినబాబు నుంచి రత్తాలు వైపుకు మళ్లింది.

"నా పెళ్లాన్ని గురించి మాట్లాడ్తే నా కొడుకా, నిన్ను నరికి పోగులు పెడ్తా" హనుమంతు పులిలా రత్తయ్య వైపు దూకేడు.

రత్తయ్య హనుమంతును చూచి వో అడుగు వెనక్కు వేయబోయాడు. అంతలోనే వాడు కూలివాడని, తాను రౌడీనని, గుర్తుకొచ్చింది వాడికి.

చ(రువ పేంటు జేబులో నుంచి పెన్‌నైఫ్ తీసేడు.

"ఒకసారి గాదురా. నీ పెళ్లాన్ని గురించి పదిసార్లు నేను మాట్లాడుతా. మా బాబుగారు మాట్లాడుతారు — మాట్లాడటమేకాదు — మా సినబాబుగారు ఏంకోరేరో విన్నావుగా? ఆరెం పెయ్యమంటే పేపే పూచీ నాది."

అలా మాటా మాటా పెరిగింది — ఇద్దరి మధ్య కత్తి తీసుకుని రత్తయ్య హనుమంతుపైకి దూకేడు.

హనుమంతు ఎడం చేతితో రత్తయ్యను కోడిపెట్టను పట్టుకున్నట్లు పట్టుకున్నాడు. కుడిచేత్తో వాడి చేతిలో కత్తిని లాక్కున్నాడు.

"ఎదవనా కొడకా. పేణం తీస్తా – ఏటనుకొన్నావో?

నా పెళ్లాన్ని — సేమంతిని ఎప్పుడన్నా ఎవరైనా ఏమన్నా అన్నారో...''

హనుమంతు ఆవేశంతో మాట రాక ఆగేడు.

అలా ఆగటమే పొరపాటైంది.

ఆ క్షణంలో రౌడీ రత్తయ్య అహం దెబ్బతింది.

"ఒరేయ్. నేను రౌడీ రత్తయ్యని. చామంతి – నీ పెళ్లాం. బోడిలంజ... అదెంత? నువ్వెంతరా నాకు?"

'ఒరేయ్....'

నరసింహస్వామి అవతారం దాల్చిన వాడిలా ఊగిపోతూ అరిచేడు హనుమంతు. అతనుకి ఆవేశంతో సర్వాన్ని మర్చిపోయాడు. అరుస్తూనే చేతిలో కత్తిని కోపంగా కసిక్కిన రత్తయ్య గుండెల్లో పొడిచాడు. కానీపొడిచే నన్న స్పృహ అతనికా క్షణంలో లేదు.

రత్తయ్య అరవలేదు.

అలాగే నేలకి వొరిగిపోయాడు.

శ్యామ్‌సుందర్ భయంతో లోపలికి పారిపోయాడు.

హనుమంతు కళ్ల ముందు వోక్షణం నల్లటి తెరకప్పినట్లయింది. ఏం జరిగింది? తానేం చేసేడు? రత్తయ్య పడిపోయాడేం?

ఆ తర్వాత జరిగింది తెలిసి వచ్చింది అతనికి.

తను రత్తయ్యను హత్యచేసేడు. పిరికితనం ఆవహించింది. కోపపు నిషా దిగిపోయింది! భయం! హనుమంతు భయంతో గిరుక్కున వెనక్కి తిరిగి పరుగెత్తసాగాడు.

అతని కళ్లముందు పరుగెత్తే బాట మాత్రమే కనిపిస్తున్నది. మిగతా లోకమంతా అతనికి — చీకటి! చీకటి?

* * *

చామంతి భర్తకోసం నిరీక్షిస్తూ అలా ఎంతసేపు కూర్చుందో? క్రమంగా ఆమె గుండెల్లో ఏదో గుబులు బయలుదేరింది.

'వాడొస్తాడ్లే. సిల్మాకే ఎల్లేడో, నీ అమ్మను ఇసేరించి రావడానికే ఎల్లెడో... వత్తాడ్లే. నువ్వు ఇంత ... పడుకో. నువ్వసలే వొట్టిపిల్లవి కాదు' నర్సమ్మ కోడల్ని హెచ్చరిస్తూనే ఉంది.

చాలాసేపు జ్వరంతో, తలనొప్పి వొళ్లు నొప్పుల్తో బాధపడ్డ ఎంకన్నకి కాంపౌండర్ ఇచ్చిన గోలీ మింగినాక చెమట పట్టింది. జ్వరం దిగింది. ఆ తర్వాత నిద్రకూడా పట్టింది.

మొగుడిని కనిపెట్టుకుని మంచం పక్క కూర్చున్న నర్సమ్మ ఎంకన్న నిద్రలోకి జారుకోగానే, తనూ అలసటగా ఆ మంచం కోటికి తల ఆన్చింది. ఎప్పుడు నిద్ర పట్టిందో ఏమో?


మామ, అత్త నిద్రపోతున్నారు. ఇదే సమయం—

ఆమె తలుపు దగ్గరగా వేసి బయటి కొచ్చింది. చేతిలో చిన్న బేటరీ లైటు వుంది.

హనుమంతు బస్తీ నుంచి ఊళ్లోకి వస్తే ఇంటికి ఎప్పుడో వచ్చేవాడు. బస్తీలో ఇంతసేపు ఏం చేస్తున్నట్లు?

తనులేకుండా, తనకి చెప్పకుండా సినిమాలకెళ్లడు.

బస్తీలోనే తన అమ్మ వుంది. కానీ మూడు రోజుల క్రితమే సినిమాకెళ్లి తామిద్దరూ



అమ్మను చూచొచ్చా రు.

"ఏడకే సేమంతీ? ఈ ఏళప్పుడు బయల్దేరేవు?"

'అనుమంతు బస్తీపోయాడు పిన్నమ్మా, ఇంకారాలేదు. అట్టా ఎల్లి సూసొద్దామనీ...'

'ఏడకని ఎల్తావ్! ఆడకూతురివి. మీ మామయ్యో అత్తమ్మనో ఎతకటానికి పంపకపోయావా?' అంటూ పిన్నమ్మ తనదోవన తను వెళ్లింది.

ఆ ఊరి నుంచి బస్తీ కెళ్లడానికి రోడ్డు మార్గంకాక మరి రెండు దగ్గర మార్గాలున్నాయి. ఒక మార్గం కట్టుబడి జరుగుతున్న తావు నుంచి వెళ్తుంది. రెండోది కాస్త దూరం అవుతుంది.

ఏ మార్గంకుండా వెళ్లాలన్నా ఊరు చివరమున్న పాడుబడ్డ దేవాలయం ముందు నుంచి వెళ్లాల్సిందే. దేవాలయం విజయనగర రాజుల కాలం నాటిదని చెప్తారు. ముఖ్యమైన శిల్పాలన్నీ ఆ ఊళ్లో ఇళ్ల కట్టుబడికి ఉపయోగించబడ్డాయి.

ఆ దేవాలయంలోని గర్భగుడిలో దేముడు లేడు. గబ్బిలాలు, సాలీడులు, వాటితోపాటు చీకటి పనులుచేసే వారికి అది ఆవాసం. పగులంతా పనిలేని వాళ్లు పేకాడ లాడుతారు అక్కడ.

ఆలయానికి ముందు పాడుబడిన వో కోనేరు ఉంది. ఏటిలో నీరన్నీ ఎండకాలంలో ఎండిపోతుందేమో కాని ఆ కోనేటిలో నీరు మాత్రం ఎండిపోదు. ఆ కోనేటి గుండా ఎక్కడికో రహస్య బిలమార్గం వుందని, ఆ మార్గం ఎక్కడో కొండల్లో వున్న ఓ జలపాతం దగ్గరికెళ్తుందని, అందుకే ఆ కోనేటిలో నీరు ఎప్పుడూ ఎండదని అక్కడి జనం కథలు చెప్పుకుంటుంటారు.

కానీ ఆ కోనేటిలో నీరు ఎల్లవేళలా వుంటాయన్నది సత్యం. ఆ కోనేటి లోతు ఒక్క ప్రాంతంలో గజ ఈతగాడికి కూడా అందదన్నది కూడా సత్యమే. ఆ నీరు పచ్చగా వుంటాయన్నది కూడా సత్యం. ఆ కోనేటిలో దూకి ఎందరో ఆత్మహత్యలు చేసుకున్నారు. మరెందరివో హత్యలు చేయబడి అందులో వేయబడ్డారు. అందుకే ఆ కోనేరును 'చావుల బావి' అని పిలుస్తుంటారు ఆ ఊళ్లో.

కోనేరు చుట్టూ, గుడిచుట్టూ ముళ్లకంపలు దట్టంగా పెరిగి వుంటాయి.

ఎవరైనా వ్యక్తులు కన్పించకపోతే ముందు ఆ కోనేరు దగ్గర, గుడి దగ్గర వెతకటం ఆ గ్రామస్తులకే కాక చుట్టు పక్కల ఊళ్ల వాళ్ల క్కూడా అలవాటు.

దేవాలయం దాకా వచ్చి ఆగింది చామంతి.

అసంకల్పితంగానే ఆమె దృష్టి కోనేరుపైకి, గుడిపైకి మళ్లింది. చీకటిగా వుంది!

బస్తీలో పెదబాబు గారింటి కెళ్లిన హనుమంతు గుళ్లో ఎందుకుంటాడు? కోనేటి వొడ్డున కూర్చుంటాడా?

ఆ భావనా మాత్రంగానే ఆమె శరీరం భయంతో గగుర్పొడిచింది. ఛీ... ఏమిటీ పాడు



ఆలోచన?

ఆమె ముందుకు అడుగు వెయ్యబోయింది. కానీ అడుగు పడలేదు.

ఏమో? ఎలాగూ ఇక్కడిదాకా వచ్చింది కనుక ఒకసారి చూచివెళ్తేనేం?

కానీ చీకటి... తను ఆడది... ఒంటరిగా... ఆ ఆలోచన ఆమెకు రాలేదు. భయం

కలుగలేదు.

టార్చిని దేవాలయం వైపు ఫోకస్ చేసింది. అక్కడ ఏమీ అలికిడి లేదు.

కోనేరువైపు వేసి చూచింది. అక్కడా ఏమీ అలికిడి లేదు.

చామంతి బేటరీ లైటు వెలుగులో దేవాలయంలోకి ప్రవేశించింది. ఆమె ప్రవేశంతో నిద్రా భంగమైన ఏవో పక్షులు శబ్దాలు చేసేయి. ఆ శబ్దాలు తప్ప అంతా నిశ్శబ్దం. గర్భగుడిదాకా వెళ్లి లోపలికి లైటు వేసి చూసింది.

ఆమె వెను దిరిగి దేవాలయం దాటబోతోంది.

పక్కనే ఏదో జరజరా పాకుతున్న శబ్దం.

లైటు వేసింది. పాము!

పల్లెటూరి వాతావరణంలో శ్రామిక జీవుల మధ్య పుట్టి పెరిగిన చామంతికి పాముల స్వభావం పెద్ద పెద్ద సైంటిస్టుల కన్నా బాగా తెలుసు.

అంచేత ఆమె భయపడలేదు. ఆ పాము తన తోవన తాను పోయిందాకా కదలకుండా నిలబడి ఆ తర్వాత కోనేరువైపు నడిచింది.

తాను అనవసరంగా భర్త కోసం అక్కడ వెతుకుతున్నానని ఆమెకు మనసులో ఏమూలోవుంది. కానీ సందేహ నివృత్తి మంచిది కదా?

ఆమె కోనేటి వొడ్డున మెట్లపైకి లైటు ఫోకస్ చేసింది.

అక్కడ... అక్కడ...

అదేమిటి?

ఆమె కాళ్లు అక్కడికి పరుగెత్తేయి. గుండె దడదడ కొట్టుకుంది.

ఎవరివో పురుషుడి బట్టలు!

కానీ ఆ బట్టలుహనుమంతువి కావు. ఆమె ఊపిరి పీల్చుకుంది తేలికగా!

కోనేటిలోకి లైటు ఫోకస్ చేసింది.

అక్కడ నీటి మీద తేలుతోంది వో శవం.

ఆ శవం బోర్లా పడివుంది నీటిపైన!

చామంతి శిలా ప్రతిమలా అలా నిల్చుండిపోయింది.

* * *

కొన్ని క్షణాల తర్వాత షాక్‌నుంచి తేలుకొన్న చామంతి గిరుక్కున వెనక్కి తిరిగి పరుగెత్తసాగింది. చేతిలో బేటరీ లైటు స్విచ్‌ని ఎప్పుడు 'ఆఫ్' చేసిందో? మళ్లీ తిరిగి ఆన్ చేద్దామన్న ధ్యాసేలేదు. అసలు ఏ ధ్యాసలేదు ఆమెకు.

ఆమె కళ్లముందు నీటిలో తేలి యాడుతున్న శవం వుంది. ఆ శవం.... ఆ శవం... ఎవరిది?

అంతలోనే హనుమంతు రూపం ఆమె కనుల ముందు ప్రత్యక్షమైంది. శవం.

హనుమంతు...!

ఆమె వందగజాలు పరుగెత్తితే కాని బాట పైకి రాదు.

ఆ వంద గజాలు పరుగెత్తి బాట ఎక్కబోతోంది.

అంతలో చీకట్లో దేనినో గుద్దుకున్నట్లయింది.

భయంతో 'కెవ్వు'మని కేకవేసింది!

నిలబడి తను ఢీకొట్టు కొన్న పదార్థాన్ని చూసింది.

మరో మనిషి ఆకారం!

ఆ శవం తాలూకు వాళ్లు కానీ కారుకదా? లేకపోతే ఆ వ్యక్తిని హత్యచేసిన జనం కాదుకదా?

ఆమె ధైర్యం తెచ్చుకుంది. కర్తవ్యాన్ని మననం చేసుకుంది. చేతిలో బ్యాటరీ లైటు స్విచ్‌ని నొక్కి ఆ వ్యక్తి మీదికి ప్రసరించింది.

ఆ వ్యక్తి నిలువు గుడ్లు వేసి తనవైపే చూస్తున్నాడని గ్రహించిందామె. కానీ ఆ వ్యక్తి... ఆ వ్యక్తి ఎవరు?

* * *

'అత్తమ్మా...' చామంతి మెల్లగా పిలుస్తూ ఆత్రంగా నర్సమ్మను లేపింది. నర్సమ్మ, భర్త మంచం కోడికి తల ఆనించే నిద్రపోయింది.

'ఇదేంటే? పాడు నిదుర. ఆయనకట్టా వుంటే నీకు నిద్రెలా పట్టిందో? వాడు అనుమంతు వచ్చాడా?'

"ఊఁ. కానీ పెద్దగా అరవకండి. మీరో పాలి ఇట్రటండత్తమ్మా!' చాలా రహస్యంగా అంది చామంతి.

"ఏంటే! వుండు. ఆయనకెట్టుందదో! జోరం సూసివత్తాను"

ఎంకన్న వొంటిమీద చెయ్యివేసింది. చల్లగా వుంది. జోరం దిగిపోయిందన్నమాట!

"అనుమంతు వచ్చాడన్నావుగదే! ఏడీ వాడు?" కొడుకు కోసం ఇల్లంతా కంటితో వెతుకుతూ అంది నర్సమ్మ.

"ఆయన్నీడికి తేలేదు. ఆయనున్న కాటికి నిన్ను తీసికెళ్తానని వచ్చా"

"ఏంటే? అసలేం జరిగిందే?"



కట్టుకున్నా

రాత్రి పదకొండింటికి ఇంటి కొచ్చిన మొగుణ్ని దులిపేసింది పెళ్లాం.

"మీరు నన్ను కట్టుకున్నారా? దుకాణాన్ని కట్టుకున్నారా?"

"ముందు దుకాణాన్ని కట్టుకున్నందుకే కదే మీ నాన్న నిన్ను నాకు కట్టబెట్టింది—"

—కె.సురేఖ (హైదరాబాద్)

'ఆయన హత్తేసేసొచ్చాడు అత్తమ్మా. బాబుగోరి ఇంట్లో... ఆరి కొడుకు కళ్ల ముంగల ఎక్కడో రవుడీ ఎదవను కత్తిపెట్టి పొడిపి సంపెండంట!'

"ఎవుడు? మన అనుమంతే! సంపిండా? నేన్నమ్మను"

'సాయంగా ఆడే సెప్పేందు అత్తమ్మ. ఆడి బట్టలంతా రగతం. సెయ్యి రగతం...!

'మరి వాళ్లు. పట్టుకోలేదూ?'

"ఊరికి అడ్డంబడి లగెత్తుకు పారొచ్చినాడంట. నేను ఆడికోసం ఎదగటానికెళ్తే గుడికాడ ఎదురయ్యాడు. ఆడిని పోలేరమ్మ గుడికాడ కూకోపెట్టి నే నీడకొచ్చినా. నాకు భయంగా వుంది అత్తమ్మా. అనుమంతును పోలీసోళ్లు పట్టుకెల్తారేమో! అత్తె సేత్తే మరి సిచ్చ ఏత్తారంట నేనిన్నాను. నా పసుపు కుంకం నిలుపత్తయ్యా." అత్తయ్యను కౌగిలించుకుని ఏడ్చింది చామంతి.

విషయం వినంగానే నర్సమ్మకూ మతిపోయింది ముందు. ఆ తర్వాత ఏడుపు... భయం... ఆలోచన.

'ఇప్పుడేం సేద్దామంటావ్?' నర్సమ్మ అంది కోడలితో.

'ఆడిని మూడోకంటికి తెలీకుండా ఊరుదాటించెయ్యాలి రేత్తిరికి రెత్తిరి!'

'ఎట్టా?'

ఇద్దరూ కలిసి ఆలోచించారు. చామంతి తాను హనుమంతు వెతకటానికి గుడికి కోనేరుకు వెళ్లి చూచిన భోగట్టా చెప్పింది.

'శవమా! అదెవరిది?'

'ఏమో? నాకు తెలీదు. సూడగానే నేను అనుమంతును ఎవరన్నా సంపి ఆడనేసేరేమో నన్ను భయంవేసి లగెత్తుకుంటావుంటే ఆడే ఎదురయ్యిందు.'

వొక్కక్షణం ఆలోచించింది నర్సమ్మ.

'అయితే ముందు నువ్వు ఇంట్లోకి పోయి ఆడికి తింటానికి రెండ్రోజులు సరిపడ ఆహారం ఏదన్నా మూటకట్టు. ఆడిబట్టలు సంచిలో పెట్టు. ఆడినిక్కడి నుంచి ఎట్టాగొట్టా అవతలకి దాటేస్తే పోలీసుల ఇసయం మనం జోసుకో వచ్చు.'

క్షణంలో ఆపని చేసింది చామంతి.

నర్సమ్మ తను కూడబెట్టిన డబ్బునంతా తీసింది. వంద రూపాయలన్నా లేవు ఇంట్లో.

'డబ్బు లేకపోతేనేం అత్తమ్మా. నాకాడ మా పుట్టింటోల్లు పెట్టిన ఈ బంగారు దండవుంది. మీరు పెట్టిన ఈ కమ్మలు వున్నాయి. ఇవి ఇచ్చిపంపిద్దాంలే'

'కానీ సేమంతీ. ఆడింక ఇప్పుడిప్పుడే నీ కంటికి కనిపించాడు. మనదగ్గరికి రాడు. ఆడు ప్రాణాలతో బతికుండాలంటే ముందు ఆడిని మనం మన మనసుల్లో సంపేసుకోవాలి.'

'ఎక్కడోక్కడ ఆడు సుకంగా వుంటే నాకదేసాలు అత్తమ్మా. మీ మాటలు ఇంటుంటే నాకు దైర్యమొత్తోంది. తొరగా పదండత్తయ్యా. అనుమంతు వొంటరిగా...

బయుబదుతుంటాడు'

వాళ్లిద్దరూ వెళ్లేసరికి హనుమంతు వాళ్లకోసమే ఎదురుచూస్తున్నాడు. ఎక్కడే సవ్వడి అయినా అది పోలీసులే అనుకుని వులిక్కిపడ్తున్నాడు. కలుగులో పందికొక్కు కిచకిచమన్నా, చెట్టు మీద పక్షి కిలకిలమన్నా పోలీసుల విజిల్స్ అనుకుని భయపడ్తున్నాడు.

తల్లిని, భార్యను చూడంగానే అతనికి కాస్త దైర్యం వచ్చింది. తల్లి చెప్పిన దంతా విన్నాక అతనికి పూర్తిగా ధైర్యం వచ్చింది. కానీ అంతలోనే ఏడుపొచ్చింది.

'కానీ... కానీ వోయమ్మా... నిన్నూ, అయ్యనూ, సామంతిని, దానికి పుట్టబోయే బిడ్డను ఇందరొన్నిదులుకుని నేనెక్కడో బ్రతికితేనేం? సత్తేనేమే అమ్మా... పోయి పోలీసులకు లొంగిపోతే పోలా?'


'పోలీసులకి వొంగిపోతే ప్రాణం పోతుందిరా బిడ్డా. నువ్వు ఏడో సోట బతికుంటే నీ హమ్మకుసాలు. అయ్యకుసాలు. నీ పెళ్లాంకూడా అదే పదివేలంటోంది. నీకు వురి పిచ్చయేత్తారంటే, వూరితీత్తారంటే... ఆ ఆలోసెనే బయుంగా వుందిరా. నువ్వు పారిపోరారేయ్. ఇందులో రెండ్రోజులకు సరిపడ తింటానికి వుంది. ఇదిగో డబ్బు. ఇది సాలకపోతే నీ పెళ్లాం సొమ్ము... ఇది అమ్మేసుకుని బతుకు. కానీ మనూరికి అయిదొందలమైళ్ళ దూరంలో వుండబాక. ఇడ మంచి లారీ ఎక్కి రైలుటేసన్ వున్న ఊరు చేరు. ఆడ రైలెక్కి దూరంగా పారిపో. ఏదో నీ పొట్ట నువ్వు పోసుకుంటూ బతుకు. ఎప్పుడో అంతా ఈ ఇసయం మర్చిపోయాక ... కబురు తెలియజెయ్యి.'

'మరిక్కడ పోలీసు లొత్తే... నన్ను గురించి అడిగితే ఏం సెప్తారే అమ్మా?'

"అదంతా మేము చూసుకుంటాంగా నువ్వు పద ముందు. మళ్లీ ఎవరైనా చూస్తే ప్రమాదం."

బస్తీ వైపుకాకుండా దానికి వ్యతిరేక దిశను బట్టి ముగ్గురూ కాస్తంత దూరం నడిచి

## ఏడాది పాడవని ఆలుగడ్డ



రిఫ్రిజిరేటర్లలో కూరగాయల్ని పాడవకుండా వారం పదిరోజులదాకా ఉంచవచ్చు. అయితే బొగ్గుపులుసు వాయువు, ఓజోన్, గామా కిరణాల సహాయంతో కూరగాయలు, పళ్లను మామూలు పద్ధతులకంటే కనీసం పదిరెట్లు ఎక్కువ కాలం నిల్వ ఉంచే పద్ధతిని రష్యాకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఫిజిక్స్ శాస్త్రవేత్తలు రూపొందించారు. ప్రథమ ప్రయత్నంగా వీరు తమ పరిశోధనల్ని బంగాళా దుంపలతో చేశారు. ప్రయోగశాల పరీక్షలలో బంగాళాదుంపలు 12 నెలలపాటు పాడవకుండా రుచికరంగా ఉన్నట్లు వారు అంటున్నారు. గామా కిరణాలతో తాపడం సురక్షితమైనదే కాక, అంటువ్యాధుల్ని కూడా తగ్గిస్తుందని రష్యన్ శాస్త్రవేత్తలు రుజువుచేశారు.

—జూపిటర్

రోడ్డుమీది కొచ్చారు.

రోడ్డుమీద వెళ్లే వాహనాలు వచ్చేవాహనాలు. లారీలు, పట్నం వెళ్లేబస్సు, నాలుగు చిన్నకార్లు, రెండుజీపు లు...

వాటిని అక్కడ ఆపి హనుమంతును ఎక్కించి వీడ్కోలిచ్చి పంపటం అసంభవమేకాదు. ప్రమాదకరమని కూడా తోచింది నర్సమ్మకు.

'లారీ వోళ్లు ఆపుతారోలేదో కానీ ఆ కారుల్లో పెద్దోళ్లైనలై నా మనల్ని మాత్తే ప్రమాదంరా అనుమంతూ మన్నీడ ఉండొద్దు. లేతిరంతా నడగల్గినంత నడువు. సాలా దూరంపోయాక తెల్లవారుతుండగా కనిపించిన బస్సెక్కి ఎల్లిపో' అంది నర్సమ్మ.

'నాకు అదే మంచిగా వుంటుందని పెత్తుందదే మా అమ్మో. ఈడ నేను విల్సోను ఎల్తాను'

హనుమంతు తల్లిదగ్గర వీడ్కోలు తీసుకున్నాడు.

చామంతి కన్నీళ్లతో అతడికి వీడ్కోలిచ్చింది.

'నా బిడ్డ... నా బిడ్డ జాగరత్తే సామంతీ... ఆడికి ఈ హత్తె ఇసయం ఎప్పటికీ తెలియనియ్యమోక... నేను ఏడనన్నా డబ్బు సంపాదించాక మిమ్మల్ని ఆడికితీసికెళ్తాగా? దిగులు పడమోక'

అతను రోడ్డు దిగి చీకటిలో పరుగెత్తబోయాడు.

'మామా... అనుమంతూ... వొక్క నిముసం ఆగు'

చామంతి అతని దగ్గరికి పరుగెత్తుకుంటూ వెళ్లింది.

'రేత్తిరికి ఆయిగా నిద్దరపోదామని వచ్చారేమో! సాపిట్టిదాన్ని — నిన్ను ఈ మట్టిలోరాళ్లల్లో పరుగెత్తిస్తున్నా. నా కోసం కట్టపడయ్యో. నీ బిడ్డకోసమన్నా నువ్వు సేమంగా వుండు.'

ఆమె అతని కాళ్లకి వంగి నమస్కరించింది. అతను ఆమెను కౌగిట్లోకి తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు.

చామంతి అతని చేతిలో టార్చిలైటు వుంచింది.

'సీకట్లో దారి తెలీనప్పుడు వుపయోగిత్తది. దీన్ని జేబులో వుంచుకోయ్యో. ఇది మీట వొక్కితే ఎలిగే దీపం. కానీ నా కడుపులో మనిద్దరి ఎలుగు, పేమదీపం వుందని గురుతుంచు కుంటావుగా?'

హనుమంతు ఆమెచెయ్యి ప్రేమగా నొక్కి చీకట్లో కలిసిపోయాడు.

అత్తాకోడళ్లు వెనక్కి తిరిగి ఊళ్లోకి వచ్చారు.

'కంట్రెక్టరు బాబుగారు పిలిత్తే ఆరి ఇంటికాడికి పొద్దుగూకమాటు పోయిన అనుమంతు గాడు ఇంతవరకు ఇంటికి రాలేదు అన్నయ్యో. మీకెక్కడైనా కనిపించాడా?' అలా ఊళ్లో ముఖ్యులైన వాళ్లందర్ని నిద్రలేపి అడిగింది నర్సమ్మ. అందులో వీరభద్రం కూడా వున్నాడు.

వీరభద్రం ఊళ్లో మోతుబరి రైతు.

ఇలోగా చామంతి వో సంచిలో హనుమంతు విడిచేసిన బట్టల్ని తీసుకుని కోనేరు దగ్గరికెళ్ళింది. అక్కడ మెట్లమీద బట్టలకి దగ్గర ఆ బట్టల్ని వుంచింది.

అత్తకోడళ్లు ఇద్దరూ కలిసి ఇంట్లో కొచ్చారు.

ఎంకన్న మేలుకుని వున్నాడప్పటికి.

'ఏడకి పోయారే మీ ఇద్దరూ? ఈ వేళప్పుడు ? హనుమంతు గాడేడి?'

'ఆడు అప్పటినుంచి ఇంటికి రాలేదయ్యా. మవ్వేమో వొళ్లు తేలికుండా పడుంటివి. ఏం సేయటానికి తోచక ఈరభద్రం అన్నయ్యను, అట్టాగే ఊళ్లో నలుగుర్ని ఆడి కబురు అడిగొత్తన్నాం.'


'హనుమంతు గాడు ఇంతవరకూ రాలేదా? మీకెమన్నా బుద్ధుండదా? నన్నులేపొద్దూ? ఆడసలే వొట్టి తెలివితక్కువ మొద్దు. ఆడ బాబుగారితో ఏం మాట్టాడబోయి ఏం మాట్టాడేడో? అసలారిని కల్సేరా లేదో? నేను ఎల్లిసూసేత్త మందు లేసకుండా ఈరభద్రం గోరింటికి ఆరింటికి ఈ రింటికి ఎల్లి ఆరా తీస్తే ఏం వాభం అంట!'

''నీప్పేణం అసలే బాగానేదు. జొరంతో పడున్నావు. ఇప్పుడేడ కెళ్తావయ్యా. ఆడు పొద్దుపోయిందని అత్తగారింటోనే తొంగున్నాడో లేక సిన్మాకే ఎల్లేడో...'

''సరేలే. పురాణం... అంటూ భార్యను ఛీదరించికొట్టి పై పంచ దులిపి బుజానవేసుకున్నాడు ఎంకన్న.

చెప్పుల్లో కాలుదూర్చబోతుండగా వాకిట్లోకి జీపు ఆగినశబ్దం అయింది.

'అదిగో. అనుమంతుగాడే అయ్యుండాలే. బాబుగోరు ఆడిని జీపులో పంపేరేమో' అని



ఆనందంతో బిగ్గరగా అరుస్తూ వాకిట్లోకి వచ్చాడు ఎంకన్న.

జీపులో నుంచి దిగుతున్నపోలీసుల్ని చూసేసరికి అతనికి భయంతోపాటు ఆనందమూ కలిగింది.

వాళ్ళు తన కొడుకు ఆచూకీ తెల్పకపోతారా అన్న ఆశ!

* * *

పరిగెత్తేడు... పరుగెత్తేడు...

హనుమంతు పరుగెత్తుతూనే వున్నాడా రాత్రంతా.

అతను ఎవరో వెంట తరుముతున్నట్లు భయంతో పరుగెత్తటం లేదు. తప్పుచేస్తేగా భయం?

రౌడీ రత్తయ్యను చంపటం. అతనికి తప్పుగా కనిపించలేదు.

వాడు వో ఆడదాన్నిగురించి అలా మాట్లాడటం తప్పు. అందులో ఆ ఆడకూతురు భర్త దగ్గర అలా మాట్లాడటం మరీ తప్పు. ఎంత అహం వాడికి? ఎంత దుర్మార్గుడువాడు? అలాంటి వాడిని చంపటం తప్పెలా అవుతుంది?

పోలీసుల దృష్టిలో తప్పుకావచ్చు. కానీ అతని అంతరాత్మకు అది తప్పుగా కనిపించలేదు.

చామంతి ఏమంది?

'అటువంటి రౌడీ ఎదవల్ని సిచ్చించటానికే భగమంతుడు నీకు బలాన్నిచ్చింది. ఆడిని సంపితే పున్నెమే వత్తుందికాని పాపం రాదురా. నువ్వు మంచి పని సేసేవు. నీ పెళ్లాం గర్వపడే పని సేసేవు. ఏ ఆడదైనా నిన్నుచూసి 'మా అన్నయ్య ఎంత గొప్పోడు' అని సంతోషిస్తుంది. తప్పు సేసిన ఎదవలు బయపడాలి కాని నీకెందుకు భయం?

తల్లిమాత్రం ఏమంది?

'నిన్ను కడుపున కన్నందుకు నువ్వు సేసిన పనికి గర్విస్తున్నారా. కానీ ఇది పదిమందికి సెప్పుకోలేని గర్వం. ఆ ఎదవ సచ్చినందుగ్గాని, ఆడిని సంపినందుగ్గాని నాకు దిగుల్లేదు. కానీ పోలీసోళ్లు. ఆల్ల నుంచి నువ్వు తప్పించుకుంటే సాలు నాకు'

తను తప్పించుకుంటాడు. బతుకుతాడు.

చీమకన్నా ఎన్నడూ హాని చెయ్యతలపెట్టని తను బతకటానికి అర్హుడు. కష్టపడి పనిచేసే తాను బతికి వుంటేనే పదిమందికి లాభం?

ఆ రత్తిగాడివల్ల అందరికీ నష్టమే. వాడు కష్టపడడు. తేరగా వస్తే మెక్కి రౌడీ పనులు చేస్తాడు.

బతుకుమీద ఆశ, భవిష్యత్తుమీద విశ్వాసం అతడిని పరిగెత్తింప చేసేయి. అంత పరుగెత్తినా అలసట లేకుండా చేసేయి.

తెలతెలవారుతుండగా అతనేదో వూరుకు చేరుకున్నాడు. ఓ హోటలు ముందు పళ్ళు తోముకుని టిఫిను తిన్నాడు. కాఫీ తాగేడు.

'ఏవూరు మనది? ఈవూరు కానట్టుందే?' ఎవరో హోటలునుంచి బయటికొస్తుండగా అడిగేడు పరిశీలనగా చూస్తూ.

'కాదు. పక్కూరు' అంటూ అతను వడివడిగా నడిచాడు.

అలాంటి ప్రశ్నలు ఎదురవుతాయని అతను తెల్సుకొన్నాడు. ఆ ప్రశ్నకు ఏమని సమాధానం చెప్పటం?

ఏం చెప్పాలో అతనికి తెలీదు.

అంచేత ఆ ప్రశ్నలు తలెత్తని చోట్ల తిరగాలి తను!

'రైలుటేసనుకు ఎటెల్లాలి?'

ఓ బండి అబ్బిని అడిగేడు. ఆ బండి సాయబు విస్తుపోయాడు.

'రైలు టేసనా? క్యాభాయ్? మనదేవూరు? బస్సులేదు ఈడ. రైలు టేషను ఏడనుంచి వస్తుంది?'

హనుమంతు తను రోడ్డును వదిలేసి చీకట్లో ఎటో కొట్టుకువచ్చానని తెలుసుకున్నాడు. కానీ అదేవూరు? తనెక్కడున్నాడు?'

ఎక్కడుంటే నేం? ఎక్కడున్నా తన వూరికి మరీ దూరం వచ్చి వుండే వీలు లేదు. అలా దూరంగా పోవాలంటే బస్సులెక్కాలి. రైలెక్కాలి.

'బస్సు సెంటరికి బండిపోతున్నది. ఎక్కుతావా?' కాస్త దూరం వెళ్ళేక మరో బండి అతను అడిగాడు.

అప్పటికే ఆ బండిలో కొందరు ఎక్కి ఉన్నారు.

'ఊ' అంటూ బండెక్కి కూర్చున్నాడు హనుమంతు.

మరో మనిషిని ఎక్కించుకొన్నాక బండి బయలుదేరింది.

'ఏవూరు వెళ్ళాలి?' పక్కన కూర్చున్న ఆయన అడిగేడు.

అదే ప్రశ్న! ఆ ప్రశ్నకు సమాధానం చెప్తే 'ఏవూరు?' అన్న ప్రశ్న వస్తుంది.

తను మాట్లాడకుండా అసలు ప్రశ్నే విన్పించనట్లు కూర్చున్నాడు. ఆ పెద్దమనిషి మరెవరితోనే కబుర్లలో పడ్డాడు.

బండివెళ్ళి రోడ్డుమీద ఓ చెట్టుముందు ఆగింది.

అక్కడ ఓ పాకలో చిన్న హోటలుంది. అరుగులాంటి దానిమీద కొందరు



## మాస్టర్ హెడ్

"ఇంత చిన్న లెక్క కూడా తప్పు చేశావేంట్రా మధూ?" టీచర్ మందలించింది.

"నిన్న మీరు రాలేదుకద టీచర్. హెడ్మాస్టర్ వచ్చి ఈ లెక్క చేసి చూపించారు టీచర్—"

—కె.సురేఖ (హైదరాబాద్)

ప్రయాణికులు కబుర్లు చెప్పు కొంటున్నారు.

అదేవూరు? అక్కడ ఏవూరు పోయే బస్సులు ఆగుతాయి?

'వేడివేడి ఇడ్లీలు, మసాలా దోసె వున్నాయి. రండయ్యా. ఇప్పుడు వాయతీసిన ఇడ్లీలు' బండి దిగుతున్నవాళ్ళ దగ్గరికొచ్చి పాక హోటలు వాళ్ళ అమ్మాయి కాబోలు ఆహ్వానిస్తున్నట్లు అరిచింది.

బండి దిగిన వాళ్ళంతా పాకలోకి దారి తీస్తున్నారు. హనుమంతు వెనుకంజ వేశాడు.

'ఏంటయ్యా. నువ్వు తినవా? భలేవాడివే. వాయి మీకోసం మరోటి వేస్తేనా?' అందమ్మాయి హనుమంతును చూసి.

'అతనెవరో మనూరికి కొత్తోడిలా వున్నాడులే. వూళ్ళో సుబ్బయ్య పాకలో టిఫిన్ తిన్నట్లుంది. మీ ఇడ్లీల విషయం తెలియనట్లుంది పాపం. మూగవాడిలా వున్నాడు. విన్పించనైనా విన్పిస్తుందో లేదో? కాస్త గట్టిగా చెప్పు' బండిలో ప్రశ్న అడిగిన అతనన్నాడు.

'ఏవూరోనయ్యా నీది! మా హోటల్లో ఇడ్లీ భలే బాగుంటుంది. ఒకసారి తిను. నీకే తెలుస్తుంది. బాగుండక పోతే డబ్బు లియ్యక్కర్లేదులే' పెద్దగా అరిచింది ఆ అమ్మాయి.

అదీ. తను మూగవాడు. చెవిటివాడు.

అక్కడ ఇడ్లీలు నిజంగానే బాగున్నాయి. మళ్ళీ తిండి ఎప్పుడో. ఎక్కడో? అంచేత నాలుగు ఇడ్లీలతోపాటు రెండు దోసెలు కూడా లాగించాడు.

తింటూ మిగతావారి మాటలద్వారా తెల్సుకున్నాడు.

తను మెయిన్ రోడ్డువైపు కాకుండా మరోవైపు వొచ్చాడు. ఇక్కడ నుంచి తనవూరు వైపు వెళ్ళే బస్సులూ వున్నాయి. మరో దిశకు వెళ్ళే బస్సులు వున్నాయి. ఆ వైపు వెళ్తే రైలు స్టేషనున్న వూరొస్తుంది.

బస్సు వచ్చాక అది ఎక్కి కూర్చుని హాయిగా నిట్టూర్చాడు హనుమంతు!

* * *

హనుమంతు రైలెప్పుడూ చూడలేదు. రైలుస్టేషను అసలు చూడలేదు. కానీ రైలును గురించి వూళ్ళో ఎవరో చెప్పుకోటం విన్నాడు.

బస్సెక్కిన దగ్గరినుంచి అతను తానెక్కబోయే రైలును గురించి ఆలోచనలు చేసేడు.

తీరా బస్సుదిగి రైలు స్టేషనుకొచ్చాక రైళ్ళ కూతలు, వచ్చేపోయే రైళ్ళు చేసే దడదడ శబ్దాలు. రైలు స్టేషనులో ఆ జనం, హడావుడి అంతా చూసి ఒక్కసారి ఏదో కొత్త ప్రపంచంలోకి వచ్చినట్లు బెదిరిపోయాడు. చూస్తుండగానే పొద్దుగూకిపోయింది. అప్పటికి కాస్త ఆ వాతావరణానికి అలవాటు పడ్డాడతను. అప్పుడు అతనికి ఎదురైన మొదటి సమస్య ఏవూరెళ్ళటం అన్నది!



'టిక్కెట్లెక్కడిత్తారు బాబూ?' ఎవరో అడిగేడు.
'ఏవూరెళ్ళాలి?'
'అవును? ఏవూరెళ్ళాలి?'
'అదుగో,. అక్కడ ఆ రెండు కిటికీల్లాగా వున్నాయే. టిక్కెట్లు అక్కడిస్తారు.

మద్రాసువైపు వెళ్ళే రైళ్ళకు ఆ ఎడం వైపు కిటికీలో, హైదరాబాద్ వైపువెళ్ళే రైళ్ళకు అ కుడివైపుకిటికీలో టిక్కెటిస్తారు. రెండు క్యూలలో ఎక్కడో నీ ఇష్టమైన చోట నిలబడు' ఎవరో పాపం అతనికి తాపీగా విడమరిచి చెప్పి వెళ్ళిపోయాడు.

హైదరాబాద్‌కు వాళ్ళ వూళ్ళో మున్సబు, సర్పంచ్, ఎప్పుడూ వెళ్తుంటారు. హైదరాబాద్ కబుర్లు చెప్పుకోడం విన్నాడు. అక్కడంతా పెద్దపెద్దోళ్ళుంటారు. అదో పెద్ద నగరం.

మరి మద్రాసు!

'బాబూ మద్రాసులో ఏముంటుంది?' మరో వ్యక్తిని ఆపుచేసి అడిగేడు. అతను పల్లెటూరి గమ్మర్ లా ఉన్న హనుమంతువైపు తేరిపార చూచాడు.

'నువ్వేవూరు వెళ్ళాలి? మద్రాసా?'

'ఊ....'

''ఎందుకు? సినిమాల్లో చేరడానికా? లేక జనరల్ హాస్పిటల్‌లో వైద్యానికా?'

హనుమంతు ఆ వ్యక్తినుంచి తప్పించుకుపోవడం మంచిదని గ్రహించాడు. కానీ ఆ వ్యక్తి అలా వదిలేలా కన్పించలేదు.

'మద్రాసులో మనుష్యులుంటారు. బస్సులుంటాయి. పెద్దపెద్ద హోటళ్ళుంటాయి. సినిమా స్టూడియో లుంటాయి. అక్కడ జనం తమిళం మాట్లాడుతారు. తమిళం భారత దేశంలోని భాషల్లో కల్లా చా లా ప్రాచీన భాష. మద్రాసు మహానగరం. దాన్ని పూర్వం చెన్నపట్టణం అని పిలిచేవారు. దాన్ని బ్రిటిష్‌వారు నగరంగా పెంచేరు. ఇప్పుడది తమిళనాడు రాజధాని. తమిళులకు తమిళ భాష అంటే మిక్కిలి అభిమానం.'

పరవశంతో ఆ వ్యక్తి చెప్పుకుపోతున్నాడు. కానీ హనుమంతు హైదరాబాద్‌కు టిక్కెటిచ్చే క్యూలో అప్పటికే నిలబడి ఉన్నాడు.

క్యూ ముందుకు జరుగుతోంది.

తను హైదరాబాద్ వెళ్ళాలా? అదెంత దూరమో? అది పెద్దవూరు. అక్కడ తను బతకగలడా? అనుమానం.

తనముందు టిక్కెట్లు తీసుకొంటున్నవాళ్ళు ఎక్కడికి టిక్కెట్లు తీసుకొంటున్నారో విన్నాడు.

కొందరు హైదరాబాద్‌కు తీసుకొంటున్నారు. మరికొందరు విశాఖపట్నం, నలుగురు రాజమండ్రి, ఇద్దరు ఏలూరు, చాలామంది విజయవాడ. ఇలా రకరకాల వూర్లపేర్లు తెల్సుకున్నాడు.

'ఈ వూళ్ళన్నీ హైదరాబాద్‌కి వెళ్ళే దోవలో ఉన్నాయన్న మాట!' అనుకొన్నాడు మనసులో.

టిక్కెట్టు తీసుకోవాల్సిన వంతు వచ్చింది అతనికి. జేబులోనుంచి తల్లి ఇచ్చిన నోట్లకట్ట

బయటికి తీసేడు.

'హైదరాబాద్‌కి టిక్కెట్టెంత సారూ?'

టిక్కెట్టు ఇచ్చే అతను చెప్పేడు. అంత డబ్బిచ్చి టిక్కెట్టు తీసుకొని ఆ డబ్బు మడతల మధ్యనే టిక్కెట్టును పెట్టి జేబులో పెట్టుకొన్నాడు. తనముందు టిక్కెట్లు తీసుకొన్నవాళ్ళ వెనకే నడిచాడు.

బెల్లు మోగింది కాస్సేపటికి. రైలొచ్చింది.

వాళ్ళ వెనకే వాళ్ళు ఏ పెట్టె దగ్గరికెళ్తే ఆ పెట్టె దగ్గరికి అతనూ తిరిగేడు. అన్ని పెట్టెలూ క్రిక్కిరిసి ఉన్నాయి.

చివరికి వాళ్ళు ఒక పెట్టెలోకి జొరబడ్డారు. వాళ్ళ వెనుకే హనుమంతు కూడా జొరబడ్డాడు. రైలు కదిలింది.

రైలు ప్రయాణం గురించి వింటున్నప్పుడు అతను రైలును గురించి, అందులో ప్రయాణాన్ని గురించి ఎన్నెన్నో వూహించుకున్నాడు. కానీ ఇదేమిటి? అటు మనుష్యులు ఇటు మనుష్యులు జాతర్లలో తోసుకొంటున్నట్లు తోసుకుంటున్నారేం?

అతను అలాగే మెల్లగా కిటికీలోగుండా బయటికి చూచాడు. తను వేగంగా పరుగెత్తుతున్న భావన కలిగింది.

అతని ముందు టిక్కెట్లు కొన్నవాళ్ళు లోపలిదాకాపోయి నెమ్మదిగా సీటు సంపాదించుకొని కూర్చున్నారు. అతనికి ఎక్కడైనా కూర్చోవాలని వుంది. కాదు పడుకొని హాయిగా నిద్రపోవాలని వుంది. రైలు కుదుపు అతనికి జోలపాడినట్లు హాయిగా వుంది.

అతను ఆశగా అటూ ఇటూ చూచాడు. కొందరు కూర్చుని కునికిపాట్లు పడుతున్నారు. మరికొందరు పైన సామానులు పెట్టుకొనే బెర్త్‌లు ఎక్కి పడుకున్నారు. కొందరు కింద



## ఇండియన్ రైల్వేస్ ఘనత

ఈనాడు మనదేశ రైల్వేసంస్థ ఆసియాలోనే అతి పెద్దదిగా పేరొందడమే గాక ప్రపంచంలో నాల్గవ స్థానాన్ని అలరిస్తోంది. దేశ స్వాతంత్ర్య సమయంలో ఉన్న 51,151 కిలోమీటర్ల రైల్వేలైను ఈనాడు 76,407 కిలోమీటర్లకు పెరిగింది.

మన రైల్వేశాఖకు మరో ప్రత్యేకత ఉంది. 16 లక్షల ఉద్యోగులతో అతిఎక్కువ ఉద్యోగుల్ని కలిగిన ప్రభుత్వ శాఖగా నిమలితెక్కింది. గౌహతి — త్రివేంద్రం ఎక్స్‌ప్రెస్ తిరిగే రైల్వేమార్గం 3,974 కిలోమీటర్లతో దేశంలోనే అతి పెద్ద రైల్వే మార్గంగా నమోదుకాగా, రెండవ స్థానాన్ని 3,726 కిలోమీటర్లతో జమ్మూ — కన్యాకుమారి మధ్య నడిచే హిమ్‌సాగర్ ఎక్స్‌ప్రెస్ ఆక్రమిస్తోంది. అయితే రైళ్లవేగంలో మాత్రం అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మనం చాలా వెనుకబడినట్లే.

—జూపిటర్

పడుకొన్నారు. మొత్తంమీద ఎక్కేటప్పుడు ప్రవేశమార్గం దగ్గరున్నంత రష్ ఇక్కడ లేదు.

ఓ వరుసలో ఎవరో ఏమో మాట్లాడుకుంటున్నారు. వారి మాటల్లో 'తోలుబొమ్మలాటలు' యక్షగానము, వీధి నాటకము, భాగవతము' అన్న మాటలు తప్ప మరేమీ అర్థం కాలేదు హనుమంతుకు.అతను వాళ్ళ వూళ్ళో అప్పుడెప్పుడో తోలుబొమ్మలాట చూచాడు. తూర్పు భాగవతులెవరో వచ్చి ప్రదర్శనలిస్తే అదీ చూచాడు.

"అయ్యా నాలుగురోజుల్లో మా ప్రదర్శనలున్నాయి. మా ట్రూప్‌లో హాస్యధారి పాత్ర వేసేవాడు మొన్న నెల్లూరులో ప్రదర్శన కాగానే మద్రాసు పారిపోయాడు. సినిమా పిచ్చిపట్టి ఛస్తున్నారండీ జనం. ఇక తూర్పు భాగవతాలను పడమట భాగోతాలను ఆడి పోట్టనింపుకోవ డం ఎలా? ఏంటో— పెద్దలనుంచి వచ్చిన విద్యని తంటాలు పడటం తప్పితే సరిగా పొట్టలే నిండవండీ. రైలు చార్జీలు గిట్టుబాటు కావడం లేదు."అలా అన్న వ్యక్తి నల్లగా పొడుగ్గా సన్నగా వున్నాడు. తలమీద జుట్టులేదు. తెల్లబారిన గుబురు మీసాలున్నాయి. చెవికి కమ్మలున్నాయి. కాలికి వెండికడియం వుంది. ఆయన మొహంలో ఏదో ఆకర్షణ కన్పించింది హనుమంతుకు.

'అయ్యా. ఇంక ఆ రైలు బాగోతం అపుతావా లేదా?' పైనుంచి వో అమ్మాయి కోపాన్ని అభినయిస్తూ అంది. హనుమంతు ఆ అమ్మాయిని చూశాడు. ఆ అమ్మాయి హనుమంతునే చూస్తోంది. ఆ అమ్మాయి కోపంతో మూతి బిగించిన తీరు చూస్తే అతనికి నవ్వాగలేదు. సన్నగా నవ్వేడు. ఆ అమ్మాయి నవ్వింది నవ్వుతూ హుషారుగా లేచి కూర్చున్నది.

'నీకు నిద్దరొస్తున్నదా? ఈడ పడుకొంటావా? నేను మా అయ్య పక్కన కూకుంటాలే' ఆ అమ్మాయి పైనుంచి దిగి హనుమంతుకు చోటునిచ్చింది.

పడుకొని పడుకోగానే అతనికి నిద్రపట్టింది. ఎవరో తట్టిలేపితే కానీ మెలకువ రాలేదు. చెవికి కమ్మలున్న వ్యక్తి, ఆయన కూతురు క్రింద బల్లమీద పడుకొని నిద్రపోతున్నారు. వాళ్ళనే లేపుతున్నాడు ఆ నల్లకోటు వేసుకొన్న పెద్దమనిషి.

'టిక్కెట్టు తియ్యవయ్యా. అలా చూస్తావేంటి? ఎక్కడికెళ్ళాలి?'

'అయిదరాబాద్'

'హైదరాబాదా? ఇది హైదరాబాద్ వెళ్ళే బండి కాదు. విశాఖపట్నం వెళ్ళే బండి'

'యిసేకపట్నం తర్వాత అయిదరాబాద్ రాదా?'

ఆ ప్రశ్నకి పెట్టెలో వున్నవాళ్ళు నవ్వేరు.

'నేను అయిదరాబాద్‌కి టిక్కెట్టు తీసుకొన్నానే మరి!' అంటూ హనుమంతు జేబులో చెయ్యిపెట్టేడు.

'టిక్కెట్టు తియ్యిముందు. ఆ తర్వాత విశాఖపట్నం నుంచి హైదరాబాద్ ఎలా పంపించాలో ఆలోచిద్దాం'' టీసీ అన్నాడు చెవులకమ్మల వారి టిక్కెట్టు పరీక్షచేసి తిరిగిఇచ్చేస్తూ—

'అరె! నా టిక్కెట్టూ... నా డబ్బు...' హనుమంతు పైనుంచి క్రిందికి దూకేడు.

జేబులు కంగారుగా వెతుక్కోసాగేడు.

'ఆపరా నీ నాటకాలు! టిక్కెట్టు లేకుండా ప్రయాణం పైగా హాయిగా పైకెక్కి పడుకొన్నావే! దొంగ వెధవలకే దర్జాలు ఎక్కువయ్యాయి'.

'బాబూ నేను దొంగ ఎదవని కాదు. నేను అయిదరాబాద్‌కు టిక్కెట్టు కొన్నాను. రూపాయినోట్లు బొత్తిమద్దెలో జాగర్తగా దాసేను. ఎవరో కొట్టేసేరు. కావాలంటే— అదుగో... వాళ్లనడగండి. వాళ్ళు నా ముందర టిక్కెట్టుకొనుక్కొనేకాడ నిలబడ్డారు. ఆళ్ళు ఎక్కేకనే నేను యీ పెట్టెలో ఎక్కే'

'ఏమండీ. మీరు హైదరాబాద్ వెళ్లాలా?'


'నేదు బాబూ. ఆళ్ళు యిసాక పట్టణం టిక్కెటు కొన్నారు. యిసాకపట్టణం, యిజయవాడ, రాజమండ్రి, యియన్నీ అయిదరాబాద్ వేళ్ళే తోవలో వున్నాయనుకొన్నాన్నేను. నాకేం తెలియదు. నేను రైలు ఎక్కలేదు ఎప్పుడూ. మాది పడమట. అందుకే ఆల్ల ఎనుక వచ్చి ఈ పెట్టె నెక్కే."

విశాఖ పట్టణం వెళ్ళే వాళ్ళు అతను టిక్కెట్టు కొని డబ్బు మడతలో పెట్టడం చూచామని సాక్ష్యం చెప్పేరు.

వాళ్ళు అలా చెప్పటంతో హనుమంతుకు ధయిర్యం వచ్చింది.

'నన్నేమన్నా వూరుకొంటాను బాబు. కానీ దొంగననకండి. అటువంటి ఎదవ పనులు నేను సేయను' అన్నాడు రోషంగా.

'సరే లేవోయ్. మహారోషం! దొంగతనం చేసేవాడు చెప్పుకోడులే. సరే నువ్వు దొరవే. టిక్కెట్టు కొన్నావ్. కానీ ఎవరో కొట్టేసేరే. అయితే యిప్పడేం చేస్తావ్? నన్నేం



చేయమంటావ్? చెప్పుపోనీ'.

రైల్లో ప్రయాణీకుల సానుభూతి హనుమంతుపైకి మళ్లింది.

'పాపం... అతనెవరో యింతవరకు రైలే ఎక్కని అమాయకుడు లాగున్నాడండీ. వదిలెయ్యండి పాపం'.

'అలా వదిలెయ్యటానికండీ మేముంది' అంత మీకు దయగా వుంటే మీరు డబ్బు కట్టండి లేకపోతే పోలీసులకి అప్పగిస్తాను'.

ప్రయాణికుల నోళ్ళు మూతపడ్డాయి.

'అయ్యో. అతనెవడో పాపం ఆపదలో వున్నాడు''

"ఆయన అతడ్ని తీసికెళ్ళి జైల్లో పెట్టిత్తాడేమో! నువ్వు డబ్బు కట్టెయ్య రాదూ? మంచోడే అయ్యో పాపం అతడు!"

చెవికమ్మల పెద్ద మనిషి కూతురు కళ్లల్లోకి చూచాడు. కృష్ణుడిని చూచాక సత్యభామగా ఆమె చేసే అభినయం గుర్తుకొచ్చింది.

హనుమంతు వైపు చూచాడు. పరిశీలనగా చూచాడు.

చొక్కా లోపలి జేబులో నుంచి డబ్బు తీయసాగేడు.

యీలోగా హనుమంతు బొడ్లో దోపుకొన్న పంచె కొంగుముడి విప్పి చామంతి యిచ్చిన సొమ్ములు తీసేడు.

"బాబుగోరూ నా తిక్కెట్టుపోయింది. డబ్బుపోయింది. కానీ యివిగో యివి వున్నాయింకా. నా సొమ్ము నాప్పేణం. కానీ నా ప్పేనం కూడా నీతి కన్నా పరువు కన్నా ముక్కెంకాదు. కనుక యివి తీసుకోండి".

టికెట్ కలెక్టర్‌తో పాటు ప్రయాణీకులంతా నివ్వెరపోయారు.

"అసలు నీ దేవూరు? ఎక్కడినుంచి వస్తున్నావ్? హైదరాబాద్‌కు ఎందుకెళ్తున్నావ్?'

'ఏవూరవుతేనేవండీ? ఎక్కడి నుంచి వత్తేనేం? కడుపు పట్టుకొని బయల్దేరేను. పనికోసం అయిదరాబాద్ ఎల్తన్నా."

"హైదరాబాద్‌లో పనా? అక్కడ నీ లాంటి వాళ్ళు చాలామందివున్నార్లే. నా సలహా విను విశాఖపట్టణంలో స్టీలు ఫేక్టరీ పెడ్తారుట. అక్కడ పన్లు దొరకొచ్చు. కూలీ రేటుకూడా అక్కడ హెచ్చుట., అక్కడికి వెళ్ళు. నేను టిక్కెట్టు సంగతి తర్వాత చూస్తాన్లే. విశాఖపట్టణం దాకా నేను వస్తానుగా?' టీసీ తగ్గిపోయాడు. అలా అంటూ ముందుకు సాగేడు.

'అబ్బాయ్ నువ్వేం పని చేస్తావ్?' అతడికి పక్కన చోటిచ్చికూర్చోపెట్టుకొని మెల్లగా అడిగేడు చెవుల కమ్మలతను.

'ఏ పనైనా సెయ్యగలనండీ. ఎవసాయం పనుళు, కట్టుబడి పనులు, ఏమైనా సరే కష్టపడ సేయగలను' అతను గర్వంగా అన్నాడు.

'బాగుంది. కానీ నువ్వెప్పుడైనా తూరుపు భాగోతుల ఆట కాని తోలుబొమ్మలాటకానీ, కూచిపూడి బాగోతం కాని చూచావా? గొల్లసలాపాలూ పగటి వేషగాళ్లను చూచావా?'

'అయన్నీ మా అమ్మ సెప్తుంటుందండీ. నేవయన్నీ సూడలే. కానీ మా వూళ్లో తోలు బొమ్మలాట. తూరుపు బాగోతుల ఆటను వోపాలి సూసేను బాగున్నాయి నాకు.'

'బాగున్నాయి కదా? మేం అలాంటి ఆటలాడుతుంటాం అదిగో అది నాకూతురు. దాని పేరు అంజలి. వాడు నా తమ్ముడు, అది నా మరదలు.' అంటూ వో పది మందిని చూపించి, పరిచయం చేసేడాయన.

'యింతకీ నీ పేరేంటో సెప్పయ్యా' అంజలి పొడిచింది తండ్రిని.

'నా పేరు నన్నయ్యదాసు. మాది అస్సలు తూరుపుదేశం కాని యిప్పుడు నీకులాగే మాకొక్కూరే లేదు. పొట్టచేత పట్టుకొని చేతనయిన ఆట లాడుకొంటూ బతుకుతున్నాం. మాతో వస్తే మాలో వొకడిని చేసుకొంటాం నిన్ను. పని చూపిస్తా. కూటికి కొరవైనా పెదోళ్ళకు అభిమానానికి కొరత లేదని నువ్వు నిరూపించాక నాకు నచ్చింది. నువ్వు టిక్కెట్టు కోసం నీ ప్రాణం లాంటి బంగారు ఆభరణాలని నష్టపోక్కర్లేదు. ఆ డబ్బు నేను కడ్తాను. నువ్వు మాతో రావటానికి అంగీకరించినా అంగీకరించకపోయినా సరే.'

'మనతో వస్తాడ్లే అయ్యా. నీకెందుకు నువ్వా డబ్బు కట్టేరా'

అంజలి వైపు చూచాడు హనుమంతు. ఆమె సిగ్గుతో తలవంచుకొంది!


* * *

పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్‌రావు వొట్టి కన్‌ఫ్యూజన్ మాస్టర్.

అయితే అతను ఆ విషయాన్ని చస్తే అంగీకరించడు. పైగా తన క్రింది పోలీసు కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్ ప్రతి చిన్న విషయానికి తాము కంగారు పడి తనని కంగారు పెడ్తుంటారని మాటిమాటికి అంటుంటాడు.

'కన్‌ఫ్యూజ్ కాకు. నెమ్మదిగా ఆలోచించి మెరుపులా చర్యలు తీసుకోవాలి' అని అతను మాటిమాటికీ తన సబార్డినేట్‌కు హితబోధలు చేస్తుంటాడు.

గోవర్ధనరావు తాను ప్రతిభావంతుడినని అనుకొంటాడు. తన ప్రతిభకు తగ్గ గుర్తింపు



వేదాంతి

"నాకు వేదాంతిని అవ్వాలని ఉంది ఏం చెయ్యాలి స్వామీ?" అడిగాడు బ్రహ్మచారి ఆంజనేయులు.

"ఓ గయ్యాళి భార్యను చూసుకో!" బోధించాడు పరమానందస్వామి.

జోకర్ (హైదరాబాద్)

తనకి రాలేదని అతనికి దిగులు.

‘ప్రతిభకు — ఐవిూన్ ఎఫిషియన్సీకి — పోలీస్ డిపార్టుమెంట్‌లో బొత్తిగా గుర్తింపు లేదోయ్. అదేమంటే నాకెప్పుడో పోలీస్ మెడల్ రావాల్సింది. నాలాంటి ఎఫిషియెంట్ ఇన్‌స్పెక్టర్ హైదరాబాద్‌లో వుండాలి. కానీ నేనెక్కడున్నాను? యిక్కడ యీ వెనుకబడ్డ ప్రాంతంలో — బంజరు భూముల్లో. యిక డిపార్టుమెంటు ఏం బాగుపడుతుంది? అబ్బే... లాభంలేదు’ యిలా సాగుతుంది అతని ధోరణి.

యీ దిగుళ్ళను కన్‌ఫ్యూజన్లలో మర్చిపోవటానికి అతను ఎక్కువగా సినిమాలు చూస్తుంటాడు. అతనికి క్రైమ్ పిక్చర్లంటే మహా యిష్టం. జేమ్స్‌బాండ్ సినిమాలు చూస్తూ తనలో జేమ్స్ బాండ్‌ను, జేమ్స్‌బాండ్‌లో తనను ప్రొజెక్ట్ చేసుకొని ‘ఐడెంటిఫై’ చేసుకొని సంతోషిస్తుంటాడు.

కానీ యీ వెనుకబడిన ప్రాంతంలో యీ బీదు వూరిలో జేమ్స్ బాండ్ సినిమా లెక్కడినుంచి వస్తాయి? కనీసం అమితాబచ్చన్ నటించిన హిందీ సినిమాలన్నా రావే!

ఆ వూళ్లో మూడు సినిమాహాళ్లు వున్నాయి. సినిమా డిస్ట్రిబ్యూటర్ల గ్రేడింగ్‌లో కూడా అది బాగా వెనుకబడ్డ ప్రాంతం. అంచేత తెలుగు సినిమాలు కూడా పెద్ద పెద్ద సెంటర్లలో ఆడేవి కాని అక్కడికి రావు. వచ్చినా ఎంత సినిమా అయినా రెండువారాలు మించి ఆడదు. నాలుగు వారాలు ఆడితే శత దినోత్సవం చేసుకొన్నంత సంబరం!

గోవర్ధన్‌రావు వచ్చిన సినిమానల్లా పోకుండా చూస్తాడు. సాధ్యమయినంతవరకు ‘ఫేమిలీ’తో సినిమా చూడడం అతనికి సర్దా.

ఫేమిలీతో సినిమా చూస్తున్నప్పుడు సినిమా హాలువాళ్ళు కూల్ డ్రింకో, కాఫీ టిఫిన్లో యిప్పించి మర్యాద చేస్తే అది తన హక్కు అయినట్లు సంతోషించాడు. కానీ ఆ సమయంలో ఏ చోరీకేసో ఖూనీ కేసో వచ్చిందని కబురొస్తే మటుకు చెడ్డ చిరాకు పడిపోతాడు.

ఆ రోజు ఫేమిలీతో సినిమా చూస్తున్నాడతను. తెలుగు సినిమా అవుతే మాత్రమే? కృష్ణ నటించిన క్రైమ్ థ్రిల్లర్, ఫైటింగ్స్ బాగున్నాయి. కృష్ణ ఇన్‌స్పెక్టర్ వేషంలో విలన్ల గుంపును చావచితకబాదుతున్నాడు. కృష్ణ పాత్రలో తనని ఐడింటిఫై చేసేసుకొని, తనే వాళ్ళందర్నీ నిజంగా కొడ్తున్నట్లు సంతోషిస్తున్నాడు గోవర్ధన్‌రావు.

‘సార్ మీకు ఫోను వచ్చింది సార్’ హాలు మేనేజర్ వచ్చి చెప్పేడు. అలాంటి ఫోనులు మామూలే. అతను చిరాకు పడటం మామూలే.

“ఛ. ఫోను చేసిన వాడిని పిస్టల్ పెట్టి కాల్చెయ్యి. యిక్కడ లేనని చెప్పు పో...”

‘కాదు సార్ ఫోన్ చేసింది ధనంజయరావు గారు సార్. వాళ్ళింట్లో ఏదో హత్య జరిగిందిట’.

హత్య! హత్య! ధనంజయరావు గారింట్లో!

అతని బుర్రంతా కన్‌ఫ్యూజ్ అయిపోయింది ఒక్కసారిగా!

కానీ తీరా వెళ్ళి చూస్తే హత్య జరిగింది గోవర్ధనరావు గారింట్లో కాదు. వాళ్ళ యింటి ఆవరణలో మునింట్లో!

"ఆ సినిమా హాలు మేనేజర్ వొట్టి కన్‌ఫ్యూజన్ మాస్టర్ అండీ. యింటికీ ఆవరణకీ భేదం తెలియదు. హత్య మీ యింట్లో జరిగిందని నన్ను గొప్ప కన్‌ఫ్యూజ్ చేసి పారేసేడు' అన్నాడు ధనంజయరావు గారితో గొప్పగా.

"సరే అసలీ హత్యఏమిటి? హత్య చేయబడినదెవరు? హత్యచేసిందెవరు? హత్య ఎప్పుడు జరిగింది? యిప్పుడు నేనేం చేయాలి? కన్‌ఫ్యూజ్ కాకుండా చెప్పండి సార్".


ధనంజయరావుకు ఆ హత్య వార్త తెలియటానికి ఓ రెండు గంటలకు పైగా పట్టింది. నాలుగు భవనాలలో అతను ఏ అంతఃపురంలో వున్నది తెల్సుకోవాలాయే. తీరా తెల్సుకొనేసరికి ఆయన అప్పుడు వెంటనే ఆ కబురు వినగలిగే స్థితిలో లేడు. ఆ కబురు వినగలిగే స్థితిలోకి ఆయన వచ్చాక ఆ వార్త తెలియచేసేరు.

ఆ వార్త విని యింటికి వెళ్ళి విషయాన్నంతా ఆకళింపు చేసుకొని తగు ప్రణాళికలన్నీ సిద్ధం చేసుకొనేసరికి మరి కొంత కాలం పట్టింది. ఆ తర్వాత యస్పైకి కబురు వెళ్ళింది.

ధనుంజయరావు రౌడీ రత్తయ్య హత్యచేయబడినందుకు ఏ మాత్రం విచారించలేదు. నిజానికివాడి పీడవదిలినందుకు సంతోషించాడు కూడా. పాతనీరుపోయి కొత్తనీరు వచ్చినట్టు పాతరౌడీలు పోయి ఎప్పటికప్పు డు కొత్త రౌడీలు తయారవుతుంటేనే అందం— ఆనందం తనలాంటి వాళ్లకి లాభం—క్షేమం.

అయితే ఆ హత్య తన ఇంటి ఆవరణలో జరగటం అతనికి బొత్తిగా ఇష్టంలేదు. అదీ తన కొడుకు ముందు జరగటం అసలు రుచించలేదు. ఈ చేదులమధ్య అతనికి తియ్యగా కన్పించిన వార్త ఏమంటే హంతకుడు వెంకన్న కొడుకు కావటం.

కూలీలు యజమానుల మీద తిరగబడటం తప్పే. అయితే నేం? ఆ కూలీవాడు



## కష్టజీవి రికార్డు

ప్రపంచంలో ఎందరో వళ్లు దాచుకోకుండా పని చేస్తూనే ఉంటారు. అయితే వారిలో ఎంతమంది అతి ఎక్కువగా పని చేస్తారన్నదీ... వారిలో అత్యంత ఎక్కువగా పనిచేసే కష్టజీవి ఎవరన్నది ఇంతవరకూ ఎవరికీ తెలియదు!

అయితే కేరళలోని 'తోడుపూజా' గ్రామానికి చెందిన 36 సంవత్సరాల రాజా దామోదరన్ ప్రపంచంలోనే ఎక్కువ పనిచేసే వ్యక్తిగా ఈ మధ్య వెలుగులోకి వచ్చాడు. లండన్ పొలిమేరల్లోని 'చెస్టర్'లో రోజుకు 18 గంటలు, వారానికి 7 రోజులు పనిచేస్తూ ఒక రెస్టారెంట్‌ను నడుపుతున్నాడు దామోదరన్. మరి మీలో ఎవరయినా ఇంతకంటే ఎక్కువ పని చేస్తున్నారా? వెంటనే ఆ విషయాన్ని దామోదరన్‌కు తెలియజేసి మీరు కూడా మరో కష్టజీవి రికార్డును నెలకొల్పండి!

—జూపిటర్

చంపింది యజమానిని కాదుగా? మరో కూలీవాడిని కనుక అది తప్పుకాదు. చాలా సహజం. కూలీలు కూలీలు తన్నుకొంటేనే కదా యజమానికి లాభం?

అప్పటికప్పుడు శ్యామ్‌సుందర్‌ను కారులో ఎక్కడికో పంపించేసేడు. అతను వారం రోజులుగా ఇక్కడలేడు. కనుక అతను చూచే ప్రశ్నేలేదు.

వెంకన్న కొడుకు రత్తయ్యను చంపేసి పారిపోకుండా తనని శరణువేడితే క్షమించేసేవాడే ధనంజయరావు. కానీ వాడు పారిపోయాడు. కాటేసి పారిపోయిన పాపపామైనా ప్రమాదకరమైనదే కదా?

అంచేత వెంకన్న కొడుకు రత్తయ్యను హత్యచేస్తుంటే చూచిన కూలీ వాడినొకడిని సృష్టించాడు.

'బాబుగోరు ఎంకన్నను రమ్మన్నారండీ. ఆడు కాకుండా ఆడి కొడుకు వచ్చాడని రత్తయ్యకు కోపం వచ్చిందండి. అనుమంతుగాడిని తిట్టేడు. ఆడి పెళ్లాన్ని కూడా ఏదో అన్నాడు. అంతే కోపం వచ్చిన అనుమంతుగాడు రత్తయ్యమీద కలేబడ్డాడు. ఇద్దరూ గోరంగా పోట్లాడుకొన్నారు రత్తయ్య గోడి దగ్గర కత్తి వుంది. నేను ఆళ్ల పోట్లాటను సూడలేక భయంతో కళ్లు మూసుకొన్నాను. రత్తయ్యగాడి కేక విని కళ్లు తెర్చేను. కత్తి అనుమంతుగాడి చేతిలో వుంది. రత్తయ్య చచ్చి కిందపడి వున్నా' ఈ డైలాగును ఆ కూలీవాడిచేత వల్లె వేయించాడు.


రత్తయ్యకు పెళ్లాంలేదు కాని వుంచుకొన్న ముండ వుంది. ముసలి తల్లి వుంది. యస్సై తోపాటు వాళ్లకీ కబురుచేసేడు ధనంజయరావు. కాని వాళ్లింకారాలేదు.

'మీరు భలేవారేనదండీ యస్సైగారూ? నేను హత్య చేస్తుండగా చూచినట్లు నన్ను చెప్పమని అడుగుతున్నారే. ఈ హత్య చేయబడ్డ వాడు నా దగ్గర కూలీ. పేరు రత్తయ్య. ఊళ్లో రౌడీ వేషాలు వేస్తూ తిరిగి చెడిపోతుంటే బాగుపరుద్దామని ఇంత ఉపాధి చూపించాను. వీడూ మరో కూలీవాడు చిన్న విషయం మీద కొట్టుకొన్నారుట. అందులో వొకడు మరొకర్ని చంపేట్ట. చచ్చినవాడు ఇక్కడ పడి వున్నాడు. చంపినవాడు పారిపోయాడు. చూచినవాడు దడుపులో జొరం వచ్చినట్లయి మంచం ఎక్కేడు. ఇదీ నాకు తెల్సిన విషయం. ఆ తర్వాత మీరేం చేస్తారో నాకు తెలియదు. కానీ నేను కోరేది వొక్కటి వుంది. మీరు వెంటనే ఈ శవాన్ని ఇక్కడినుంచి తీసెయించాలి"

'అలాగే కానీ...'

"అలాగే అన్నాక ఇంకా కానీ ఇవ్వుండకూడదు. కూలీ వెధవలక్కూడా కొట్టుకు చావడానికి నా ఇల్లే దొరికింది చూడండి. ఇలాంటి న్యూసెన్సును మా వాళ్లు భరించలేరు. ముందు ఇక్కడినుంచి శవాన్ని మీ స్టేషన్‌కు తరలిస్తే తర్వాత విషయాలన్నీ మనం చూచుకోవచ్చు"

ధనంజయరావును కాదనే దమ్ములేవు గోవర్ధనరావుకు. కానీ ఆ స్పాట్‌నుంచి శవాన్ని ముందుగా తొలిగిస్తే ఏమవుతుందో? ఎవిడెన్సులు ఎలా లభ్యం అవుతాయి? కన్‌ఫ్యూజన్'



శవాన్నీ తరలిస్తుండగా రత్తయ్య తల్లి, వుంచుకొన్న ఆడది వచ్చారు. వేన్‌లోకి ఎత్తిన శవాన్ని చూచి ఘోరున ఏడ్చారు.

‘ఇక్కడ ఏడ్చి ఏం లాభం? స్టేషన్‌కు రండి’ అసలే కన్‌ఫ్యూజన్‌లో వున్నాడేమో చిరాకుగా అన్నాడు. తీరా వారు స్టేషన్ దగ్గర ఏడుస్తుంటే మరీ చిరాకువేసింది.

ఈలోగా ధనంజయరావు పంపిన సాక్షి వచ్చాడు. బట్టీపట్టిన పోర్షన్ అప్పచెప్పేడు. ఇంతకీ నువ్వు హనుమంతు అనేవాడు రత్తయ్యను పొడిచి చంపటం చూచావా?

'పోట్లాడుకోటం చూచావండీ కానీ పొడవటం చూడలేదు'

'పోట్లాట చూచినవాడివి అదెందుకు చూడలేదు?'

'నాకసలు పోట్లాటలంటే బయమండీ అందుకని బయంతో కళ్ళుమూసుకొన్నా'

'నువ్వు స్టంట్ సినిమాలు చూడవా?'

'చూస్తానండి నాకు ఎన్టీఆర్ ఫైటింగ్ అన్నా కృష్ణ ఫైటింగ్ అన్నా ఇట్టం'

'మరి వాళ్లు విలన్‌ను చంపేటప్పుడు కళ్లు మూసుకొంటావా? చూస్తావా?'

'సంబరంగా చూస్తానండీ కళ్లు మూసుకోను'

'మరిప్పుడు కళ్లెందుకు మూసుకొన్నావ్? వొట్టి కన్ఫ్యూజన్ మాస్టర్‌లా వున్నావే నువ్వు?'

'మరి అది సినిమా. ఇది నిజం కదండీ సినిమాలో ఫైటింగ్ ఇట్టమండీ. నిజంగా పోట్టాడుకొంటుంటే బయం అండీ'

'ఛఛ. నువ్వొట్టి పిరికిసాక్షివి. నాలాంటి యస్సై ముందు సాక్ష్యం ఇవ్వటానికి పనికిరావు. కనుక చివరి ప్రశ్న అడుగుతాను. ఆలోచించి చూచింది చూచినట్టు చెప్పు కన్ఫ్యూజన్ వద్దు చంపేసిన హనుమంతు ఏం చేసేడు?'

'ఏం చేత్తాడండీ పారిపోయాడు'

'అదే ఎటు పారిపోయాడు?'

'వాకిట్లోకండీ'

* * *

శవాన్ని పోస్టుమార్టంకు తీసుకెళ్లేడు గోవర్ధనరావు. డాక్టరు శవాన్ని చూచీ చూడగానే అన్నాడు.

'నాలుగుగంటల క్రితం చస్తే శవాన్ని తీసుకురావటానికి మీకు ఇప్పటికి తీరిక చిక్కిందా?

నాలుగు గంటల క్రితం మర్డర్ జరిగితే తనకి గంట క్రితం తెలియటమేమిటి? అంతసేపు శవం ధనంజయరావుగారి ఇంటి ఆవరణలోనే వుందా? వుంటే ఎవరూ చూడలేదా?

హంతకుడి కోసం గాలింపు ఆరంభించబోతూ ధనంజయరావును కలిసేడు గోవర్ధనరావు ముందు హనుమంతును గురించిన వివరాలు అడిగేడు.

'నాకు నా పెళ్లాం పిల్లల మొహాలే గుర్తుపెట్టుకోటానికి వ్యవధి వుండదు యస్సైగారూ. నాకింద కొన్ని వేలమంది కూలీలు పనిచేస్తుంటారు. వీళ్లందరి మొహాలు వివరాలు నాకు

గుర్తుండాలంటారా? నేను మేస్త్రీ వెంకన్న కోసం కబురుచేస్తే వాడి కొడుకు హనుమంతు నా దగ్గరికొచ్చాట్ట! అలా గెందుకొచ్చాడో వాళ్లకేమైందో కూపీ తీసి కనుక్కోవాల్సింది మీరు. నన్నేం చెప్పమంటారు?'

'హత్య ఎప్పుడు జరిగివుంటుందంటారు?'

'అది మీరు చెప్పాలి. డాక్టర్లు చెప్పాలి. నేనేం చెప్పగలను? నేను ఇంటికొచ్చేసరికి శవం కన్పించింది. మీకు వెంటనే కబురుచేసేను'

'అదీకాదు సార్. నాలుగు గంటల క్రితమే ఆ శవంగాడు చచ్చినట్లు డాక్టరు శవాన్ని చూస్తూనే అన్నాడు. మరి మనసాక్షిగారేమో...'

'మనసాక్షి ఏందయ్యోయ్. శవం ఎప్పుడు చచ్చిందన్నది ఇప్పుడు సమస్య కాదయ్యా. అసలు మర్డర్ చేసిన వాడు ఎక్కడికి పారిపోయాడన్నది సమస్య? మర్డరర్‌ని వెతికి పట్టుకోకుండా మమ్మల్ని క్రాస్ ఎగ్జామినేషన్‌లు చేస్తావా? భలేవాడివే. నువ్వింకా చాలా ఎఫిషియంట్ అనుకొన్నాన్నేను.'


'నోనో నేను చాలా ఎఫిషియెంట్ సార్. మీరు దాన్ని గుర్తించారు. అది చాలు. చూస్తారుగా మర్డరర్‌ని ఎలా పట్టుకొంటానో? మనకళ్లు కప్పి వాడెక్కడికి పోతాడండీ?'

జీపులో పోలీసులని వెంటేసుకొని వెంకన్న ఇంటికి వెళ్లేడు హుటాహుటిగా.

'మీకు నూరేళ్లయుష్షు బాబూ. మా అనుమంతుగోడుని ధనంజయరావు బాబుగోర్ని కల్సి సీకటడే ఏళకి రమ్మని సెప్పి పంపేనండీ. ఆడింతవరకూ రాలేదండంటడీ ఇంటికి! ఎతికొద్దామని బయల్దేరతా వుండాను'

అయితే హనుమంతుగాడు ఇంట్లో లేడన్నమాట!

వెంకన్న బ్రతిమలాడేడు 'ఇన్స్పెక్టర్ బాబుగోరూ మీకు పున్నెం వుంటుంది. ఆడి జాడ



కాస్తంత తెలపండి. ఆడి తల్లీ, పెళ్లాం రేత్తిరంతా జాగారం చేస్తున్నారు. రేపు తిండి తినరు. నీళ్ల తాగరు. నిద్రపోరు. అనుమంతుగోడు అసలే అమాయకుడు బాబూ.

ఏడ తప్పిపోయాడో? ఏం కష్టపడ్తున్నాడో బిడ్డ?'

'ఆవర ముసలిముండాకొడుకా. నేను నీ కొడుక్కోసం వస్తే నన్నే నీ కొడుకుని వెతికిపెట్టమంటావా? ఒరేయ్. వెధవ్వేషాలేస్తే మక్కెలిరగ్గొట్తాను. నీ కొడుకును ఎక్కడ దాచావో ముందు మర్యాదగా చెప్పు'

'దాసటమేంది బాబూ? ఆడెందుకు దాక్కుంటాడు?'

'నాటకాలాడకురా. హత్యచేసినోడు దాంకోక పల్లకీ ఎక్కి వూరేగుతాడా? అందులో ఇక్కడ యస్సై ఎవరు? గోవర్ధనరావు అంటే మహామహా మర్డరర్స్‌కే హడల్. ఇక నీ కొడుకోలెక్కా నాకు? ఆఫ్టరాల్— ఛోటా మర్డరర్'

'మర్డర్! అంటే హత్తె! నా కొడుకు హత్తెసేసేడా? ఎవర్ని? ఎప్పుడు? ఎందుకు?'

ఎంకన్నకు జవాబిస్తాడా సబిన్‌స్పెక్టర్? ఇల్లంతా సోదా చేయమని పోలీసులకు ఆజ్ఞలిచ్చాడు. వెంకన్నను, నర్సమ్మను, చామంతిని నిలబెట్టి ప్రశ్నలు వేయసాగాడు.

'ఒరేయ్ ముసలాడా? బాబుగోరు నిన్ను రమ్మని కబురుచేస్తే నువ్వు పోకుండా నీ కొడుకును పంపించావు కదా? కారణం ఏమిటి?'

'నాకు జొరం వచ్చినట్టుంది బాబూ. తలనొప్పి, వొళ్లునొప్పులు. పేణం బాగాలేక ఆడిని పంపేను. లేకపోతే నేనే పోకబోయానా? ఇప్పటిదాకా మూసిన కన్ను తెరవకుండా పడున్నా. ఇప్పుడే లేసే. జొరం ఇంకా వుంది కావాలంటే మీరేసూడండి'

చూచాడు గోవర్ధనరావు వెంకన్న వొళ్లు ఇంకా వేడిగానే వుంది.

'నేను ఆయన్ని కనిపెట్టుకొని మంచం కాడ కూకున్నా. ఎప్పుడు నిద్దరపట్టిందో? మెలకువ వచ్చేసరికి అనుమంతుగాడింకా రాలేదని సెప్పింది కోడలు. గుండెపగిలింది. ఊళ్లోకెళ్లి నల్గురు పెద్దల్ని అడిగి కబురు అడిగొచ్చేసరికి ఇదిగో ఈయన లేపి మామీద ఈరంగాలు తొక్కసాగేడు. అప్పుడు మీరొచ్చినారు' నర్సమ్మ అంది ఏడుస్తూ.

'నా మొగుడు రాకపోతే నాకసలు నిద్దరే పట్టలేదయ్యా. మామయ్య పేణం బాగాలేదు. అత్తమ్మ పనిచేసి అల్సిపోయింది. నిద్దరబోయారు. నాకేం తోచలేదు. గాబరా పట్టుకొంది. బస్తీకి ఎతుక్కుంటూ ఎల్దామా అని ఆలోచనొచ్చింది. కాస్తంత దూరం నడిసేను కూడా కానీ సూస్తున్నారు గందా? నేనొట్టిదాన్ని కాను. కడుపు లో బిడ్డున్నాడు. సీకట్లో అంతదూరం వెళ్లిరావడమంటే మాటలా. కడుపులో బిడ్డ అలిసిపోడూ? బయమేసి ఎనక్కి వచ్చేను'

వాళ్లు చెప్పినదంతా వింటూంటే కన్‌ఫ్యూజన్ పెరిగిపోయింది గోర్ధనరావుకి. వాళ్లు చెప్పిన వాళ్ల దగ్గర పంచా యతీ పెట్టేడు. వాళ్లు చెప్పిన కథలు నిజమనే దానికి బోలెడన్ని ఆధారాలున్నాయి.

మరి హనుమంతు ఏమయినట్లు?

రోజీ రత్తయ్య గాడి మనుష్యులు వాడి వెంటబడి పట్టుకొని చంపిపారెయ్యలేదు కదా?

ఆ ఆలోచన మరింత కంఫ్యూజన్‌కి దారితీసింది. అలా కంఫ్యూజన్ పెరిగేలా ఆలోచించటమే గోర్ధనరావు ప్రత్యేకత కదా మరి!

'డబుల్ మర్డర్ కేసు. మర్డరర్‌ని మర్డర్. అబ్బో! యమ థ్రిల్! సస్పెన్స్. టేకిల్ చేస్తే అలాంటి కేసుని టేకిల్ చేయాలి. సినిమా కథలాంటి కేసు.' సినిమాల ప్రభావంతో కాస్సేపు ఆలోచించాడు.

తెలతెలవారబోతోంది. ఇంతదూరం వచ్చినందుకు హనుమంతు చిక్కలేదు సరికదా వాడిని గురించి వొక్క ఆధారం చిక్కలేదు కాగా వాడు తప్పిపోయాడని వెతకమని వెంకన్న వేధిస్తున్నాడు.

కానీ ఇంతదూరం వచ్చి వొట్టి చేతుల్తో పోవటం నాకు... కాఫీ కల్లర్‌కే భంగం పోలీసు వుద్యోగానికే అది మచ్చ. ఎవరోకరిని అరెస్ట్ చేయాలి. ఎవరిని చెయ్యాలి? పెళ్లాం, తల్లి, తండ్రి.

పెళ్లాం గర్భిణి. తల్లి... ఛీ ఆడదాన్ని అరెస్ట్ చేయుటమా? ఇక వెంకన్న!

"వెంకన్నా నిన్ను అరెస్ట్ చేస్తున్నా నువ్వు నాతో పోలీస్ స్టేషన్‌కు రావాలి."

"వస్తాను కానీ మావోడిని సూపెట్టారా బాబయ్యా. ధనంజయరావు బాబుగోరికాడికి వచ్చోపారి తీసికెళ్లండయ్యా. ఆరికి వాడి ఆసూకీ తెలుస్తోంది."

'ఇది ఖూనీ కేసు వెంకన్నా. నీ కొడుకు హత్యచేసేడనే దానికి సాక్ష్యం వుంది. వాడిని పట్టుకు తీరతాం. ఈలోగా నిన్ను నాలుగురోజులు పోలీస్‌స్టేషన్‌లో వుంచుతాం'

'నేనేం సేసేను బాబయ్యా?'

"నువ్వేం చేయలేదనుకో. కానీ అనుమానం మీద అరెస్ట్ చేసే అధికారం నాకుంది. కనుక అరెస్టు చేస్తున్నా. ఎదిరించక వచ్చావా సరేసరి లేకపోతే బేడీలువేసి తీసికెళ్తాను తెల్సిందా?"

'అట్టాగే వత్తాను బాబూ. కానీ ఈడ పని? అనుమంతుగోడు లేక నేను లేక... ఈ ఆడ కూతుళ్లు ఏమయిపోవాలి?'

## అసలు రహస్యం



హఠాత్తుగా ఇంటికి వచ్చిన డాక్టర్‌తో పేషెంట్— "మీరీ సమయంలో మా ఇంటికి రావటం... ఆశ్చర్యంగా ఉంది డాక్టర్!" తన కళ్ళని తానే నమ్మలేకపోతూ అన్నాడు.

"మరీ అంత ఆనంద పడిపోకోయ్! ఈ దగ్గర్లోనే మరో పేషెంట్‌ను చూసేందు వచ్చా? ఒకే దెబ్బకు రెండు పిట్టలు అవ్వట్టుగా ఉంటుందని ఇటువచ్చా!" అసలు రహస్యం చెప్పాడు డాక్టర్.

—జోకర్ (హైదరాబాద్)

'ఒరేయ్ క్వొశ్చన్లువేసి నన్ను కంఫ్యూజ్ చేయకు. నేను రమ్మన్నాను. రావాలి అంతే'

నర్సమ్మ, చామంతి ఏడ్చారు.

'ఒసేయ్ నర్సీ. కోడలు జాగరత్త. మొగుడు రాలేదని అదేమన్నా అగోయిత్తెం సేసుకొంటుందేమో! కనిపెట్టుండవే. అదసలే వొట్టి మనిషి కూడా కాదు'

'ఆడనిన్నెవరు సూత్తారు మొగుడోయ్. నీ ప్పేణం. అసలే బాగుండలేదు. జోరమొచ్చి సత్తున్న మనిసిని పోలీసోల్లు పట్టుకెల్తంటే సూడమని బతికించావు(టా దేవుడా నన్ను?'

నర్సమ్మ రాగాలు పోలీసు జీపు శబ్దంలో కల్సిపోయాయి. అక్కడ చేరిన వాళ్లంతా నర్సమ్మను వూరడించా రు. పోలీసోళ్ల అఘాయిత్యాన్ని తిట్టేరు. హనుమంతును పొగిడేరు. చామంతికి ధైర్యం చెప్పేరు.

జీపు ఆలయం దాపుల్లోకి వచ్చింది. ఊళ్లో వాళ్ళ కొందరు అక్కడికి తెల్లవారగానే 'దీర్ఘశంక'లు తీర్చుకోటానికొస్తుంటారు. అందులో చెంబు మోసితెచ్చుకోటానికి బద్ధకించే కొందరికి కొనేటి నీరే శరణ్యం.

అలాంటి బద్ధకస్తుడు వొకడు కోనేరు దాపులకిపోయి అక్కడి దృశ్యాన్నిచూచి లుంగీ అయిన దించకుండా పరుగు తియ్యసాగాడు.

ఆ పరుగు తీసేవాడికి పదిహేడేళ్లుంటాయి. వాడిని చూచాడు గోవర్ధనవారు. జీపు ఆపించాడు. పటాలంతో దిగి పరుగెత్తే వాడికి అడ్డంగా నిల్చున్నాడు.

'ఎవడునువ్వు? ఎక్కడికి పరుగెత్తుతున్నావ్? ఏంతప్పు చేసేవ్?'

వాడు అసలే బెదిరిపోయి వున్నాడు. పోలీసులగుంపును చూడగానే మరింత బెదిరిపోయాడు. ఆబెదురులో మచ్చకా(రేదు ఉచ్చపోస్తున్నట్టు వాడికి తెలియదు. రెండువేళ్లు చూపించాడు. ఆతర్వాత కోనేరు వైపు చూపించాడు.

'శవం... శవం...' ఆకు(రాడు భయంతో అరిచి వాళ్లమధ్య నుంచి దూసుకుని వూరివైపు పరుగెత్తుకుంటూ వెళ్లేడు. దీర్ఘ శంకలు తీర్చుకోటానికి వచ్చిన మిగతా జనం పోలీసుల చుట్టూ మూగేరు.

అక్కడేదో శవంవుందని అర్థమయిపోయింది గోవర్ధనానికి. భక్షం వేసింది. శవం ఎవరిది? హనుమంతుది కాదుకదా?

"బాబూ ఆడేదో శవం వుండదని ఆపిల్లోడు అరుత్తూ పారిపోతుండాడు గదా? ఆదేదో సూద్దాం పదండి?"

గోవర్ధనరావుకు వెళ్లక తప్పేదేముంది

కన్ఫ్యూజన్ అనే వూబిలో యిరుక్కుపోతున్నాడతను!

అంతే కోనేరు దగ్గరికెళ్లేరు. కోనేటిలో శవం తేలుతూ కన్పించింది.

'మెట్లమీద గుడ్డలు సార్'

"ఈ గుడ్డలు మా హనుమంతుగాడివే. అయ్యో అనుమంతూ నిన్ను సంపటానికి సేతులెవరికొచ్చా యిరా? సూత్త సూత్త సీమవన్న సంపలేని నిన్నేవరు సంపేర దేవుడా" వెంకన్న గుండెలు పగిలేలా ఏడవసాగేడు. ఊరి జనం అతడిని వూరడించసాగేరు.

"కండెక్టరు బాబుగోరిని సూడటానికి ఎల్లేడు మామా హనుమంతుగాడు. సచ్చి ఈ కోనేట్లో తేలుతున్నాడు యిప్పుడు నేనేం సేతురా దేముడో నా పెళ్ళాంకి కోడలికి ఈవార్త ఎట్టా సెప్పనురా భగమంతుడా అనుకుంటూ... నాయనా... హనుమంతూ'

అప్పటికే శవం వార్త వూరంతకీ తెల్సింది. జనం గుంపులు గుంపులుగా అక్కడికి రాసాగేరు. కొందరు అది హనుమంతు శవమేనని, కొందరు వాడిపోలికలు ఆ శవానికి లేవని వాదించుకొంటున్నారు.

గోవర్ధనరావు కన్ఫ్యూజన్ యింకోస్థాయి పెరిగింది.


'అక్కడ మరో రకంగుడ్డలున్నాయి. అవి ఎవరివి?' అతను మనసులో మాటను బిగ్గరగానే అన్నాడు.

కానీ సమాధానం యిచ్చేదెవరు? ఎవరి గొడవలో వాళ్ళున్నారు.

యీలోగా వర్సమ్మ, చామంతి వచ్చారు. గుడ్డల్ని చూచి గోదుగోడున ఏడవసాగేరు.

యిక అక్కడవుంటే కేసు సంగతి దేముడెరుగు. తనకి పిచ్చెక్కిందేలా కన్పించింది గోవర్ధనరావుకు అంచేత ఆ రెండు జతల బట్టల్ని 'హేండ్‌వోవర్' చేసుకోమని పోలీసు కానిస్టేబుల్‌కి ఆర్డర్ జారీచేసి జీపువైపు నడిచా డు. మరో యిద్దరు పోలీసుల్ని అక్కడ కాపలా వుండమని చెప్పేదు.

యీ జనానికి వొట్టి కన్ఫ్యూజన్. బుర్రలులేవు. ఆలోచనలు అసలు లేవు. దున్నపోతు యీనిందంటే కట్టేయమనే రకం కైసంత కన్ఫ్యూజ్ అయిపోయింది చిరాగ్గా అనుకొన్నాడు.




## బీద పరిశోధనలు

మనదేశంలో ఎందరో విజ్ఞాన సాంకేతిక శాస్త్రవేత్తలు ఉన్నారు. సంఖ్యాపరంగా మనదేశ శాస్త్రవేత్తలు ప్రపంచంలోనే మూడవ స్థానాన్ని ఆక్రమిస్తున్నారు. అయితే తలసరి సంఖ్య విషయంలోకి వస్తే మనం చాలా వెనుకబడి పోతాం!

జపాన్, అమెరికాలలో ప్రతి పదివేల మందికీ ఉన్న శాస్త్రవేత్తలలో ఎనిమిదో వంతు మంది మాత్రమే మన దేశంలో ఉన్నారట! తలసరి సంఖ్యాపరంగానే కాదు పరిశోధనల కోసం మనదేశం చేస్తున్న తలసరి ఖర్చు కూడా ఆ దేశాలతో పోలిస్తే చాలా తక్కువే! మనదేశం పరిశోధనల కోసం చేస్తున్న తలసరి ఖర్చు 116 రూపాయలయితే అమెరికా 2065 రూపాయలు, జపాన్ 1092 రూపాయలు వినియోగిస్తున్నాయట! అంటే మనవి బీద పరిశోధనలన్న మాట!

—జూపిటర్

కానీ అతని మనసు కెవరో చెప్తున్నారు. కోనేటిలో శవం హనుమంతుదికాదు. ఆ హత్యకు యీహత్యకు సంబంధం లేదు. రెండూ వేరువేరు హత్యలు?

ఛీఛీ... వొకేరోజు రెండు హత్యకేసులా? అంతకన్నా డబ్బుల్ మర్డర్ కేస్ అయితేనే థ్రిల్!

'భగవంతుడా. ఆ శవం హనుమంతుదే అయ్యేలా చూడు.'

పోలీస్ స్టేషన్ దగ్గర జీపు దిగుతుంటే ప్రాణం కడగట్టి వల్లయింది గోవర్ధనరావుకి.

'సార్ మీకోసం ఎ.. సర్పంచ్‌గారు రాత్రిమంచి ఎదురుచూస్తున్నారు సార్. వాళ్ల తమ్ముడికి అతని ప్రత్యర్థులకి ఏదో గొడవలు జరిగేయట నిన్న మధ్యాహ్నాం. నిన్న సాయంకాలంమంచి తమ్ముడు కన్పించటం లేదుట'యిలా చెప్తుండగానే సర్పంచ్ వచ్చాడు

నమస్కార ప్రతినమస్కారాలయ్యాయి.

'ఏమిటి సార్? మళ్లీ మీదికూడా మరో తప్పిపోవటంకేసా?' అంటూ సర్పంచ్‌తో పాటు గదిలోకి వెళ్లి కుర్చీలో కూలబడ్డాడు.

నో పోలీస్ కానిస్టేబుల్ రెండు గుడ్డల మూటల్ని లోపలికి తెచ్చాడు. అందులో వొకదానిమీద సర్పంచ్ దృష్టిపడింది.

'తప్పిపోవటం కాదు సార్. నా తమ్ముడు హత్యచేయబడినట్లే వుంది. ఆ బట్టలు తమ్ముడివే' అన్నాడు హనుమంతుని కాని బట్టలు చూపిస్తూ సర్పంచ్. సర్పంచ్ మొహంలో తమ్ముడు చనిపోయినందుకు విచారం లేదు. కోపం పగతో మొహం ఎర్రనయింది.

'అంత కన్ఫ్యూజన్... కన్ఫ్యూజన్... కన్ఫ్యూజన్' అంటూ కుర్చీ వెనక్కి వాలిపోయాడు యిప్పుయి గోవర్ధనరావు!

తాండవ నృత్య కరగజానన...' అని గాయకులు పాడుతుండగా విఘ్నేశ్వర పాత్ర రంగస్థలం మీదికి ప్రదర్శించింది.

వెదురు కర్రలతో కట్టిన రంగస్థలం అది. ఆ గ్రామంలో ప్రతిసంవత్సరం వుత్సవాలు జరుగుతాయి. అమ్మవారికి. ఆ వుత్సవం పెద్దతిరునాళ్లలా జరుగుతుంది. చుట్టుపక్కల గ్రామాలమంచి జనం సంబరాలు చూడటానికి ప్రజలు కట్టుకొని వస్తారు. ఆ జనంతో పందిరంతా నిండిపోయి వుంది.

విఘ్నేశ్వర పాత్రధారికి యిద్దరు మనుష్యులు తెరపట్టేరు. విఘ్నేశ్వరుడు చేస్తూ తనను గూర్చి చెప్పుకున్నాడు.

తెర తొలగింది. విఘ్నేశ్వర పాత్రధారి నాట్యంచేయసాగేడు.

రంగస్థలంమీదనే అటొక మార్దంగికుడు యిటొక మార్దంగికుడు వున్నారు. అందులో కన్నయ్యదాసు వొకమార్దంగికుడు. కానీ కన్నయ్యదాసు ముందువైపున వొక మృదంగాన్ని వీపున వెనక వైపు నుంచీ మృదంగాన్ని కట్టుకొన్నాడు. అతని చేతులు రెండు మృదంగాలమీదపడి శబ్దాలు చేస్తున్నాయి.

రుక్మిణి పాత్ర ప్రవేశించింది. ఆ తర్వాత కృష్ణపాత్ర.

గాయకులు పాడుతుండగా యిద్దరు నృత్యం చేస్తున్నారు.

లోపల్నించి చిత్రంగా చూస్తున్నాడు హనుమంతు.

అతని మెడమీద చెయ్యిపడింది.

సత్యభామ వేషంలో వున్న అంజలి!

'ఎలా వున్నావేమ? బాగున్నావా?' సత్యభామలా జడను వూపుతూ మెల్లగా అడిగింది అంజలి.

ఆమెను చూడటానికే రెండుకళ్లు చాలలేదు హనుమంతుకు. యీ సమాధానం ఏం యివ్వగలడు.


భాగవతులు సత్యభామ అలంకరణకు అత్యంత ప్రాధాన్యతనిస్తారు ప్రతి అలంకారం జాతీయతను తెల్పుతుంది. సత్యభామ మొహానికి అరంశంకోటా వేసుకొంది. జడపాదుగ్గా వేసుకొంది. జడకుచ్చులు క్రిందికి వేలాడుతున్నాయి. జడబిళ్ల తళుక్కుకుంటోంది. సూర్యుడు, చంద్రుడు, అడ్డబాస, మెడలో ఆభరణాలు, బాజబంధులు, గంటలవడ్డాణము, చీరెకట్టు, బొట్టు నొసట వెండితీగె రేకు అలంకరణ ఆంధత్వానికి ప్రతీకగా వుంది.

'ఏంటిలాగే చూస్తున్నావే! అలంకరణ బాగుందా?'

'ఊ. నువ్వు అచ్చం సత్తెబామలా వున్నావు'

'అలాగా! కానీ నువ్వెలా సూత్తన్నావో తెల్సా? కిట్నుడిలాగా చూస్తన్నావ్. అలా సూడకు. నాకు సిగ్గేత్తుంది. యిక్కడే నాటైం చేసెయ్యగలను.

సత్యభామ రంగప్రవేశం చేసే సమయం ఆసన్నమయింది. ... వివికిడి దరుకులు పాడటం అయింది.



ఒక్కసారిగా మృదంగ శబ్దాలు మిన్నుముట్టేయి.

సత్యభామ రంగప్రవేశం చేసింది. రామచిలుక నాతో పోరెనో వోయమ్మలారా... అంటూ దోమతెరవెనుక నిల్చి నర్తించింది.

యింతవరకు రెండో మార్దంగికుడు ఎక్కువగా వాయిస్తున్నాడు. సత్యభామ ప్రవేశంతో కన్నయ్యదాసు విజృంభిస్తున్నాడు.

తూర్పు భగవతపాట, ఆట, ప్రాచీన ధ్రుపద సంప్రదాయానికి చెందినట్టిది. తూర్పు కళాకారులు, పాడి ప్రేక్షకుల్ని వొప్పించాలి. గాయకులు త్రిస్థాయిలో, త్రి విధలయందు గానం చేయాలి. ఆటలో సమ, విషమ గతుల విన్యాసములతో కూడిన లయ, వూపుతో గూడిన 'అడవులు' ప్రాధాన్యత గల్గియుంటాయి. వీరి సంప్రదాయంలో మృదంగమునకు వొక విశిష్టస్థానం వుంది. వాద్యపద్ధతి కూడా ధృపద సంప్రదాయములో వుంటుంది. వాదము వ్యూహించువిధము, త్రిశాల విన్యాసములతో కూడిన జతికట్టు బాట్లు తన్మయత్వాన్ని కలిగిస్తాయి.

త్రికాలములలో ఉరుములు మోగుతున్నాయ్.

ప్రథమకాలము—

తద్దణ తకతిం —ధన తకతిం — తద్దణ తకతిం—

కీట తా తిమ్ — కిట తక తక తక — నగధణ — కిటతక

తద్దణ తకతిం—

ద్వితీయ కాలము —

తధింద దింద తదింద తింద

తదింద తిద

తృతీయకాలము —

తాకిట తకతక కిటతలాంగ్—

తాకిట తకతక కిటతలాంగ్—

తాకిట తకతక కిటతలాంగ్—

తాకిట తకతక తకతక తాంతైతైతై తత.

సావేరి రాగంలో తిశగతిలో దరువుపడుతుండగా అందుకు ముందే హాస్యపాత్ర అయిన మాధవి, మాధవ పాత్ర ప్రవేశించింది.

గోవిందా గోవిందా — భజగోవింద గోవింద

గూడకట్టు వేమకట్టితి — మకరకుండలాలు చెవుల బెట్టితి—

తిరుమవగ శుద్ధ త్రిశూర్ణ మే పమవు

తిరుమంత్రమే మాటతీర్ద చెయూదకంచు

ఎద్దువెక్కిన వాడు లింగడూ — బొల్లిగద్ద నెక్కినవాడు రంగడు



వారిద్దరికీ భేదాలు యించుమంతయు లేవు.

కానీ హాస్యధారి పాత్ర కొత్త వాడుకావటంవల్ల హాస్యం తగుమోతాదులో మాత్రమే వచ్చింది.

ఆ తర్వాత సత్యభామ చెప్పిన ప్రతి పదానికి, మాధవి హాస్యపదం చెప్పసాగింది. దరువుకు

ప్రతిదరువు—

సత్యభామ అంటోంది.

"వినవమ్మ యేమి చెప్పుదు — ఘనుడగు శ్రీ విష్ణు మాయగావక యేమన్, వవిభూవి వెతకవచ్చితి అనువొందగ సత్యభామ యందురె నన్నున్"

అందుకు మాధవి హాస్యంగా

వినవమ్మ ఏమి చెప్పుదు — ఘనముగ వరిబువ్వ పప్పుగారెలు బూరెల్, వవిభూమి మ్రింగవచ్చితి, అనువందగ బుద్ధిమంతుడందురు నన్నున్ అంటుంది.

'భామనే — వయ్యారి భామనే, భామనే పదహారువేల కోమలూలందరిలోన, రామరో గోపాలమూర్తికి ప్రేమదావనగు సత్యభామనే' అని సత్యభామ అంటే —

'బొట్లనే — నేనే వీరం బొట్లనే, బొట్లనే పదహారు పుంజీలట్లు బూరెలు గారెలరిసెలు, పొట్లకాయ యుగురుపట్టేదు పొట్టనిండా తిన్నయట్టి—" అని మాధవి అందుకుంది.

సత్యభామ ఈ క్రింది గీతపద్యం చదివింది.

"తరుణి జన్మంబువెంచంగా తరమయ్యే
పురుషులనగను చంధుని బోల్చవచ్చు
నిరత మొకచోట తరలోనించి యుండె
నిరతమొకరింట విందుగా నరుగు శశియు"

వెంటనే మాధవి అందుకొంది—

"గారెనీ నట్టువదు మనుకన్నమేమి
అదుగుమాడిన కరకర లాడుటేమి
కోరిభుజియింప యిరుగవు కుటిలమేమి
ఎంత వెర్రివి నీవోవో వింతదారి వప్ప'

జనం హాస్య పాత్రధారి మాటలికి నవ్వేరు.

కానీ సైడ్‌వింగుల్లో వున్న ట్రూప్‌వాళ్లు అప్పుడు 'గురువులు'ను తల్చుకొన్నారు.

గురువులు కన్నయ్యదాసు ట్రూపులో హాస్యపాత్రధారి. కన్నయ్య దాసుకు స్వయాన బావ మర్ది. నలభై ఏళ్లున్న అతనికి భార్య చనిపోయింది. అప్పటినుంచి అతని కన్ను అంజలిపైన పడింది. కానీ అంజలి అతడిని మేనమామగానే చూచింది. అతనికి తనపైన మరోరకమైన భావం వున్నదని ఆమె అతని ప్రవర్తన ద్వారా పసిగట్టింది. అప్పటినుంచి అతడిని అసహ్యించుకోసాగింది. దాంతో కన్నయ్యదాసుతో తేల్చేసుకోవాలనుకొన్నాడు గురువులు.

హాస్యగాడిగా తనకు గొప్పపేరుంది. తను లేనిదే ఆ ట్రూప్ నడిచేదేలా?

గురువులు, భామాకలాపంలో, సత్యభామతో వున్నప్పుడు 'మాధవి'గా కృష్ణుడితో వున్నప్పుడు 'మాధవ'గా తనని తను చెప్పుకొంటూ ఆ రెండు పాత్రలద్వారా హాస్యాన్ని సృష్టిస్తాడు. భాగవత యితివృత్తమైనా, మాట్లాడేది సత్యభామ కృష్ణపాత్రతోనైనా అతను

హాస్యంకోసం సమకాలీన సమస్యల్ని తడివి హాస్యంగా వ్యాఖ్యలు చేస్తుంటాడు. ప్రేక్షకులకి అతను అలా మాట్లాడితే యిష్టం. అందుకే అతనికి మంచి హాస్యగాడుగా గుర్తింపువచ్చింది.

గుర్తింపు మరింత గుర్తింపును కోరుతుంది గదా?


మాధవి – మాధవ పాత్రలుగా చెప్పుకొనే బదుల ఆ పాత్రను నపుంసకుడిగా – అంటే కొజ్జాగా చేస్తే? అప్పుడు ఆంగికాభినయాన్ని యింకా బాగా ప్రదర్శించవచ్చు. అలా చచ్చేటంత హాస్యాన్ని సృష్టించవచ్చు.

బావమర్ది ఆలోచనను వింటూనే దాన్ని అసహ్యించుకొన్నాడు కన్నయ్యదాసు.

యిప్పటికే తూర్పు భాగవతం మన చేతుల్లో పడి సగం చచ్చిందిరా. మన పూర్వీకులు అనుసరించిన సంప్రదాయాల్ని మనం తెల్సి కొంత తెలియక కొంత గంగలో తొక్కేం. మనం కడుపుకోసం భాగవతం ఆడుతున్నా కక్కుర్తి పనులు పనికి రావురా. కృష్ణుడి కథలో నపుంసకుడికి స్థానమా? మాధవి మాధవ పాత్ర స్వరూప స్వభావాలు ఏమిటనుకొంటున్నావ్? జీవాత్మను పరమాత్మను సంధానం చేసే వున్నత పాత్రరా. ఆ కథను ఆధారం చేసుకొని భారత భగవత రామాయణేతిహాసాల్లో మహత్తర విషయాలను ప్రచారం చేయటానికి బదులు దొడ్డి రాజకీయాలు, సినిమా కబుర్లు చెప్పి ఆ పాత్రను యిప్పటికే భ్రష్టంచేసేను. యింకా దాన్ని దిగజార్చటం నేను సహించను.

కన్నయ్యదాసు ఆ భాగవతమేళానికి నాయకుడు. నాయకుడి మాట తీర్పు మిగతా వారందరికీ వేదవాక్కే. పైగా కన్నయ్యదాసు తూర్పు భాగవతులలో ప్రసిద్ధి చెందిన వ్యక్తి.

'నా ప్రతిభకు మీనీడలో వున్నంతసేపు రాణింపురాదు. మీకు బాగుపడటం చాతకాదు. మమ్మల్ని బాగుపడనివ్వరు. ఆఖరి మాటగా చెప్తున్నా. అంజలిని నాకిచ్చి పెండ్లి చేస్తే మీమాట విని మీతోవుంటాను. లేకపోతే నాకు సినిమా ఛాన్సు వచ్చింది. వెళ్లిపోతాను' అని బెదిరించాడు. నెల్లూరు దగ్గర వో గ్రామంలో ప్రదర్శన అయ్యాక ఆవూరి వాళ్లెవరో సినిమా తీసే ఆలోచనలో వున్నారు. గురువులు నటన నచ్చినవారు అతనికో వేషం యిస్తామన్నారు. అదో గొప్ప అవకాశం కదా తనకి? ఆ అదును చూసుకొని అలాబెదిరిస్తేదిగివస్తాడనుకొన్నాడు గురువులు.



## ఇబ్బంది

"మాష్టారూ... మనం ఆంగ్లేయుల్ని తరిమి కొట్టి స్వతంత్రం సంపాదించుకున్నాం కదా! మరి ఇంగ్లీషునే ఇంకా ఎందుకు ఎక్కువగా వాడుతున్నాం" అడిగాడు గోపి.

"ఒకవేళ వాళ్ళు మళ్ళీ ఇక్కడికొస్తే మనం ఇబ్బంది పడకూడదని" చెప్పారు మాష్టారు.

—అల్లిక తాతారావు (మంగళగిరి)

'నీయిష్టం కానీ అంజలిని నీకిచ్చి పెళ్లి చెయ్యడం అన్న ఆలోచనే నాకు అసహ్యంగా వుంది. పైగా నీవెర్రి వేషాలు నాకు నచ్చటం లేదు. వెర్రివేషాలు మాని క్రమశిక్షణ పాటిస్తూ కుటుంబ సభ్యుడిగా, సామరస్యంతో వుండగలిగితే వుండు. లేకపోతే నీయిష్టం. కానీ నొక్కసారి వెళ్లాక మళ్లీ తిరిగి యీ సమాజంలోకి ప్రవేశం వుండదని గుర్తుంచుకో''

గురువులు అలా వెళ్లాక హాస్యపాత్రకు ఖాళీ ఏర్పడింది. కానీ ఆ సమాజంలో ప్రతిసభ్యుడికి ప్రతిపాత్ర వచ్చును. ఎవరైనా ఏపాత్రనైనా వెయ్యగలరు. కానీ ఎంతో అవ సరమైతే తప్ప వెయ్యరు. నప్పాలిగా?

మొదట్లో హనుమంతుకు ఆ పాత్రను యిచ్చి శిక్షణ యిద్దామనుకొన్నాడు కన్నయ్యదాసు. కానీ హనుమంతు భయపడ్డాడు.

కూలీపని చేసుకొని బతకాల్సిన తనువేషాలు వెయ్యటమా? అమ్మో!

'అయ్యా హాస్యపాత్రకు హనుమంతు పనికి రాడు. అంత అందంగా వున్నవాడు ఆపాత్ర వేస్తే కృష్ణుడు వేసేవాడు మరింకెంత అందంగా వుండాలె!'

కృష్ణుడు పాత్రను కన్నయ్య దాసు తమ్ముడు రామదాసే వేస్తాడు. రామదాసు వయసులో పెద్దవాడయిపోతున్నాడు. శరీరం స్థూలమయింది. అయినా మరో వారసుడు దొరికితే కదా ఆ పాత్రను వదిలేది?

'హనుమంతూ మా ప్రదర్శనలు నాలుగయిదు చూడు. నీకు వుత్సాహం కలిగి, ధైర్యం వస్తేనే వేషం వేద్దువుగాని?!

హనుమంతు చూస్తున్న మొదటి ప్రదర్శన అది. అతనికి చూచేకొద్దీ చూడాలన్న వుత్సాహం కలుగుతోంది.

'తద్దిం తక్క తక్క! తద్దింతక్క! తద్దింతక్క మృందంగంపై వరుస పలుకుతోంది.

'పాద పద్మములు తడబడెసాగే నోయమ్మా

సత్యభామ రంగస్థలంమీదకి ప్రవేశించి అందంగా అభినయిస్తోంది.

అలిగి వెడలిన తన కృష్ణస్వామి వారిని వెతుకుచు వానిని కలియుటకు అభిసారికయై సత్యభామవెడలినప్పుడు పాడబడునట్టి దరువు యిది. నడువలేక ఆమె పాదములు తడబడుచున్నవి. కాని మనస్సు ప్రియుని సందర్శనము కొరకు తహతహ లాడుచున్నది. తొందరపడుచున్నది. కలవరపడుచున్నది. ఆలస్యమును సహించలేక యున్నది. పలు విధముల పరుగులిడుచున్నది. ఉత్సాహపడుచున్నది. అయిననూ మనస్సంతా వేగముతో శరీరము పరుగెత్తలేక తననిస్సహాయ స్థితిని తెల్పుచున్నది.

తాం తద్దిం తక్క తద్దింతక్క

తద్దిం తక్క తద్దిం తక్క తద్దిం తక్క తద్దిం తక్క

కిట తక తరికిట తోం కిటతక తరికిట తోం

కిట తక తరికిట తోం కిట తక తరికిటతోం, కిట తక తరికిటతోం.

సత్యభామ వర్తనము, కన్నయ్యదాసు మృదంగ వాద్యము పోటీలు పడినట సాగుతున్నాయ్. హనుమంతుకు చూడటానికి రెండు కళ్లు చాలలేదు.

కాస్సేపు గడిచాక కన్నయ్యదాసు జోడు మృదంగాలపై లయవిన్యాసం చేసేడు. అది ప్రేక్షకులతోపాటు హనుమంతునూ ఆకట్టుకొంది. రోమాంచితమయింది అతనికి!

చూడటానికి సాధారణంగా కనిపించే యీ సన్నపాటి వ్యక్తి ఎంత గొప్పవాడు? ఓ! అదేం వాద్యం? అదేం శబ్దం? అంజలి మాత్రం? ఆ చూపులు... ఆ నడకలో వయ్యారం... ఎంత గొప్పగా వుంది?

నాటకం అయిపోయాక హనుమంతు ఆనందంపట్టలేక కన్నయ్యదాసు పాదాలకు నమస్కరించాడు.

'నేను సాలా అదురుట్టమంతుడిని మీలాంటి గొప్పోల్ల నీడ దొరికింది. మీరు సాలా గొప్పోరండీ' అన్నాడు.

'మా అయ్య తల్సుకొంటే నిన్ను గొప్పోడిని సేత్తదు. తెల్సా?'

హనుమంతుకు వేషం వెయ్యాలన్న కోరిక కలిగింది.

* * *

యస్సై గోవర్ధనరావుకు కించిత్ కోపంగా వుందావేళ. హెడ్‌కానిస్టేబుల్ మీద. కానిస్టేబుల్స్‌మీద విరుచుకుపడుతున్నాడు.

తను కన్‌ఫ్యూజన్‌లో పడిపోయానని గ్రహించినప్పుడు అతనికి అలా కించిత్ కోపం వస్తుంది. ఇప్పుడు తను కనఫ్యూజన్‌లో పడిపోయానని గ్రహించాడు.

కోనేరులో శవాన్ని బయటికి తీస్తే అది సర్పంచ్‌గారి తమ్ముడిదే. మరి హనుమంతుగాడి



## కారులో ఫ్రిజ్

ఇంట్లో రిఫ్రిజిరేటర్ ఉండడం వింతేంకాదు! ఈనాడు చాలామంది ఇళ్లలో ఫ్రిజ్‌లు ఉంటూనూ ఉన్నాయి. మరికొన్నాళ్లకు... అందరూ మా కారులో ఫ్రిజ్ ఉందని చెప్పుకునే రోజు రావచ్చు కూడా!

ఎందుకంటే గుజరాత్‌కు చెందిన గ్లోబ్ ఆటో లిమిటెడ్ ఈ మధ్యనే ఏకంగా వాహనం మొత్తాన్నే 'రిఫ్రిజిరేటడ్ వాహనం'గా మార్చగలిగింది. ముఖ్యంగా పాడయిపోయే ఆహార పదార్థాల్ని దూర ప్రాంతాలకు తీసికెళ్లి వెళ్లవలసి వచ్చినపుడు ఇలాటి వాహనం ఉపయోగ పడుతుంది. 'ఫ్రియాన్ – 12' అనే వాయువుతో నడిచే ఈ రిఫ్రెజిరేటర్ మైనస్ 22 డిగ్రీల తక్కువ ఉష్ణోగతను కూడా ఉత్పన్నం చేయగలదు. డీసెల్ ఇంజన్‌తో వాహనం నడుస్తున్నపుడే గాక ఆగినపుడు ఎలక్ట్రిక్ మోటార్‌తో కూడా పనిచేసే విధంగా రూపొందిన ఈ 'రిఫ్రిజిరేటెడ్ కారు' మన దేశంలో ఉత్పత్తిఅయిన మొట్టమొదటిదే!

—జూపిటర్

బట్టలు కోనేరు దగ్గరికెలా వచ్చాయి?

సర్పంచ్ తమ్ముడు మర్డర్ కేసుకు, రత్తయ్య మర్డర్ కేసుకు ఏదన్నా సంబంధం ఉన్నదా? లేదా?

'సంబంధం ఏమీ లేదు' అంటారు సర్పంచ్ వాళ్ళు. తన తమ్ముడిని గ్రూపు కక్షలవల్ల తన గ్రామంలో ఎగస్పార్టీవాళ్ళే హత్య చేశారని, వాళ్ళని వెంటనే అరెస్టు చేయకపోతే తను హైదరాబాద్‌కు వెళ్తానని బెదిరించా డు సర్పంచ్.

హనుమంతుగాడికి సర్పంచ్‌కి తమ్ముడికి ఏదో కక్షలున్నాయని అంచేత ఇద్దరు వొకర్నొకరు చంపుకొని కోనేరులో దూకి చచ్చారని సర్పంచ్ ఎగస్పార్టీ వాళ్ళు ఓ పుకారు పట్టించి ప్రచారం చేశారు.

అయితే సర్పంచ్ తమ్ముడి శవం పైకి తేలటమేం? హనుమంతు శవం తేలకపోవడమేం? కోనేరులో అడుగున గల బిలం దగ్గరికెళ్ళి లోపలికి మునిగిపోయి వుంటాడని .... వారి కథనం. అలా బిలం దాకా వెళ్ళి అంతుచిక్కకుండా పోయిన శవాలు వున్నాయి కనుక ఆ కథనాన్ని జనం నమ్మేరు.

కానీ గోవర్ధనరావుకు ఆ కథ జానపద సినిమాలా కన్పించింది. నమ్మబుద్ధేయలేదు. పోనీ నమ్మేసి ఊరుకొందామనుకొన్న సర్పంచ్ వ్యతిరేకులు వూరుకోనిచ్చేలా లేరు. వాళ్ళు ఊరుకున్నా ఎంకన్న అసలు వూరుకునేలా లేదు.

'నా కొడుకు దనంజయబాబుగోరిని సూట్టానికి సాయంత్రం ఎల్లి తిరిగి రాలేదు. ఆడివి పట్టుకుని నాకు అప్పజెప్పండి బాబోయ్' అని వాడు ఇంట్లో, బజార్లో, ధనంజయరావు దగ్గర, గోవర్ధనరావు దగ్గర ప్రతినిత్యం మొరపెట్టుకుంటున్నాడు.

'బాబూ హనుమంతుగాడు అసలు రత్తయ్యను హత్య చేసేడంటారా? చేస్తే ఇక్కడ రత్తయ్యను, అక్కడ సర్పంచ్ తమ్ముడిని ఒకేరోజు, ఒకే సమయంలో ఎట్లా హత్య చేయగలదు? అసలు రత్తయ్యను చంపింది హనుమంతే అనే దానికి మీ కూలీవాడిచ్చే సాక్ష్యం కాక మరేమన్నా సాక్ష్యాలున్నాయా?'

ధనంజయరావు గోవర్ధనరావు వైపు చిరాగ్గా చూశాడు.

'ఏమయ్యా ఇన్‌స్పెక్టర్? పోలీసు ఉద్యోగివి నువ్వా నేనా? నువ్వు సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలకు నన్ను సమాధానం చెప్పమంటావేమిటి? అసలు నాకీ హత్యతో ఏమిటి సంబంధం? నా కూలీ చెప్పిన సాక్ష్యం నీకు నమ్మబుద్ధి కాకపోతే మానేయ్. రత్తయ్యను హనుమంతు అనేవాడు చంపేడని నేను చెప్పేనా? ఆ సర్పంచ్ తమ్ముడెవరో నాకు తెల్సునా? నాలాంటి పెద్దమనుష్యులతో ఎలా మాట్లాడాలో కూడా తెల్సుకోకపోతే ఎలాగయ్యా మీ పోలీసులు? రత్తయ్య కేసు ఎలా ఛస్తే నాకేం? పోలీసులు మీ ఏదుపు మీరు ఏడవండి? కానీ మరోసారి నాతో ఈ విషయం ప్రస్తావిస్తే మటుకు నీ ఇనెఫిషియన్సీ గురించి హోమ్‌మినిస్టర్‌గారికి ఫోన్ చేసి చెప్పాల్సి వుంటుంది. గుర్తుంచుకో. ఈసారికి ఏదో మన

వాడివని వదిలేస్తున్నా'

ఎదురుదెబ్బ! వెనకదెబ్బ!

ఎలా చచ్చేటట్లు?

గోవర్ధనరావుకి కోపం వచ్చింది. ఒకసారి తన డ్రెస్‌వేపు, టోపీవైపు చూసుకొన్నాడు.

'పోలీస్ వాళ్ళంటే అందరికీ లోకువయిపోయింది. బొత్తిగా విలువలేకపోయింది. అందరూ బెదిరించేవారే. పోలీసు తడాఖా ఏమిటో ఒక్కసారి తెలియజెప్పకపోతే లాభం లేదు. జనంలో కాకీ డ్రెస్ పట్ల టెర్రర్ కలిగిస్తే కానీ ఈ కేసులు తేలవు' అని అనుకొన్నాడు గోవర్ధనరావు ఆలోచించి ఆలోచించి—

'టెర్రర్, టెర్రర్' అని అరిచాడు ఒక్కసారి ప్రకాశంగా.

స్టేషన్‌లోని కానిస్టేబిల్స్ అంతా ఒక్కసారి ఉలికిపడ్డారు.

'ఓయ్ హెడ్డూ మెరికల్లాంటి అరడజను కానిస్టేబుల్స్‌ని తీసుకొని నా వెంట రా' అని ఆజ్ఞ జారీచేసి హుటాహుటిన బయటికి నడిచి వెళ్ళి జీప్ ఎక్కి కూర్చున్నాడు.


ఆరున్నొక్క కానిస్టేబుల్స్ వెనక ఎక్కేరు. జీప్ వెళ్ళి వెళ్ళి వెంకన్న ఇంటిముందు ఆగింది. ఎంకన్న అప్పుదు ఇంట్లో లేడు.

'బాబో. మా అనుమంతు కనపడ్డాడా? ఏడిబాబూ?' వర్సమ్మ అడిగింది ఆత్రంగా.

'వెంకన్న లేడా?'

'నేడు బాబూ. ఇప్పుడప్పుడే రాడు. పని మీద ఎళ్ళేడు.'

'అయ్యో ఎలా; హనుమంతు కన్పించాడు. కానీ ఇక్కడికి వచ్చే స్థితిలో లేడు. వెంకన్ననే తీసుకెళ్దామని వచ్చాము'



విన్న నర్సమ్మ, చామంతిల గుండె పగిలింది ఒక్కసారి. మొహం నల్లబడిపోయింది. వెన్నులో దడ బట్టుకుంది. ఒకరినొకరు చూచుకొన్నారు. మాట పెగల్లేదు.

హనుమంతుని పోలీసులు పట్టుకున్నారా?

ఇదంతా కనిపెట్టెడు గోవర్ధనం.

వాళ్ళిద్దరికీ హనుమంతు పరారీలో హాండ్ వుండి వుంటుందని అతను ఇంతవరకు అనుమానించలేదు. వెంకన్నని అనుమానించాడు.

'అమ్మ ముండల్లారా! కాలాంతకురాళ్ళే మీరు. ఇప్పటికి దొరికేరు!' అనుకుని ఆనందించాడు మనసులో.

''తప్పిపోయిన హనుమంతు కన్పించాడంటే నువ్వు తల్లివి, అది పెళ్ళాం. అలా మొద్దులైపోయారేంటే? సంతోషంగా లేదా మీకు? నువ్వేం తల్లివి? అదేం పెళ్ళామే?'

నర్సమ్మ షాక్‌నుంచి ముందుగా తెప్పరిల్లింది.

'ఆయన లేకపోతేనేం బాబూ! మేం వున్నాంగా? మేం వత్తాం. మా అనుమంతుగోడిని సూపించండి బాబూ అసలు ఆడికేమైంది?'

'అదీ మాటంటే. అన్నీ చెప్తాగానీ నా వెంట రండి'

తలుపువేసి అత్తకోడళ్ళిద్దరూ భయంభయంగావే పోలీస్‌స్టేషన్‌కు బయల్దేరారు.

'ఒరేయ్ హనుమంతుగాడు చావలేదు. రత్తయ్యగాడిని చంపి పారిపోయాడు. వాడి విషయమంతా ఈ ఇద్దరికీ తెలుసు. వాడు ఇప్పుడు ఎక్కడుంది కూడా వీళ్ళకి తెల్సు. వీళ్ళు గుండెలు తీసిన బంట్లు. ఆడోళ్ళని కనికరించొద్దు. రహస్యాలన్నీ రాబట్టండి. ఏం చేస్తారో ఎలా చేస్తారో నాకనవసరం. నాకు వాళ్ళ 'కన్‌ఫెషన్ కావాలి' అంటూ హెడ్‌కు పురమాయించి ఇంటికెళ్ళాడు గోవర్ధనం.

వాళ్ళిద్దరి దగ్గరనుంచి నిజం రాబట్టడానికి పోలీసులు వంతులవారీగా తమకు తెల్సిన టెక్నిక్కులన్నీ వుపయోగించారు.

ఈలోగా వెంకన్న వాళ్ళను వెతుక్కుంటూ వచ్చాడు.

'వాళ్ళు మాతో వచ్చిన మాట వాస్తవమే. కానీ అప్పుడే తిప్పి పంపించామే? ఇంటికి వెళ్ళి ఉంటారు. వెళ్ళి చూడు. నువ్వే దోవన వచ్చావో, వాళ్ళే దోవన వెళ్ళారో?' అంటూ వెంకన్నను పంపించేసేరు.

వెంకన్న ఇంటికి, పోలీసు స్టేషన్‌కి మధ్య తిరుగుతూనే ఉన్నాడు.

గోవర్ధనరావు పోలీస్‌స్టేషన్ కొచ్చేసరికి పోలీసులు అలసిపోయేరు.

'ఏమయింది? ఏమన్నా తెల్సిందా?'

'ముండలిద్దరూ పోలీసులకన్నా మొండి వాళ్ళు లాగున్నారుసార్. 'మాకేం తెలియదు' అన్నమాట తప్ప మరేం చెప్పటం లేదు'

'ఛ! ఇంత అసమర్థులైన కానిస్టేబుల్స్ చిక్కారేమయ్యా నాకు. టెర్రిర్... టెర్రిర్...

క్రియేట్ చేయాలని చెప్పనా మీకు అది చేతగాకపోతే ఎలా! అంటూ వాళ్ళు వున్న గదిలోకి తనే వెళ్ళాడు.

నర్సమ్మ తోటకూరలా వేలాడిపోతోంది. చామంతి వాడిపోయి వుంది.

వారి నా స్థితిలో చూడగానే జాలివేసింది యస్సైకి. అంతలోనే తను పోలీసాఫీసర్ అని గుర్తుతెచ్చుకున్నాడు. తన ప్రిస్టేజ్ పోలీసు డిపార్టుమెంట్ ప్రిస్టేజ్ ఏం కావాలి?

'హనుమంతుగాడిని మీరిద్దరూ కల్సి మాయం చేసేసేరు.

ఆ విషయం నాకు తెలుసు. మీకు తెల్సు. వాడి ఆచూకీ మీరు చెప్పరు. కానీ నేను కనుక్కుంటాను. పాతాళ లోకానికి పోయినా హంతకుడిని నేను వెతికి పట్టుకుంటాను. అందాకా ఈ కేసు క్లోజ్ చెయ్యను. మర్యాదగా మీరు చెప్పారా వాడికి శిక్ష తగ్గుతుంది. నేనే కనుక్కున్నానా వాడికి వురిశిక్షే. గుర్తుంచుకోండి. ఒరేయ్... ఈ ముండలు స్టేషన్‌లో చస్తే నష్టం. జీపులో తీసుకెళ్ళి కోనేరుదగ్గర వదిలిరండి'

జీపు వాళ్ళిద్దరినీ అక్కడ దించి వెనక్కి తిరిగింది.

అత్తాకోడళ్ళిద్దరూ ఒకర్ని ఒకరు చూసుకొన్నారు.

ఇద్దరి మొహాల్లోనూ తృప్తి. ఆనందం! తమ శరీర బాధల్ని మరిపించే దివ్య ఔషధం ఆ తృప్తి.

ఇద్దరూ పాడుబడ్డ దేవాలయం వైపు తిరిగేరు.

'భగవంతుడా. హనుమంతును చల్లగా చూడు. ఆడిని రచ్చించు'' అంటూ చేతులెత్తి దేవాలయంలో లేని దేముడిని ప్రార్థించారు మనసులో.

ఆ సమయంలో హనుమంతు ఎక్కడున్నాడో అన్న ఆలోచనరాలేదు వారిద్దరికి.

అతను తమ పక్కనవున్న మధురానుభూతిని పొందేరు ఆ తల్లీ — ఆ భార్యా!

* * *

సరిగ్గా ఆ సమయంలోనే హనుమంతుకాలికి గజ్జెకట్టి కన్నయ్య దాసు కాళ్ళకి నమస్కరించాడు. అతని కళ్ళముందు కృష్ణుడి వేషం మెదలుతోంది. అతని వేషం భాష



### టేబుల్స్

''నేల మీద కూర్చుని ఎందుకు రాస్తున్నావ్?'' తెలుగు మీడియం నుంచి ఇంగ్లీషు మీడియంలోకి ఆ రోజే మారిన వందనతో అంది నాలుగో తరగతి క్లాసు టీచర్.

''అదేంటి టీచర్? ఇప్పుడే అన్నారుగా మీరు 'టేబుల్స్' ఉపయోగించకుండా లెక్క చెయ్యమని''అంటూ టేబుల్స్ అంటే ఎక్కాల పుస్తకం అని అర్థం కాని వందన బదులిచ్చింది.

—జోకర్ (హైదరాబాద్)

కూడా చాలా మారేయి.

కాలచక్రం తిరుగుతోంది. తిరుగుతూనే ఉంది.

భామాకలాప నర్తకులకు అవసరమైన ఆట, పాట, మాట ఈ మూడింటిలో ప్రథమ పాఠాలు అయ్యాయి. మెలకువలు తెలిసాయి.

హనుమంతు గ్రాహ్య శక్తి కన్నయ్య దాసును ఆశ్చర్య చకితుడని చేసింది. ఎక్కడో అణగిపడివున్న ధారణాశక్తి అతనిలో విజృంభించింది.

తూర్పుభాగవతులలో, కన్నయ్యదాసుతో సహా ఎవరూ కూడా విద్యాగంధం వున్నవారు కాదు. పండితులూ కారు. జానపదులు వారు. కానీ వారికి అది కులవిద్య లాంటిది. వాటిలో మెలకువలు వారికి అంచేత త్వరగా వంట పట్టడంలో ఆశ్చర్యంలేదు. ఆ తర్వాత ఎవరి ప్రతిభా వ్యుత్పత్తులనుబట్టి వారు అందులో నిపుణులై పేరు తెచ్చుకుంటారు. అలా పేరు తెచ్చుకొని మనసావాచా కర్మణ్యా సంస్కారవంతులైన వాళ్ళలో ముఖ్యుడు కన్నయ్యదాసు.

కానీ హనుమంతు విషయం అలా కాదు కదా?

అతనికి నిన్న మొన్నటి దాకా తూర్పు భాగవతం అంటే ఏమిటో తెలియదు. నాట్యమంటే ఏమిటో, దరువులేమిటో ఏమీతెలియవు. అయినా అతను కృష్ణ పాత్రధారణకు కావల్సిన మెలకువలను అనతికాలంలోనే గ్రహించాడు. వంటబట్టించుకున్నాడు. అడవులు, విషమగతి, తీరికలు ఇత్యాది విషయాలను నేర్చుకొన్నాడు. ఆ అనుభవంతో విద్యాగంధం కాస్త అబ్బింది.

కృష్ణుడిగా వేషధారణచేసి తనని తాను ఆ వేషంలో అద్దంలో చూసుకొంటున్నాడు హనుమంతు.

పక్కన వచ్చి నిల్చింది అంజలి సత్యభామ వేషంలో.

'కృష్ణయ్య పక్కన సత్యభామ వుంటేనే అందమయ్యా. నువ్వొక్కడివే అద్దంలో ఏం చూసుకుంటావ్? ఇద్దరం పక్కపక్కన నిలబడ్డాంగా ఇపుడు చూడు' అంది అంజలి.

అద్దంలోకి చూచాడు.

చామంతి! సత్యభామ వేషంలో కన్పించింది.

తను కృష్ణుడు. చామంతి సత్యభామ.


ఆ భావనతోనే రంగస్థలంమీదికి ప్రవేశించాడు. సత్యభామను తల్చుకొన్నప్పుడల్లా చామంతి కనులముందు కన్పించింది.

చామంతి — తనంటే ఎంత ఇష్టం దానికి?

తనకు అదంటే ఎంత ఇష్టం?

సత్యభామ కృష్ణుడికోసం తపించిపోతున్నట్లే చామంతి తన కోసం తపించి పోతున్నదేమో!

"వాడు చెక్కిలి నొక్కి ముద్దుపెట్టునే— వాడు నెవ్వాలము మెడవేసునే..." సత్యభామ



నర్తిస్తోంది.

ఆరోజు ప్రదర్శనను నన్నయ్యదాసు చాలా మెచ్చుకొన్నాడు.

'నువ్వు అచ్చం కృష్ణుడిలాగా వున్నావయ్యా హనుమంతు. అంజలి ఇవాళ చేసినంత గొప్పగా ఎప్పుడూ అభినయించలేదంటే నమ్ము'.

నిజానికి అంజలి హనుమంతుమీద ప్రేమ భావనతో విజృంభించింది.

'వేషమేసినా ఇలాంటివాడు కృష్ణుడు వేషం వెయ్యాలయ్యా. ముసలి బాబాయి కృష్ణుడి వేషంవేస్తే ప్రదర్శన ఏం రక్తి కడుతుంది?'' అంజలి అంది.

కృష్ణుడుగా హనుమంతు వెయ్యటంతో, అంతవరకు కృష్ణ పాత్ర వేసిన అంజలి బాబాయ్ రామదాసు హాస్యపాత్ర వేయసాగేడు.

నెలలు... సంవత్సరాలు. వాళ్ళతో వేషాలువేస్తూ తిరిగేడు హనుమంతు. లోకాన్ని చూచాడు. మనుషుల్ని చదివేడు. కానీ అతని లోకం భాగవతుల లోకం. లౌకిక లోకం నుంచి దూరమయ్యాడు పూర్తిగా. ఆ వేషాలు పోలీసులనుంచి తనకి ప్రమాదంలేకుండా చేస్తున్నాయని అతనికి తెల్సు.

'హనుమంతూ మన కళకు బొత్తిగా ఆదరం తగ్గిపోతున్నదయ్యా. ముందు ముందు దీన్ని నమ్ముకొన్న వాళ్ళకు పొట్టకూటికి గడవదేమోనన్న భయంగా ఉంది. మాది తూర్పు భాగవతుల సంప్రదాయం. ఈ కలాపాన్ని కూచిపూడి సంప్రదాయంలో కూచిపూడి భాగవతంగా ప్రదర్శిస్తారు. అది బ్రాహ్మణులు ప్రదర్శిస్తారు. ఇది కాక గొల్ల కలాపము అని వుంది. భామా కలాపము శృంగార ప్రధానమైనట్టి ఆట రీతి. కాని గొల్ల కలాపము జ్ఞాన ప్రబోధముచేయునట్టు రచన. ఈ రచనను ఆడుట, రక్తి కట్టించుట చాలా కష్టము. 'అమరము చదవని కళాకారుడికి ఈ ఆట అమరదు' అని అంటారు. సంస్కృత శ్లోకాలతో కూడి ఉంటుంది. బిందురూపంలో మాతృగర్భంలో ప్రవేశించి, నవమాసాలు శిశువు రూపము దాల్చి, లోకములోనికి వచ్చే శిశువుకు కులము, హెచ్చుతగ్గులు, లేవు. అందరూ సమానులే అని బోధించే ఈ కలాపాన్ని ప్రదర్శించాలని నాకు కోరిక. కానీ అంత సామర్థ్యం మనకు లేదు. చోడిగాని కలాపము అని మరియొక పద్ధతి ఉన్నది. చోడిగాడు, సింగి, సింగడు ఇందలి ప్రత్యేక పాత్రలు. ఇది హాస్య రస ప్రాధాన్యత కలిగిన ఆట. సర్దాకి ఇది విను.

చోడిగాడు వచ్చేను ఈ సభలోకి.

చోడిగాడు, సింగి జాడలు వెతకుచు
వేదుకమీద పూబోదలు జాడగా

— — — — — — —

రావేరావే సింగీ రమణి నన్నేలుకోవే... అని తపిస్తాడు చోడిగాడు. కొంతసేపలా తపించాక సింగి ప్రత్యక్షమవుతుంది.

'కల్లుద్రావనేల కనులుమీదికి వచ్చి కొట్టనేల కాళ్ళు బట్టనేల' అని ఆఖరికి ప్రసన్నురాలవుతుంది.

'సింగీ సింగడూ కలిగే సంగవలారా, యూ యంగజాని గర్వమడిగె నమ్మలారా' అని పాడుతూ తెరలోకి పోతారు ఇద్దరూ.

'ఎరుకలసాని వేష కథ' ఇందులో భాగంగానూ లేక విడిగానైనా ప్రదర్శించవచ్చు.

'బిరాన ఎరుకల సరోజా ముఖి
సుందరం బుగను వచ్చెన్
ఎరుకకావచ్చెను అవ్వోయవ్వ
ఎరుకతో వచ్చే ఎల్లలోకవు జనులు ఎంతో పొగడగనూ...' అంటూ ఆ ఎదుట ప్రవేశిస్తుంది.

'ఎరుకే సర్వజగంబులు
ఎరుకే యిహపరము లాత్మ ఎరుకే సీ పుణ్యం
ఎరుకే పాపంబును నీ
యెరుకే నరకంబు ముక్తి ఎరుకే ఎరుకా'

ఇలా సాగుతుందా కథ—

ఇదంతా నీకెందుకు చెప్పేనో తెల్సా హనుమంతూ?

నేను వృద్ధుడనవుతున్నాను. ఇవాళ వున్న శక్తి రేపు నాకుంటుందని నేననుకోను. నా తర్వాత ఈ సమాజాన్ని నడిపే నాయకుడిని నేను బాగుండగానే ఎన్నుకొని అందరికీ చెప్పాలి. నువ్వు అన్నివిధాలా సమర్థుడివి. యువకుడివి. కానీ మా కుటుంబంలో వాడివి కావు. ఇదికులవృత్తిలాంటిది మాకు. కుటుంబ వృత్తి. నువ్వు మా కుటుంబంలో ఒకడివై అన్ని కలాపాలలో ఆకర్షణలన్నీ కలిపి ప్రదర్శనలు ఏర్పాటుచేసుకోవాలని కోరిక. మా కుటుంబంలో ఒకడివైతే నేనుండగానే అవన్నీ నీకు నేర్పిస్తాను. ఏమంటావు?"

హనుమంతు ఏమనగలడు?

అంజలి తనపైన మరులుగొని వుందని అతనికి తెల్సు.

కాని తాను?

తను ఎవరో చెప్పుకోలేదు. పెళ్ళయిందని, బిడ్డకూడా వున్నాడని చెప్పలేదు.

## ఫైర్‌ప్రూఫ్ నగరం



ఎప్పుడు ఎక్కడ అగ్నిప్రమాదం జరుగుతుందో ఎవరికీ తెలియదు. మొన్నీ మధ్య ఢిల్లీలో అనేక అంతస్తుల భవనంలో జరిగిన అగ్నిప్రమాదం ఎంతటి భయానక పరిస్థితిని సృష్టించిందో మనందరికీ తెలుసు. అయితే ఇలాటి అగ్నిప్రమాదాల బాధ మాకుండదంటున్నారు...

బొలీవియా దేశానికి చెందిన 'లాపాజ్' నగరస్తులు. ఆ నగరం సముద్ర మట్టానికి 1200 అడుగుల ఎత్తున ఉండడంతో వాతావరణంలో ఉండే ఆక్సిజన్ 'అగ్ని'కి ఎలాటి సహాయం చెయ్యదు సరికదా... మంటల్ని ఎటూ వ్యాప్తికానివ్వదు! అయినా ఆ నగరస్తులు మరీ చాదస్తంతో, తాపత్రయంతో గొడవ చేయడంవల్ల ఫైర్‌ఇంజన్‌లను కొని ఫైర్‌స్టేషన్‌లలో ఉంచింది ఆ దేశ ప్రభుత్వం. ప్రస్తుతం అవి దుమ్ము కొట్టుకుని పోయి కృష్ణా... రామా.. అంటున్నాయట పనీపాటా లేకుండా! అంటే 'లాపాజ్' నగరం ఫైర్‌ప్రూఫ్ నగరమన్న మాట!

—జూపిటర్

ఆ ప్రపక్తిని వాళ్ళు ఎన్నోసార్లు తీసుకువచ్చారు.

మౌనమే అతనికి శరణ్యమయింది.

'రైలులో నిన్ను చూచినపుడే నువ్వు అందర్నీ పోగొట్టుకుని వొంటరి వయ్యావని, దిగులు పడ్తున్నావని గ్రహించాను హనుమంతూ. 'దిక్కులేని వాళ్ళకి దేవుడే దిక్కు' అన్నారు. జన్మజన్మల బంధం ఏదో వుండబట్టే మనం రైల్లో అలా తటస్థపడ్డాం. నీ పుట్టుపూర్వోత్తరాలు నేనడుగను. చెప్పటానికి ఇష్టంలేకపోతే వద్దు. కానీ నువ్వు అలా దిగులుగా వుండకు. గతాన్ని గుర్తుచేసుకోకు. నీకు నేనున్నాను. మా కుటుంబం అంతా వుంది. నువ్వంటే ప్రాణం అర్పించడానికి సిద్దంగా వున్న అంజలి వుంది. భవిష్యత్తుకు బాటలు వేసుకో హనుమంతూ' దిగులు పడ్తూ కూర్చుంటే వూరడించి ధయిర్యం చెప్పేదు ఎన్నోసార్లు కన్నయ్యదాసు.

కానీ, దిగులు పోగొట్టుకోవాలనుకుంటే పోయేదా?

అన్నీవుండి, అందరూ వుండి ఏమీ లేనట్లు, ఎవరూ లేనట్లు తిరగటం మాటలా?

'అంజలికి నువ్వంటే ప్రాణం అని నీకు తెల్సు. నిన్ను ఆ కృష్ణపరమాత్మగా చూసుకొని మురిసిపోతోంది. నీకూ అంజలి అంటే ఇష్టమే... కనుక...''

'నాకు కొంచెం ఆలోచించుకునే టైం ఇవ్వండి''

'అలాగే రేపు మనం ప్రదర్శనలివ్వటానికి వెళ్తున్నాం. తిరిగి వచ్చాక నీ నిర్ణయం చెప్పుదువుగానిలే. తొందరేముంది?'

మర్నాడు వాళ్ళు ప్రదర్శన లివ్వటానికి వెళ్ళింది హనుమంతు స్వగ్రామ ప్రాంతాలకే.

హనుమంతు మనసులో ఆశ — భయం!

చామంతి— తన తల్లి, తండ్రి— తని బిడ్డను గురించి ఏమైనా తెలుస్తుందేమో? పోలీసులు తనని కనిపెట్టి పట్టుకుంటారేమో?

ఎలా తెల్సుకోవటం? ఎలా పోలీసులమండి తప్పించుకోడం?

తనే ఎలాగోలాగు వెళ్తే?

పోలీసులు పట్టుకుంటే? కేసు ఏమయిందో?

రెండు ప్రదర్శనలయ్యాయి. అభిమానులు ఏర్పడ్డారు. అందులో ఒకడిని ఎన్నుకొని తన తండ్రి చిరునామా చెప్పి చామంతి కివ్వమని ఓ ఉత్తరం రాసి ఇచ్చి పంపేదు రహస్యంగా—

భామా కలాపంలో కృష్ణుదు సత్యభామకు, సత్యభామకు కృష్ణుదు ఉత్తరాలు రాసుకుంటారు. అది నోటికి వచ్చిందే. దాన్నే కాస్త మార్చి గుప్తంగా రాసి పంపేదు. తమ ఎక్కడుందీ ఏం చేస్తున్నదీ రాసేదు.

చామంతి ఉత్తరం చగువుకొంది. రాయబారికి మర్యాదలు చేసింది. అత్తమ్మతో రహస్యంగా చర్చలు జరిపి తిరుగు జవాబు పంపింది.

ఓ కిట్టపరమాత్మా,

ప్రేమించే మదుసుల హృదయాలలో భగవంతుడెప్పుడూ వుంటాడు గందా? బుజ్జి కిట్టు దు దండాలు పెపు్రకుంటున్నాడు. బుజ్జి కిట్టదు నీ దయవల్లె పుట్టేదు గందా కిట్ట పరమాత్మా? బగవంతుడివి స్వయంగా చూదాలని ఈడ బకుతులెవరూ కోరుకోటం లేదు. భగవంతుదు ఏదో సోట భ్రదంగా వుంటే అదే పదేలు. ఈడ బతుకులు మొదట్లో బాధలు పడ్డా ఇప్పుదు పెమాదాలు తగ్గేయి. భగవంతుడీడికొస్తే బకుతులకు బగవంతుడిక్కూడా పెమాదమే'

రాయబారికి ఒక్కముక్క అర్థం కాలేదు. మతిపోయింది.

అయితేనేం? బట్టీపెట్టినట్లు ప్రతి అక్షరం అందజేసేదు హనుమంతుకు.

అంటే తనకి బిడ్డ పుట్టేదు. మగబిడ్డ. తవ తల్లి, చామంతి మొదట్లో బాధలు పడ్డారు పోలీసుల చేతుల్లో. ఇప్పుదు ప్రమాదాలు తగ్గేయి. అంటే కేసు పాతపడింది. కానీ తను వెళ్తే అన్నిమళ్ళీ మొదటికొస్తాయి. కేసు అలాగేవుందన్న మాట.!

తల్లి, చామంతి తానెక్కడోక్కడ సుఖంగా వుంటే చాలనుకొంటున్నారు. తను సుఖంగానే వున్నాడు. కానీ...

'ఇంతకీ ఆల్లెవరు సామీ. ఆరి బాస నీకేమన్నా అరతమయిందా?'


'బతుకుల బాస భగవంతుడికే తెలుస్తుంది బక్తా. ఆళ్ళు నీలాంటి అభిమానులే'

కృష్ణపరమాత్మ పోజులో అన్నాడు హనుమంతు!

* * *

జనం కిటకిట లాడిపోతున్నారు.

మృదంగం, తాళములు, గజ్జెలు, శృతి విన్పిస్తున్నాయి.



ప్రదర్శిస్తున్నది పారిజాతాపహరణం. క్రితంరోజు వారే, భామాకలాపాన్ని అక్కడ ప్రదర్శించటంవల్ల, అది బాగున్నదని పేరు రావటం వల్ల విన్నరానివాళ్ళు కూడా ఆరోజు ప్రదర్శనకొచ్చారు. తోపులాట— తొక్కిసలాట.

పారిజాత నాటకంలో కృష్ణుడు, రుక్మిణి, సత్యభామ, నారదుడు, మాధవి వుంటారు. కొన్ని ప్రాంతాలలో ప్రవేశపెడ్తే ఎరుకల లేక కురవంజి పాత్రను ప్రవేశపెట్టాడు కన్నయ్యదాసు కొత్తగా.

సత్యభామ ప్రవేశించింది. ప్రేక్షకులలో సద్దుమణగలేదు.

ముఖ్య మార్దంగికుడైన కన్నయ్యదాసు మృదంగాన్ని వాయించాడు. అయినా ప్రేక్షకులలో సద్దుమణగలేదు.

కన్నయ్యదాసు జీవితంలో అలా జరగలేదు. సత్యభామ ప్రవేశానంతరం ఆ పాట, మృదంగం వింటూ ఎంత వారు తన్మయత్వం చెందిన హృదయాలతో మంత్రముగ్ధులై చూస్తూ కూర్చోవాల్సిందే? అలాంటిది ఇదేమిటి?

తాండవరీతిలో ఓ జటిలమైన జతిని మూడో కాలమ్‌లో వాయించాడు. ప్రేక్షాగారంలో సద్దుమణిగింది. నిశ్శబ్దత నెలకొన్నది. ముక్తాయింపుగా ముగింపునందు "కన్నయ్యదాసు కన్నయ్యదాసు కన్నయ్యదాసు" అని మూడుసార్లు మృదంగం చేత పలికించాడు విజయచిహ్నంగా.

జనం పట్టలేని ఆనందంతో చప్పట్లు కొట్టేరు.

'గంటినమ్మ కలగంటిని — ఎంతో చిత్రము
కలగంటినే
వంటిగాను పడకటింటిలో పవళించి
కలగన్నంతట మేలుకుంటినే నా తల్లి— గంటినమ్మ కలగంటిని
నారదాముని వచ్చినారటే— దేవేంద్ర లోకము వెళ్ళినారటే
దేవేంద్రుడు జూచినారంటే— సంగీత గానము చేసినారటే
సంగీత గానమునకు మెచ్చినారటే— మెచ్చి పారిజాతమునిచ్చినారటే
శ్రీకృష్ణార్పణ మన్నారటే— శ్రీకృష్ణునికి అర్పించినారటే
తెచ్చి అక్క రుక్మిణి కిచ్చినారటే— సత్యభామకు లేదన్నారటే"—

ప్రదర్శన రసవత్తరం గా సాగుతోంది. సత్యభామకు సోది చెప్పటానికి ఎరుకల వేషంలో రామదాసు రంగంమీదికొచ్చాడు.

నవ్వులు.. నవ్వులు...

కృష్ణపాత్ర ప్రవేశించింది.

మూడో వరుసలో కూర్చుని ఉన్నాడు వీరభద్రయ్య. వీరభద్రయ్య హనుమంతు స్వగ్రామంలో మోతుబరి రైతులు. హనుమంతుని చిన్నప్పటినుంచీ తెల్సు. మంచి పనివాళ్ళని

వాళ్ళ కుటుంబమంటే అభిమానం వున్నవాడు.

వీరభద్రం ఏదో లిటిగేషన్లమీద ఊళ్ళు తిరుగుతుంటాడు. ఇప్పుడు హైదరాబాద్ వెళ్ళాలని ఆ ఊరొచ్చాడు. ఆవేళ ఏదో అవాంతరం వచ్చి వీలుపడలేదు. అతను వెళ్ళేసరికి బండిపోయింది. మరో బండికి వెళ్ళడానికి టైమ్ ఉంది. ఈలోగా ఇక్కడ ప్రదర్శన చూద్దామని వచ్చాడు.

'ఈడిని ఏడనో సూసినట్టుందరా? ఏడనబ్బా?' అనుకున్నాడు మనసులో.

కృష్ణుడు, అలిగిన సత్యభామను బతిమలాడే ఘట్టంలో వుంది ప్రదర్శన. దరవులకు అనుగుణంగా అడుగులేస్తున్నాడు హనుమంతు. కానీ అతని మనసంతా ఎక్కడోవుంది.

ఎప్పటిలాగా సత్యభామనే చామంతి అనుకోలేకపోతున్నాడు. చామంతి బిడ్డ తల్లి భర్త క్షేమం కోసం తపించే వ్యక్తి. అందుకు తన సుఖాన్ని త్యాగం చేసే వ్యక్తి.

ఈ సత్యభామ? తను అందగత్తెనన్న అహంకారం గలది.

పుష్పంకోసం అలకలు నటించి భర్తను కాలితో తన్నగలది.

సత్యభామ చామంతి కాదు. అయితే అంజలే అవాలి.

మరి చామంతి? రుక్మిణే?

చామంతి రుక్మిణి కావచ్చు. కానీ తాను మాత్రం కృష్ణుడు కాదు. కాకూడదు. ఏ విషయంలో అయినా, ఈ విషయంలో కాకూడదు.

ఆ ఆలోచనతో కృష్ణుడి అడుగులు తడబడుతున్నాయి.

హనుమంతు మనసు బాగాలేదని పరధ్యానంగా వున్నాడని అంజలి గ్రహించింది. కన్నయ్యదాసు గ్రహించాడు.

కన్నయ్యదాసు మృదంగవాద్యంతో విజృంభించాడు.

'ఈడిని ఏడనో సూసేనే! సూడటమేంది? ఈడ నాకు బాగా తెల్సినోడే. ఆ ముక్కు... మొహం... ఆ గొంతు... ఎవుడబ్బా?' వీరభద్రయ్య ప్రదర్శన చూస్తూ మధనపడ్తున్నాడు.

అతను అలా మధనపడ్తుండగానే మంగళం పాడేశారు.

జనం నన్నయ్య దాసును రంగస్థలంమీదికి పిల్చి రూపాయలనోట్లు ఇస్తున్నారు.

'లోపలికెళ్లి వాడెవడో చూస్తే?'



అప్పు

“నా కర్జంటుగా వందరూపాయలు అప్పుకావాలోయ్! ఎవరిస్తారంటావ్?” అడిగాడు రేవంత్.

“ఎవరయినా ఓ నిరాశావాది దగ్గర అప్పుచెయ్యి! ఎందుకంటే వాడికి డబ్బు తిరిగి వస్తుందన్న ఆశ ఉండదు కదా?” బదులిచ్చాడు రేవంత్.

—జోకర్ (హైదరాబాద్)

వీరభద్రయ్య లేస్తూ చేతి గడియారంలో టైమ్ చూసుకున్నాడు. మళ్లీ వెళ్లవలసిన బండి టైమ్‌కూడా అయిపోయింది.

హడావిడిగా జనాన్ని తోసుకుంటూ బయటపడి రోడ్డుమీదికొచ్చాడు. రెండోసారికూడా రైలు తప్పదుకదా?

వాడివెక్కడో చూచాను. వాడెవడు? మనసుకు ఆరాటం.

'వాడెవడయితే నాకేం? ముందు నా రైలు'

రిక్షా వేసుకుని రైలుస్టేషన్‌కొచ్చాడు. అతను వెళ్లవలసిన రైలు రెండు గంటలు లేటు!

'వాడెవడో? ఎక్కడో చూచినట్లు వుందే చూడడమేమిటి? వాడు బాగా తెల్సు తనకు? పోనీ వెళ్లి చూచివస్తే?

తన పని తాను చూసుకోక వాడెవడైతే తనకెందుకు?

మళ్లీ వెళ్లడం రావడం రిక్షాలో వెళ్తే డబ్బు ఖర్చు నడిచి వెళ్తే కాళ్ల తిప్పట! పైగా ఈ లోపల బండి వస్తే?

ఏదో హోటల్లో టీ తాగి టిక్కెట్టు కొనుక్కుని ప్లాట్‌ఫామ్ మీదికొచ్చి ఫస్ట్‌క్లాస్ వెయిటింగ్‌రూమ్‌లో కుర్చీలో కూర్చుని కాసేపు కునికిపాట్లు పడ్డాడు.

రైలు వచ్చింది. అపుడు వులిక్కిపడి లేచి రైలు దగ్గరకు పరుగెత్తాడు. రైలు కిటకిటలాడుతోంది. వెనక వాళ్లు ముందుకూ ముందువాళ్లు వెనక్కీ ఖాళీ పెట్టెలకోసం పరుగులు తీస్తున్నారు.

వీరభద్రయ్యకూడా అలా పరుగు తీస్తున్నాడు ముందుకు.

పరుగు తీస్తూ హఠాత్తుగా ఆగిపోయాడు.

అక్కడ అల్లంత దూరంలో వో దిమ్మెమీద లైటు క్రింద— ఎవరది—?

హనుమంతుకదూ? వూరంతా చచ్చాడనుకొంటున్న హనుమంతుకదూ? రత్తయ్యను చంపేడని పోలీసులు అంటున్న హనుమంతుకదూ? వాళ్లమ్మ, అయ్యా చామంతి ఏడుస్తున్న హనుమంతుగాడు కదూ?

అతని పక్కన ఆ పిల్లెవరు?

ఆ సత్యభామ వేషం కట్టిన పిల్ల! అతడి భుజంమీద చెయ్యివేసింది. గడ్డం పట్టుకొని బ్రతిమలాడుతోంది. నవ్వుతోంది. వయ్యారాలు వలకబోస్తోంది. అదుగో హనుమంతుగాడు కూడా చెయ్యి పట్టుకున్నాడు. తన ప్రక్కన కూర్చోపెట్టుకున్నాడు. ఇది నిజమా? భ్రమా?

రైలు కదులుతున్నట్లు బెల్లు మోగింది. గార్డు విజిల్ వేశాడు. రైలుపోతున్నట్లు కూతవేసింది.

వీరభద్రయ్య కంగారుగా పక్కకు చూశాడు. రైలు మెల్లగా కదులుతోంది. తాను

వెళ్లడమా? హనుమంతుకోసం ఆగిపోవడమా?

అమ్మో? ఆగడమే! అవతల అర్జెంటు పని! హనుమంతు గాడెక్కడికి పోతాడు? వీరభద్రయ్య కదులుతున్న రైల్లోని ఓ పెట్టెలో ఎక్కేసాడు. కృష్ణుడు సత్యభామ కౌగిలింతలో వున్నట్లు అతనికి అన్పించింది. కదులుతున్న రైల్లోనుంచి ఆ జంటను చూస్తే!

అసలే హనుమంతును చూచిన ఆనందంలో వున్నాడు వీరభద్రయ్య. దానికితోడు హైదరాబాద్‌కు వెళ్లిన పని వెళ్లివెళ్లగానే అనుకూలంగా అయింది. ఇక అతనికి ఆనందానికి, గర్వానికి ఎల్లలెక్కడున్నాయి?

రైల్లో అవుతే వూరు చేరడం ఆలస్యమవుతుంది. అంచేత వేరుగా బస్సులో బయలుదేరాడు.

బస్సులో ఎవరన్నా తెల్సినవాళ్లు కన్పిస్తే ఆ విషయం కాస్తా చెప్పి కడుపు వుబ్బరం తీర్చేసుకుందా మనుకుంటే బస్సులో తెల్సినవాళ్లే కన్పించలేదు. అప్పటికీ బస్తీలో వాళ్లు ఎవరైనా వుంటారేమోనని తోటి ప్రయాణీకుల్ని విచారించాడు. ఎవ్వరూ లేరు. కక్కును బలవంతంగా ఆపుకొంటున్నవాడి స్థితి అయింది.

హనుమంతు పరారీని గురించి ఇన్నేళ్లుగా ఎన్నెన్ని కథలు ప్రచారంలోకి వచ్చాయి? వాదులాడుకొని జనం పందేలుకూడా వేసుకున్నారు! పోలీసులు ఎంత అవస్థలుపడ్డారు?

ఎవరూ కనుక్కోలేని హనుమంతు ఆచూకీని తాను కనుక్కొన్నాడు. ఆ వార్తను వూళ్లో అందరికీ చెప్తు ంటే ఎంత థ్రిల్? ఎంత గొప్ప?

కానీ అలా వూరందరికి టాంటాం వేసినట్లు చెప్తే ఏమవుతుంది? హనుమంతు మీద కేసు ఇంకా అలాగే వుంది. పాతబడిపోయింది కాని పూర్తిగా పోలీసు రికార్డులలోనుంచి పోలేదు. మరి ఈ విషయం పోలీసులకి తెలిస్తే వాడిని అరెస్టు చేయరూ? కేసు పెట్టరూ? హత్యకు శిక్షేమిటి? ఉరి..



## స్నేక్‌సూప్ ప్రియులు

'జిహ్వకో రుచి' అన్నారు పెద్దలు! అంతమాత్రం చేత మరీ పాము మాంసంతో చేసిన "సూప్" అంటే ఇష్టమంటే ఎలా సార్! ఇంతకీ స్నేక్ సూప్ ప్రియులెవరో చెప్పనేలేదుకదూ! హాంకాంగ్ దేశస్థులట!

1986లో 5 లక్షలకు పైగా పాముల్ని చైనా, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, వియత్నాంల నుండి దిగుమతి చేసుకుని ఎంచక్కా 'సూప్'ను చేసేసుకొన్నారట హాంగ్‌కాంగీయులు! ఒకప్పుడు వీరికి కుక్క మాంసమంటే మహాఇష్టంగా ఉండేదట. అయితే 'రాబీస్' వ్యాధి విషయంలో ప్రస్తుతం వారు కుక్కల జోలికి వెళ్లడంలేదట! పోన్లెండి! కనీసం హాంగ్‌కాంగ్ కుక్కలు హాయిగా రోడ్లమీద తిరిగే రోజు మళ్లీ వచ్చినందుకు అవన్నా సంతోషిస్తాయి.

—జూపిటర్

అమ్మో!...

హనుమంతును వురి తీసినట్లు చామంతి, సర్సమ్మ, వెంకన్న తలలు నేలకేసి కొట్టుకుని గుండెలవిసేలా ఏడుస్తున్నట్లు ఆ మర్నాడు చామంతి శవం కోనేట్లో తేలినట్లు వో చిత్రం కళ్లముందు మెదిలింది.

ఊరందరికీ చెప్పాలన్న వుత్సాహం తగ్గించుకుని వీరభద్రయ్య ఆలోచించాడు. ఈ విషయాన్ని పోలీసులకు చెప్పి హనుమంతు చావుకు, అతని కుటుంబ వినాశనానికి కారకుడయి తానా పాపాన్ని మూటకట్టుకోడు. వెంకన్న మంచివాడు. హనుమంతు అంతకన్నా మంచివాడు. అప్పట్లో తర్వాత హత్య చేసి వుండవచ్చు. పరాయి స్త్రీలవెంట తిరుగుతుండవచ్చు. అంతమాత్రాన అతని చావుకు తను కారణం కావాలా?

మరి ఈ వార్తను తన కడుపులోనే వుంచుకోగలడా?

ఉహు... అది తన శక్తికి మించినపని సాధ్యమైనంత త్వరలో ఆ వార్తను మరొకరికి చెప్తేనేకాని ప్రాణం శాంతించదే!

ఆలోచించి ఆలోచించి అతనో నిర్ణయానికొచ్చాడు.

ఆ వార్తను తను ఒక్క వ్యక్తితోనే అతి రహస్యంగా చెప్తాడు. అదీ పూర్తి వివరాలు చెప్పడు. కానీ ఆ వ్యక్తి ఎవరు?

తన వూరి వాడు అయి వుండాలి ఆ వ్యక్తి. పోలీసువాడు అయి వుండకూడదు.ముందుగా ఎవరు ఎప్పుడు కన్పిస్తే అప్పుడు ఆ వ్యక్తికి చెప్తాడు. అదీ రహస్యంగా మరెవరికీ చెప్పవద్దని చెప్పి ఈ నిర్ణయానికొచ్చాక అతను కళ్ళు మూసుకొన్నాడు.

తనకు మొదట కన్పించే వ్యక్తి ఎవరవుతారా? మంచివాడవుతే ఎంత బాగుండును? తగవులు పెట్టి, ఇతరులు కష్టపడ్తుంటే చూచి సంతోషించే పాపారావు, తాయారమ్మ లాంటి వాళ్ళు తన వూళ్ళో ఎందరు లేరు?

వాళ్లే తన కళ్ళపడితే?

పడరు. పడకూడదు. హనుమంతు నిర్దోషి అవుతే మంచివారే ఎదురుపడాలి. పాపారావు, తాయారమ్మలు ఎదురుపడ్తే అది ఎంకన్న కుటుంబం దురదృష్టం. తనేం చెయ్యలేదు. ఓ నిర్ణయం తీసుకొన్నాక అమలు జరపాల్సిందే!

అతను బస్సు దిగుతూ తలఎత్తి చూడలేదు. దిగాక తల ఎత్తాలంటే భయంగా వుందతనికి. బస్సు వెళ్ళిపోయింది.

''బాబూ...'' వులిక్కిపడ్డాడు వీరభద్రయ్య.

''అయిదరాబాద్ ఎళ్లివత్తనారంటగా? మా అనుమంతుగోడు ఏడన్నా కనిపించాడా బాబూ?''

ఆనందంగా తలెత్తి చూచాడు వీరభద్రయ్య, ఎంకన్న!

అమ్మయ్య! హనుమంతు నిర్దోషి. ఎంకన్న కుటుంబం అదృష్టవంతమైనది.



''ఎంకన్నా. మీ హనుమంతు చావలేదయ్యా (బతికేవున్నాడు. నేను చూచాను. ఊఁ. నిజం. నేను చూచా ను. యిదిగో – నా కళ్ళతో చూచాను'' గొప్ప అనుభూతి పొందుతూ వీరభ(ద్రయ్య గర్వంగా, గొప్పగా అన్నాడు.

''ఏటి బాబూ? మా అనుమంతుగోడిని... మీరు... మీరు సూసేరా?'' నమ్మనట్లు

అన్నాడు వెంకన్న.

"అవును వెంకన్నా. నేను చూచాను. మీ హనుమంతు చావలేదు. హాయిగా వున్నాడు. నేను చెప్తు న్నాగా?" మళ్ళీ గొప్పగా అన్నాడు. అప్పటికి అతని కడుపుబ్బరం తీరిపోయింది.

"యిదో లచ్చమ్మా... సాంబయ్యా... కోటేశూ... కొండాయ్... మా అనుమంతు బతికున్నాడంట రా. యిట్టా రండి... యిట్టా రండి" పెద్దగా అరిచాడు వెంకన్న ఆనందంతో.

హనుమంతు అన్నపేరు వినంగానే రోడ్డుమీద వున్నవాళ్ళంతా వెంకన్న చుట్టూ చేరి ప్రశ్నలేయసాగేరు.

అప్పటికి వీరభద్రానికి తన పొరపాటు అర్థమయింది. వూరు మనిషి అయిన తనే హనుమంతును చూచి అంతగా థ్రిల్‌ఫీల్ అయ్యాడే? మరి అతడిని కన్నతండ్రి. ఒక్కగానొక్క కొడుకు కన్పించలేదన్న దిగులుతో వున్న మనిషి. వెంకన్న ఎంత సంతోషిస్తాడు? వూరందరికీ ఆ వార్తను టముకు వేసి చెప్పుకోందే నిద్రపద్తుందా?

"మాడండ్రా యీ ఎంకన్న కొడుకు కోసం ఎట్టా కలవరిస్తున్నాడో? మాటవర్సకి హనుమంతుని సూసేనంటేనే ఎంత సంబరపడిపోతున్నాడో? హనుమంతును నేను చూడలేదు, పాడూలేదు. ముసలోడిని ఏడిపిద్దామని అలా అన్నాను. అంతే"

ఎంకన్న కళ్ళల్లో ఒక్కసారిగా నీళ్ళు తిరిగాయి.

"అయితే మీరు ఆడిని సూడలేదా బాబూ? ఆడు సచ్చిపోయాడా?" అంటూ ఏడవ సాగేడు. చుట్టూ చేరిన జనం ఎవరిదోవన వాళ్ళు వెళ్ళేరు. వాళ్ళకి వెంకన్న ఏడుపు మామూలయిపోయింది.

"వెంకన్నా... లేలే. వూరుకో. నీ హనుమంతు చచ్చిపోలేదు. బతికేవున్నాడు. నేను చూచాను. కానీ అలా టముకు వేస్తే పోలీసులకి తెలియదూ? అంతా చెప్తాను. ఇంటికెళ్దాం పద" వెంకన్న వీరభద్రయ్య సామాను తీసుకొన్నాడు.

"మా యిల్లు తోవలోనేగా? యింట్లో సామాను పెట్టి మీ యింటికెళ్దాం. నీ పెళ్ళానికి, కోడలికి నేను చూసిందంతా చెప్తే ఫర్వాలేదుగా?"

"అదేంటి బాబూ? నేనోటీ, నా పెళ్ళాంవొకటీ, కోడలొకటీను? అనుమంతుగోడి కోసం ముగ్గురం ఏడత్తానే వున్నాం. మీరు సెప్పకపోయినా ఆ సుబవార్త నేను సెప్పకుండా వుండగలనా? మా ముగ్గురికీ వచ్చి ఆ వార్త మీరే సెప్పండి – మీ సల్లటి నోటితో"

సామాను యింట్లో పెట్టి వెంకన్న యింటికెళ్ళి ముగ్గురికీ తను చూచిందంతా పూసగుచ్చినట్లు చెప్పేడు వీరభద్రయ్య.

ఆ వార్త వింటూనే అత్తాకోడళ్ళు వొకరి మొహం వొకరు చూచుకొన్నారు. తమ రహస్యం మూడో వ్యక్తికి తెల్సిందన్న భయంతో మరేదో ఆరాటం!

''నా మొగుడు కిట్టుడి ఏసం కట్టటమేంది? ఎవరో ఆడదానితో టేసన్‌లో పేమలు సేయటమేంది? ఆడు అనుమంతు అయి వుండడు. ఎవర్ని సూసి ఎవరనుకొన్నారో మీరు?''


''అవునయ్యా. అనుమంతుగోడు బతికున్నాడన్న వార్త బాగానే వుంది. కానీ ఆడి సంగతి మీకు తెలియదా? ఆడదాని జోలికి పోయే మడిసే కాదు? ఆడికి సేమంతి అంటే ఎంత పేణమో మీకు తెలీదూ? సదువు సందెల్లేని ఎదవ, కిట్టుడి వేసం కట్టటమేమిటి? యిదంతా సిత్రంగా వుంది బాబూ. ఆడు అనుమంతుగాడంటే మాకు నమ్మబుద్ధి కావడంలేదు'' నర్సమ్మ కోడల్ని సపోర్టు చేసింది.

''లేదు నర్సమ్మా. నేను బాగా చూచాను. వాడు హనుమంతే. మన హనుమంతే. సత్యభామ వేషం ఏసిన పిల్ల వాడితో సరసాలాడుతోంది. ఆల్లను సూస్తే ఇద్దరూ పెళ్ళి సేనుకొన్నారేమోనని కూడా నా కనిపించిందనుకో''

నర్సమ్మ, చామంతి, వాడు హనుమంతు కాడనీ, వీరభద్రయ్య తాను హనుమంతును చూచాననీ – చా లాసేపు వాదులాడుకొన్నారు.

''సె! ఆపండెహె ఎర్రివోదనలు. అవతల ఆ పెద్దమనిసి బిడ్డనీ సూసేనని సెప్తావుంటే అందుకు సంతోషించక, ఆడపిల్లతో ఆడు తిరగడని మాట్లాడడని వోదిత్తారేం? ఆడు ఎవ రితో తిరిగితే మనకేం? ఆడు బతికున్నాడు. అది ముక్కెం. మగాడన్నాక ఆడది మాట్టాడిత్తే మాట్లాడకుండా వుంటాడా?

పెళ్ళాన్నొదిలి ఆడు మాత్తరం ఎన్నాళ్లుంటాడు? అదెవతో సిక్కిందేమో – మారు మనువు సేసుకొని వుంటాడు. అందులో తప్పేముందది? అట్టా గింజుకొంటారేం? ఆడు బతికున్నదు. అందుకు సంతోసించండి''



''ఊ. నీకేం? మొగాడిలా మాట్లాడతుండావ్? బంగారంలాంటి కోడలుండగా నా కొడుకు మరెవత్తెనో మారు మనువు సేసుకొంటే నేనూరుకొంటావా? అది తప్పుకాదంటావా? నీకు నోరెలా వచ్చిందలా అనటానికి? సీసీ... మీ మగాళ్ళంతా వొక్కటే''

చామంతి ఏడవసాగింది.

వీరభద్రయ్యకు మతిపోయింది!

ఎంతో సంబరపడ్తారని ఆ వార్త చెప్తే హనుమంతు చచ్చినట్లు ఆ అత్తాకోడళ్ళు అలా ఏడుస్తారేం?

''అనమంతు బతికుంటే బతికుండొచ్చు బాబూ. కానీ ఆడు మరో ఆడకూతురు ఎంట తిరుగుతున్నాడంటే మాత్తరం మేము నమ్మం. అట్లా తిరిగితే ఆడు అనుమంతే కాదు''

''అవును. నా మొగుడికి నేనంటే పేమ. యింకో ఆడదానివైపు కన్నెత్తి సూడదు. అలా సూసేవాడు నా మొగుడు కానేకాదు'' చామంతి అత్తగారి మాటల్ని సపోర్టు చేస్తూ అంది.

''అయితే మీరేమంటారు? నేను వట్టి ఎదవనంటారా? నేను చూచింది అనుమంతుగాడిని కాదంటారా? అనుమంతుగాడు కిట్టుడి వేషం వెయ్యటం అబద్దమంటారా? ఆడు సత్తెబామ ఏసం ఏసిన పిల్లతో సేతులు పట్టుకొని కబుర్లు సెప్తూ పక్కన కూర్చోపెట్టుకోటం నేను సూడలేదంటారా?''

''అయన్నీ ఏమో నాకు తెలియదు. కానీ నా మొగుడు మరో ఆడదాన్ని కన్నెత్తి చూడడు''

''అవును. అనుమంతుగోడు నా బిడ్డ. వాడు భార్యకు బిడ్డకు అన్నేయం సెయ్యడు. పరాయి ఆడదాన్ని కన్నెత్తి సూడడు''

వీరభద్రయ్య అహం దెబ్బతిన్నది. పట్టుదల పెరిగింది.

''ఒరేయ్ ఎంకన్నా. యీాళ్ళిద్దరూ నన్నొట్టి ఎద్ది పుల్లాయిని సేత్తున్నారు. యీాళ్ళతో వాదించి లాబం లేదు. మనిద్దరం కలిసి ఎల్దాం. ఆళ్ళ ఆసూకీ తీసి నీకు నీ కొడుకుని సూపిత్త. ఆడికీ ఆ పిల్లకీ ఏటి సంబంధముందో నువ్వు సాయంగా తెలుసుకొందువుగాని. పద''

ఎంకన్న అందుకు సంబరపడ్డాడు. చామంతి, వర్పమ్మలు కూడా అంగీకరించారు.

''వీరభద్రయ్య బాబో. నువ్వు అనుమంతుగాడు బతికున్నడన్న సల్లని వారతను తెచ్చారు. కానీ ఆ వారత ఎనుకనే అగ్గిలాంటి వోరతను కూడా తెచ్చారు. ఆడికీ ఆ పిల్లకూ సంబందమేమిటో రగస్పెంగా కూపీ తియ్యండి. ఆయన కొడుకుని సూసిన ఆనందం పట్టలేక ఆడెదటబడి మాట్లాడుతాడేమో! అట్టొద్దు. ఆదు అనుమంతేనని తేల్సుకొని, ఆడికి ఆ పిల్లకి మద్దెనున్న సంబందం కూపీ తీసుకొని రండి బాబూ. పోలీసుల కేసుందిగందా?

ఆడిసయం రగస్యెంగా వుండటమే మంచిది. యీడవొచ్చాక అప్పు డేంసెయ్యాలో ఆలోసిద్దాం. బాబ్బాబూ. సచ్చి నీ కడుపున బుడ్తాను. యీ సగాయం సెయ్యండి. యీదంతా రగస్యెంగా వుంచండి. ఆ బాగోతులక్కూడా ఆడి కూపీ సెప్పకండి బాబో'' అంటూ నర్సమ్మ వీరభద్రయ్య కాళ్ళు పట్టుకొంది.

''ఆ మాత్రం నాకు తెల్సునేవే నర్సమ్మా. మరొడైతే యీపాటికి నీ కొడుకు యిసయం బత్తీ సెంటర్లో నిలబడి 'టముకు' ఏసుండేవోడు. నేను పెద్దమడిసినే. నీ మేలుకోరేవోడిని. అంతా రగస్యెంగా నే సేసుకొత్తంగా. సూత్తా వుండు'' వీరభద్రయ్య అభయమిచ్చాడు.

వాళ్ళిద్దరూ బస్సెక్కాక నర్సమ్మ చామంతి ఇంటికొచ్చారు.

''అత్తయ్యా. బగమంతుడు వొకపాలి నాకు నా బిడ్డను ఆ యిదంగా అన్నేయం సేసేడు. యీపాలి యిట్టా అన్నేయం సేయదుగందా?'' అని నర్సమ్మను కౌగిలించుకొని బావురుమంది చామంతి.

''ఊరుకోవే పిచ్చిపిల్లా. బగమంతుడెప్పుడూ మనుసులకు అన్నేయం సేయడే. మనుసులే మనుసులికి అన్నేయం సేసుకొంటారు. నీకే అన్నేయం జరగకుండా నేను సూత్తాగా?''

నర్సమ్మ కోడలిని ఆప్యాయంగా గుండెలకు హత్తుకొంది?

* * *

సాగర సంగమం వద్ద అలల మధ్య యిరుక్కున్న చిన్న తెప్పలా వుంది — హనుమంతు మనసు.

రుక్మిణీదేవి శ్రీకృష్ణుడిని ఆరాధించినట్లుగా తనని అంజలి ఆరాధిస్తోంది. సత్యభామలా ప్రేమిస్తోంది.

కానీ తానామె ప్రేమకు అనర్హుడు. ఆరాధనకు అసలే అనర్హుడు. ఎందుకంటే తాను వివాహితుడు. తనని అలా ఆరాధించే వ్యక్తి ప్రేమించే వ్యక్తి యీవరకే వుంది.

కన్నయ్యదాసు తనని అప్పుడే అల్లుడిలా గౌరవిస్తున్నాడు. మిగతావారు తను ఆ భాగవత కుటుంబానికి నాయకుడయినట్లుగానే గౌరవిస్తున్నారు. తనువారి గౌరవానికి అర్హుడా?


ఊరు



ఓట్లు వెయ్యమని అడగడానికి తన నియోజక వర్గానికొచ్చాడు మంత్రి.

''ఏవోయ్ పి.ఎ. ఈ వూరు ఇదివరకెన్నడో చూసినట్టనిపిస్తోందేవిటి?'' అన్నాడు మంత్రి పి.ఎతో.

''అయ్యా చిత్తం! తమరు పోయిన సారికూడా ఇదే నియోజకవర్గం నుండి గెలిచారు'' చెప్పాడు పి.ఎ.

—అల్లిక తాతారావు (మంగళగిరి)

కాదు. కాదు కానే కాదు. తానో హంతకుడు. పరారీలో వున్న వ్యక్తి!

"ఏంటీ? మువ్వీ మద్దె అదోయిదంగా వున్నావ్? నీ మనసులో ఏదో వుంది. నాక్కాకపోతే మరెవరితో చెప్తావ్? నేమ ఎవరినో తెల్సుగా? యీాకిట్ట పరమాత్మకు కాబోయ్యే సత్యభామను. ఆ—" అంజలి అతడికి హుషారివ్వటానికి ప్రయత్నిస్తోంది.

అతనికి, వాళ్ళతో, తనకు పెళ్ళయిందని చెప్పాలని వుంది. కానీ తీగలాగితే డొంకంతా కదలదూ?

తను హంతకుడన్న భావననే తాను భరించలేడే. ఇకవాళ్ళు దాన్ని తెల్సుకోటం భరించగలడా? ఆ రహస్యం తెలిస్తే అందరికీ శిక్ష!

'నాకు పెళ్ళి చేసుకోటం ఇష్టంలేదు అంజలీ!' అన్నప్పటికీ, మొన్న ఒకరోజు

అంజలి నవ్వింది మొదట్లో

"నా మీద అనవసరంగా ఆశలు పెంచుకొంటున్నావేమో!"

"ఆడదాన్ని వేవనాల్సిన మాటలు నువ్వంటున్నావ్ హనుమంతూ. నువ్వు నన్ను కాదంటే బామాకలాపాన్ని ప్రతి నిముషం నీ దగ్గర ప్రదర్శిస్తా. ఏమనుకొన్నావో?"

ఏమనగలడు? కానీ ఏదో అనక తప్పదే? ఎప్పటికైనా తప్పునా?

నిజం చెప్తే వో బాధ—

చెప్పకపోతే వో బాధ—

అతనికి ఏం చేయటానికీ తోచలేదు. కానీ ఏదో వొకటి చేయాలి

ఏమిటి? ఏమిటి?

ఆలోచిస్తూ ఎటెటో తిరుగుతున్నాడు హనుమంతు ఆరోజు. తాను ఎక్కడికి వెళ్తున్నదీ ఎవరికీ చెప్పలేదు. తన కోసం అంజలి ఆరాటపడ్తుంటుంది. కన్నయ్యదాసు ఆందోళన చెందుతుంటాడు.

ఆ! అతనికి తనేం చెయ్యాలో ఆలోచన వచ్చింది.

పారిపోవటం — వొకసారి పోలీసుల భయంతో తల్లిదండ్రిని భార్యాబిడ్డల్నీ వదిలి పారిపోయాడు. అప్పుడు తను దోషి!

కానీ ఇప్పుడు? తాను దోషి కాదు. ప్రేమించే వారి నుంచి పారిపోయి దోషి కావాలి.

అయినా అంతకన్నా గత్యంతరం లేదు.

అతనా నిర్ణయానికొస్తున్న సమయంలోనే—

వీరభద్రయ్య, ఎంకన్న, కన్నయ్యదాసును కలిసేరు.

"మొన్న ఆ మద్దె మా వూరి దగ్గర మీ బాగోతం సూసేమండీ. బలే బాగుంది. మీరు జోడు మద్దెల్ని బలే వాయించారు. అబ్బో... అవేం దరువులు... అదేం వాద్యం..." అంటూ

వీరభద్రయ్య కన్నయ్యదాసును తాటిచెట్టెక్కించాడు ముందు. పొగడ్తలకి లొంగని కళాకారుడుంటాడా?

కన్నయ్యదాసు వాళ్ళకు మర్యాదలు చేసేడు.

"సత్యబామ ఏసం ఏసినమ్మాయి మీ కూతురంటగా? బలే సేసిందండి. క్రిష్ణపరమాత్మ ఏసం కట్టినబ్బాయిగూడా బలేగున్నాడు. మీ యల్లుడా?" అంటూ అసలు విషయంలోకి వచ్చాడు భద్రయ్య.

"ఇంకా కాదనుకోండి. కాబోయే అల్లుడు" అంటూ గర్వంగా చెప్పుకొని, తమ కుటుంబం వారంతా కల్సి ఎలా భాగవతం ఆడేది, తనతర్వాత ఆ భాగవత కుటుంబానికి హనుమంతుని ఎలా నాయకుడిని చేయబోయేదీ, హనుమంతుకు వేషాలు వెయ్యటానికి తనుపడ్డ కృషిని చెప్పుకొచ్చాడు.


"అయ్యో. అనుమంతు ఎక్కడికెళ్ళాడు? చాలాసేపయింది ఎటో ఎల్లిపోయి. నాకు చెప్పకుండా ఎల్లేడు చూడు! నాకేం తోచటం లేదు" అంది అంజలి వచ్చి—

"ఈ అమ్మాయే కదండీ సత్యబామ వేషం కట్టింది? చూడనయ్యా. బాగవతం సూసే అదురుట్టం నీకెట్టాగూ లేకపోయింది. సెత్తబామ ఏసం కట్టినమ్మాయినైనా చూడు" అన్నాడు వీరభద్రయ్య ఎంకన్నతో

ఎంకన్న అంజలిని పరిశీలనగా చూచాడు.

యీ పిల్ల కాస్త ఎర్రగా బుర్రగా వున్న మాట నిజమే. కానీ చామంతికన్నా అందగత్తే? యీ పిల్ల వేషాలు కట్టగల్దేమోకానీ చామంతిలా కాయకష్టం చేయగలదా?

బంగారంలాంటి భార్యను కాదనుకొని తన కొడుకు యీ పిల్ల వెంట ఎందుకు పడ్డాడు?



## దుమ్ము యంత్రం

బయట దుమ్మంతా ఇంట్లోకి రాకుండా చూడడం కష్టమైన పనే! ఎందుకంటే చాలా సందర్భాల్లో మన ఇంటికి వచ్చే అతిథుల బూట్లకు అంటి ఉండే దుమ్మంతాఇంట్లోకి రావచ్చు. దుమ్ము బయట దులిపిరమ్మని వారితో చెప్పలేం కదా!

అలాటి ఇబ్బంది ఇకముందు ఉండకుండా నేలమీద కాళ్ళ తుడుచుకునే పట్టాలాటి "ఆటోమేటిక్ షూ క్లీనర్"ను ఓ అమెరికన్ కంపెనీ రూపొందించింది. మన ఇంటికి వచ్చేవారంతా దీనిమీద నుంచి నడిచి వచ్చేటట్లు దీనిని గుమ్మం ముందు అమరిస్తే ఆటోమేటిక్‌గా వారి బూట్లు, చెప్పులకు అంటివున్న దుమ్మును రెండు శక్తివంతమైన ఎలక్ట్రిక్ మోటార్లు మిలియన్ సంఖ్యలో ఉన్నసన్నటి సున్నితమైన వెంట్రుకల లాటి బ్రష్‌లు శుభ్రపరుస్తాయి. ఇలాటి పరికరం గుమ్మంలో ఉన్నట్లు కూడా ఎవరికీ తెలియదు కూడా!

—జూపిటర్

యీూ పిల్ల తళుకు బెళుకులకు ఆకర్షింపబడ్డాడా?

''సత్తెభామను వొంటరిగా సూత్తే ఏం లాబం? శ్రీకిష్టపరమాత్మ కూడా వస్తాడు. యిద్దర్నీ చూస్తే పు ణ్యం పురుషార్థం, హనుమంతు ఎంత బాగుంటాడనుకొంటున్నారు? వేషం కట్టే అచ్చం శ్రీకిష్టుడు లాగే వుంటాడు. తెల్సా?'' అంజలి అంది గొప్పగా.

''అవునయ్యా. వాళ్లిద్దరిదీ సరైన జోడీ. మా భాగోతం రక్తి కట్టడానికి వాళ్లిద్దరు జంటగా నప్పించటం వో కారణం. కృష్ణుడు వేషాన్ని ముసలోడిని నేనేస్తే ఏం స్వాదస్యం వుంటుంది చెప్పండి. అటు వేషాల్లో చూచినా, యిటు విడిగా భార్యాభర్తలుగా చూచినా అటువంటి జంటను చూస్తుంటే అచ్చటా ముచ్చట... ఏమంటారు?''

ఎంకన్న వస్తున్న కోపాన్ని బలవంతంగా ఆపుకొంటున్నాడు. అది గ్రహించాడు వీరభద్రయ్య.

''కానీ ఆ అబ్బాయి సమయానికి లేదు కదండీ? మాకు మళ్ళీ వేరే పనుంది. దోవలో ఎక్కడైనా కన్పిస్తే మా ముసలాడికి చూపిస్తా లెండి'' అంటూ ఎంకన్నను తీసుకొని వచ్చేడు వీరభద్రం.

''చూచావా ఎంకన్నా. నా కళ్ళతో చూచానయ్యా అంటే నీ పెళ్ళాం, కోడలు నా మాటల్ని నమ్మలేదు. ఇప్పుడేమంటావ్?'' అన్నాడు వీరభద్రయ్య యివతలికి వచ్చాక.

''కానీ యీూళ్ళు సెప్పే అనుమంతూ మా అనుమంతూ వొక్కడేనంటావా? మా అనుమంతు గోడు అట్టాంటోడు కాదయ్యా. వాడికి సేమంతంటే పంచెప్రాణాలు గందా?''

''నువ్వూ అదే మాటన్నావూ? అయితే యిక్కడే చాటుగా నిలబడ్దాం. అనుమంతుగోడు ఎప్పుడోఅప్పు డు రాకపోతాడా? ఆడు నీ అనుమంతుగాడో కాదో నీ కళ్లతో నువ్వే సూద్దువుగాని. సరేనా?''

కాస్సేపయ్యాక హనుమంతు అటే వచ్చాడు.

''అవునయ్యా. ఆడు మా అనుమంతుగాడే. నా కొడుకే. బతికున్నాడయ్యా. నా కొడుకు బతికే వున్నాడయ్యా...''

హనుమంతు కోసం ఎదురుచూస్తున్న అంజలి అతడి రాకను గమనించి గడప బయట వుండగానే పరుగెత్తుకొచ్చింది. దాదాపు అతడిని కావలించుకొని అంది.

''ఎక్కడికి పొయ్యావు శ్రీకృష్ణా! నన్ను వదిలి నువ్వు వొంటరిగా అటులచనుట ధర్మమా? యీూ సత్య నీ కోసం పరితపించుచుండునని తెలియదా నీకు?''

ఆ మాటల్ని, ఆమె చాతల్ని చూచిన ఎంకన్న గుండె మండింది.

''యీూడు మా అనుమంతు కాదు యీూరబద్రయ్య బాబూ. నా కొడుకు కోనేట్లో పడి

ఎన్నడో సచ్చిపోయాడు'' అన్నాడు ఎంకన్న — తలదిప్పుకొని వెనక్కి వెళ్ళిపోతూ

* * *

పెండింగ్ కేసుల రిజిస్టర్ చూస్తూ వులిక్కిపడ్డాడు గోవర్ధనరావు. రత్తయ్య హత్యకేస యింకా క్లోజ్ కాలేదు. పెండింగ్‌గానే వుంది. అతనికి ఆ కథంతా గుర్తుకొచ్చింది హనుమంతు అమ్మ భార్యల దగ్గర తను అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

''పాతాళలోకానికి పోయినా హంతకుడిని నేను వెతికిపట్టుకొంటాను. అందాకా యీ కేసు క్లోజ్ చేయను''

అది దాదాపు శపథం. ప్రతిజ్ఞ!


కానీ ప్రతిజ్ఞ నెరవేర్చుకొనే అవకాశం తనకు గవర్నమెంటు యిస్తేనా? తన ఎఫిషియెన్సీని, సిన్సియారిటీని గుర్తించని గవర్నమెంటు ఎవరో చెప్పిన మాటల్ని విని తనను బదిలీ చేసింది.

తను వెళ్ళగానే కేసు సంగతి మర్చిపోయినట్టున్నారు — ఇక్కడి ఇన్ఎఫిషియంట్ ఫెలోస్! యింకా నయం! కేసు క్లోజ్ చేసేరు కారు! యిన్నాళ్ళకి మళ్ళీ తను యిక్కడికొచ్చాడు. ఎలాగైనా శపథం నెరవేర్చాలి.

హెడ్డును కేకేసి పిల్చేడు. కేసును గురించి వాకబు చేశాడు.

''ఇంకా ఇన్వెస్టిగేషన్‌లో వుంది సార్. హంతకుడు దొరకలేదు''

''దొరకలేదూ? ఎట్టా దొరుకుతాడు. మనం పట్టుకుంటే దొరుకుతాడా లేక నేను హత్య



చేశానని వాడంత వాడొచ్చి దొరుకుతాడా? నా 'ప్రిడిపిజన్' పెద్ద సీనియర్ మోష్టని ప్రగల్భాలు చెప్తాడుగా? ఏం చేసేదయ్యా? వొట్టి యిన్ఎఫిషియంట్ ఫెలో. నాకు తెలీదూ? అలాంటి వాళ్లకే కాలం ఇది. ప్రమోషన్లూ వాళ్లకే బంగారు పతకాలూ వాళ్లకే''

''యస్సార్!''

''మీరైనా ఏమన్నా విచారించారా? ఆ హనుమంతుడుగాడు ఇంకా పరారీలోనే వున్నాడా? పోలీసుల మెతకతనం కనిపెట్టి వూళ్లోకొచ్చి పెళ్లాం పిల్లల్తో రాజాలా తిరుగుతున్నాడా?''

''లేదుసార్... వాడింకా పరారీలోనే వున్నాడు.''

''నేను పట్నాను చూడవయ్యా... ఇన్నాళ్లబట్టి నేను లేక కానీ... లేకపోతే ఇది ఎప్పటి కేసు... చూస్తుండు... నిమిషంలో పట్టేస్తాను వాడిని.''

''యస్సార్''

''సాయంకాలం మనం ఒకసారి ఆ హనుమంతుగాడి వూరువెళ్లి వాడి అమ్మతో, పెళ్లాంతో మాట్లాడి వద్దాం. ఈలోగా నేను కేసును గురించి కాస్త స్టడీచేసి ప్లాన్స్ వేస్తాను. రెడీగా వుండు.''

''యస్సార్!''

కానీ ఆ అవసరం వాళ్లకి లేకుండా కాస్సేపటికి నర్సమ్మ, చామంతి పోలీసుస్టేషన్ కొచ్చారు.

వెతకబోయిన తీగె కాళ్లకు చుట్టుకున్న ఆనందం కలిగినా అంతలోనే కన్ఫ్యూజన్ వచ్చింది ఆ యస్సయికి. కొంపతీసి ఈ ముండలు తన కొడుకును వెతికి అప్పజెప్పలేదని పోట్లాడడానికి రాలేదు కదా?

''ఏంటే! అత్తాకోడళ్లు ఇట్టా వచ్చారు? నేను కేసు క్లోజ్ చేసేసేననుకుంటున్నారేమో! ఉహూ... హనుమంతుగాడిని పట్నానన్నాను. పట్నాను. అసలందుకే మళ్లీ ఈ స్టేషనుకొచ్చాను. తెల్సా? మర్యాదగా ఇప్పటికైనా వాడి ఆచూకీ తెలపండి. వాడు రహస్యంగా మీ దగ్గరకి వచ్చి వెళ్తున్నాడటగా? నాకంతా తెల్సిందిలే''

''లేదయ్యా ఆడిని మేము సూడనేలే'' నర్సమ్మ అంది.

''అబద్ధాలాడకే ఫుండాకోర్ రాస్కెల్... నాకంతా తెలుసు. నేను ఎఫిషియంట్ ఇన్‌స్పెక్టర్‌ని... పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ని తెల్సా?''

''అయ్యా. నిజం సెప్పటానికే వచ్చామండీ. అప్పుడు కొట్టినా, సంపుతామని బెదిరించినా నిజం చెప్పలేదు. ఇప్పుడు నిజం సెప్పటానికొచ్చామండి'' చామంతి అంది.

''అప్పుడు కొట్టినా అబద్ధాలు చెప్పేరు. ఇప్పుడు అడక్కుండానే చెప్తారూ? ఏంటే మీరు చెప్పబోయే నిజం?''

''నా మొగుడు అనుమంతు రత్తయ్యను అత్తె సేసేదయ్యా...''



"అవును... నా కొడుకు అనుమంతు రత్తయ్యను అత్తె చేశాడయ్యా"

అత్తాకోడళ్ళు ఇద్దరూ చెప్పింది వినేసరికి మతిపోయింది యస్ఐకి. తను కన్ఫ్యూజ్ అవుతున్నానేమో నని అనుమానం వచ్చింది.

"ఏంటి... ఏంటే... మీరంటున్నది?" అన్నాడు కన్ఫ్యూజన్‌గా.

''అవునయ్యా. అనుమంతు రత్తయ్యను అత్తె సేసేదు'' అత్త కోడళ్లిద్దరూ జాయింట్‌గా అన్నారు మళ్లీ.

ఇదేంటి ఈళ్లేం ఆడాళ్లు?

ఆరోజు అంత కొడ్తే నిజం చెప్పలేదు. ఈవేళ వచ్చి హనుమంతు హంతకుడని జాయింట్‌గా చెప్తున్నారు. ఇందులో ఏమన్నా మెలికల్లేవు గదా? అమ్మో? వీళ్ళు అసాధ్యులు. ఇందులో ఏదో వుండే వుంటుంది. తను తొందరపడకూడదు. అవును. తాను ఎఫిషియంట్ పోలీస్ ఆఫీసర్! మెల్లగా అసలు విషయం రాబట్టాలి.

''బాగుందే మీరే హనుమంతు హంతకుడు అని అన్నారంటే... వాడు పాపం నిజంగా అమాయకుడన్న మాట. హత్య చేయలేదన్న మాట. మీ మాట నేను నమ్మనే. హనుమంతు హంతకుడు కాదు. మా ఇన్వెస్టిగేషన్ అంటే పరిశోధనలో అది ప్రూవ్ అయింది. లేకపోతే ఇన్నాళ్లూ వూరుకునే వాళ్లమా? ఏనాడో పట్టేసేవాళ్లం కాదూ?''

''కాదయ్యా అనుమంతే రత్తయ్యను అత్తె సేసేదు''

''ఏంటే? అన్నిసార్లు అంత గట్టిగా చెప్తున్నారు? మీరు చూశారా వాడు హత్య చేస్తుండగా?''

''నేదయ్యా. కానీ వాడే వచ్చి సాయంగా నేను రత్తయ్యను అత్తె చేసేను' అని అంతా సెప్పేడయ్యా. మేమే ఆడికి డబ్బిచ్చి పరారీకమ్మని పంపించేసినాం'' అంటూ చామంతి జరిగిందంతా పూస గుచ్చినట్టు చెప్పింది.

''ఆడిప్పుడు ఎక్కడుందికూడా మాకు తెలుసునయ్యా. కావాలంటే ఇవరాలన్నీ సెప్తాము. ఎల్లి ఆడికి బేడీలేసి పట్టుకొచ్చి కైదులో పెట్టించండయ్యా. ఎంటనే ఆలీసెం సేయకుండా ఎల్లండి. కాల్లు పట్టుకుని పేద్దిత్తున్నాను. నా కొడుకును వెంటనే కైదీలో పెట్టించండయ్యా'' అంటూ నర్సమ్మ ఏడుస్తూ అతని కాళ్ల పట్టుకుంది.

''అవునయ్యా నా మొగుడిని ఎంటనే పట్టుకొని కైదీలో పెట్టండి. కానీ అయ్యా... ఈ బోగట్టా అంతా మేం చెప్పేమని మాత్తరం ఆడికి చెప్పకండి. తొరగా ఎల్లండయ్యా'' అంటూ చామంతి కూడా ఏడుస్తూ అతని కాళ్లమీద పడింది.

కన్‌ఫ్యూజన్... కన్‌ఫ్యూజన్... కన్‌ఫ్యూజన్...!

అంత కన్‌ఫ్యూజన్ యిప్పయి గోవర్ధనరావుకు జీవితంలో రాలేదు. కానీ ఎప్పుడూ కన్‌ఫ్యూజన్ వస్తే కోపం వచ్చేది. కానీ ఈసారి ఈ కన్‌ఫ్యూజన్ ఆశ్చర్యంగానూ వుంది. ఆనందంగానూ ఉంది. మరోవైపు ఏదో దిగులుగానూ ఉంది.

''అలాగే పట్టుకొంటాను కానీ నాకు ముందీ విషయం చెప్పండి. ఇన్ని విషయాలు తెలిసీ ఆనాడే ఎందుకు నిజం చెప్పలేదు? మీకు అన్ని బాధలు తప్పేవి కదా?''

''ఎలా సెప్తామయ్యా? ఆడు నా కొడుకు. దానికి మొగుడు కందా? కడుపున పుట్టినోడి కోసం కట్టుకొన్నవాడికోసం బాధలు పడ్తే మాత్తరం ఏమిటయ్యా? సంతోసమేగా?''

''అట్లాగనుకొన్నవాళ్ళ మరి ఇప్పుడు ఎందుకు రహస్యాలన్నీ చెప్పేరు? హంతకుడికి శిక్ష ఏమిటో తెల్సా? ఉరి. లేకపోతే ఆజన్మాంతర ఖైదు.''

''తెలుసునయ్యా. అన్ని బోగట్టాలు తెలుసుకునే వచ్చాము. ఆడికి వురిసిచ్చ పడకుండా మీరు సూడాలయ్యా. జడిజి బాబుకి మేంకూడా మొరపెట్టుకుంటాం. ఆదు సేసిన తప్పును ఆడూ వప్పుకుంటాడయ్యా. ఆడోవేళ వొప్పుకోకపోయినా కన్నతల్లిన్నేను, కటు కూట్టుకొన్న పెళ్లాము నిజాలు చెప్తాం కదయ్యా? అందుకే ఆ జడిజీ బాబు ఆడికి వురిసిచ్చ యెయ్యరు. జైల్లో ఏత్తారు. ఆదు కొన్నాళ్ల జైల్లో వుంటాడయ్యా'

''అవునా? జైల్లో వుండటం మాత్రం శిక్ష కాదేంది? శిక్ష పద్తుందని తెలిసి కూడా ఇప్పుడు రహస్యాలన్నీ ఎందుకు చెప్తున్నారు? మీ అంతట మీరు వాడిని ఎందుకు పోలీసులకి పట్టిస్తున్నారు?''

''ఏం సెప్పమయ్యా. అది మా కర్మ'' అంటూ వాళ్లిద్దరూ కాస్సేపు మౌనంగా వుండిపోయారు:

''ఆడిప్పుదు నా కొదుక్కాదయ్యా!'' అంది వర్పమ్మ కాస్సేపయ్యాక ఏడుస్తూ.

''అవునయ్యా ఆడిప్పుదు నా మొగుడయినా కానట్లే. అంతకన్నా మమ్మల్నేం అడగబోమాకండి. మేం సెప్పలేం. కానీ ఈ యిసయాలన్నీ రగస్యంగా వుంచండి. !! ఎక్కడా సెప్పమాకండి. కోట్టులో కేసు పెడ్తారుకదా? అంతా మేం సెప్తాం అక్కడ''

కన్‌ఫ్యూజన్ పెరుగుతునేవున్నా తట్టుకు నిలబడి 'ఆల్‌రైట్' అన్నాదు, పోలీసు ఇనస్పెక్టర్ దర్పాన్ని ప్రదర్శిస్తూ యస్సయి గోవర్ధనరావు.

* * *

గుమ్మానికి జారబడి అంజలి దిగాలుగా కూర్చుని వుంది.

''లేమ్మా. లేచి ఇంత ఏదన్నా తిను'' పలువురు పలురకాలుగా చెప్తున్నారు. కానీ ఆమె సర్వం కోల్పోయిన దానిలా నిరామయంగా అలాగే రోడ్డువైపుకు చూస్తోంది. మాటలేదు. పలుకులేదు.



గురి

ఒంటరిగా వస్తున్న సుబ్బారావు కణతకు పిస్తోల్ గురిపెట్టి— ''నీదగ్గరున్న డబ్బంతా ఇచ్చేస్తావా? బుర్రపేల్చెయ్యమంటావా!'' అంటూ బెదిరించాడో దొంగ.

''బుర్రలేకుండా బతకొచ్చుగానీ... డబ్బులేకుండా బతకలేం? బుర్రే పేల్చేయ్'' అన్నాడా అమాయక సుబ్బారావు.

—జోకర్ (హైదరాబాద్)

మూడు రోజులుగా ఆమె అన్నోదకాలు మాని అలాగే గుమ్మంలో ఎదురుచూస్తూ కూర్చున్నది.

''ఎలా వచ్చాడో అలాగే పోయాడు. దిగులుపడి చేసేదేముంది. మళ్లీ రాకపోదులే''

''అదేదో వూళ్లో ప్రదర్శన దగ్గర మంచి అతను ఆదోవిధంగా ఉన్నాడు. ఏంటోలే అనుకున్నాం కానీ ఇలా చేస్తాడమకోలేదు''

అంజలి వులకలేదు. పలకలేదు. అలాగే రోడ్డుమీదికి చూస్తున్న ఆమె దృష్టిలో పోలీసులు పడ్డారు.

''అయ్యా. పోలీసులకి రిపోర్టన్నా ఇచ్చారా — ఆయన కన్పించడంలేదని —''

''లేదమ్మా. అతడిని గురించి ఏం తెల్సని రిపోర్టిస్తాం? మనం అతనికి ఏమవుతామని రిపోర్టివ్వగలం? అతని పేరు తప్ప అతని వూరేమిటో, తల్లెవరో, తండ్రెవరో ఏమీ తెలియలే? అయినా అతను తిరిగి వస్తాడన్న నమ్మకం నాకుందమ్మా. నువ్వేం దిగులుపడకు. లోపలికి వెళ్దాం రా. కాస్త అన్నం తిను.''

''శ్రీకృష్ణుడు నవ్వించకపోతే సత్తెభామ అంత బాగా నాట్టెం ఎట్టా చెయ్యగలదయ్యా? హనుమంతు నవ్వించకపోతే నాకు మంచినీళ్లు కూడా తాగాలనిపించడం లేదే?'' ఆమె ఏడ్చింది.

''వాళ్లు దేముళ్లమ్మా. మనం మనుషులం''

''అంతే కాదయ్యా. అది బాగోతం... యేసం... ఇది జీయితం సత్తెం కదా?''

''అవునమ్మా. నేను అతడిని పట్టుకొస్తాగా? నువ్వు లే?''

ఆమెను లోపలికి తీసుకెళ్లగలిగారు ఎలాగో. కానీ అన్నం తినిపించ లేకపోయారు. లోపల మంచంమీద పడుకొంది అంజలి.

ఒక గండం గట్టెక్కిందనుకుని బయటికెళ్లిన కన్నయ్యదాసుకు పోలీసు పటాలం తన ఇంట్లోకి రావడం కనిపించింది.

''కన్నయదాసు అంటే నువ్వేనా?'' గోవర్ధనరావు దర్పంగా అడిగాడు.

''అయ్యా నేనే బాబూ. తూర్పు భాగవత కళాకారుడిని''

''కళాకారుడివో కాకరకాయవో నాకెందుకు గానీ హనుమంతును పిలువు ముందు''

''హనుమంతా? ఎందుకు బాబూ? పనేంటి?''

''షటప్. ప్రశ్నలు వేయాల్సింది పోలీసులు, లాయర్లు. నువ్వు కాదు. చెప్పిన పని చెయ్యి బుకాయించకు''

''హనుమంతు మూడు రోజుల్నుంచి కన్పించడంలేదు బాబూ. నేనే పోలీసులకి రిపోర్టివ్వాలను కొంటున్నాను. ఇంతలో దేముడిలా మీరే వచ్చారు''

గోవర్ధనం ఒక్కసారిగా బిర్ర బిగుసుకు పోయినట్లయ్యాడు. మనసులో కన్‌ఫ్యూజన్.

''ఓయ్. వేషాలు వేస్తున్నావా నా దగ్గర? నేనెవరి నమకున్నావు. ఎఫిషియంట్ పోలీసు

ఆఫీసర్‌ని. పోలీసులుతో పరాచికాలాడకు. యమధర్మరాజు నుంచి ఫోనుకాల్ వస్తుంది. అందులో మనం ఇప్పుడు డీల్ చేస్తున్నది మర్డర్ కేస్."

"మర్డర్! హత్య కేసుతో హనుమంతుకేం సంబంధం సార్?"

"గాడిద గుడ్డు సంబంధం! ప్రశ్నలడగ వద్దన్నానా? మర్యాదగా పిలువ్ వాడిని."

"నిజంబాబూ. మూడు రోజులుగా అతను కన్పించడంలేదు. కృష్ణుడు వేషం వేస్తాడతను. అతను లేక ప్రదర్శన లాగిపోయాయి. మా అమ్మాయి మంచం ఎక్కింది. అతను కన్పిస్తే నాకు కబురు చెయ్యండి సార్"

"షటప్..." అంటూ యస్సయి వాళ్ల నివాసమంతా గాలించాడు.

"వున్నట్టుండి అతనెందుకు పారిపోయాడు"

"ఏమో బాబూ చెప్పాలేదు పెట్టాలేదు. కానీ కొద్దిరోజులుగా అతను అదోవిధంగా ఉంటున్నాడు. మాకేం అర్థం కాలేదు." అంటే అతను తమకు ఎలా తటస్థపడిందీ చెప్పుకొచ్చాడు కన్నయ్యదాసు.

"అతని ఫోటో ఉందా మీ దగ్గర?"

"ఉంది బాబూ. ఇదిగో..."

దాన్ని పరీక్షగా చూశాడు యస్సయి.

"ఇంతకీ అతనెవరు బాబూ? మేం ఎన్నిసార్లు అడిగినా చెప్పలేదు.

"చెప్పడు. తను హంతకుడినని చెప్తాడా ఎవడైనా? ఇంకేం ప్రశ్నలు అడగకు. నేను వాడిని పట్టుకొంటాను. నాలుగు రోజులు చూస్తుండు'

యస్సయి గోవర్ధనరావు ఫోటో తీసుకుని వెళ్లిపోయాడు.

అన్నట్లుగానే ఓ చిన్న రైలుస్టేషన్‌లో హనుమంతుని గుర్తించి పట్టుకొన్నాడు యస్సయి. అది కేవలం యాదృచ్ఛికం. అయినా అదంతా తన ప్రజ్ఞే అయినట్లు దాని చుట్టూ ఓ కథనల్లి పేపర్‌లో ప్రకటింపజేసుకున్నాడు.



## కెమెరా ముచ్చట్లు

ఫోటోగ్రఫీ ఈనాడు చాలా ఖర్చుతోకూడుకున్న హాబీ! అయినా మనదేశంలో ప్రస్తుతం 70 లక్షల మందికి ఫోటోగ్రఫీ హాబీ కావడం విశేషమే!

ఇక ఫోటోగ్రఫీను వృత్తిగా చేసుకున్న వారి విషయానికి వస్తే మనదేశంలో కనీసం లక్షమందికి 'కెమెరా'నే అన్నదానం చేస్తోందట.

సినిమా రంగంలోనూ, వ్యాపార ప్రకటనల విషయంలోనూ 'కెమెరా'కు ఉన్న ప్రత్యేకత అంతా ఇంతా కాదు. కలం పట్టిన ప్రతి వాడు, కవి కాలేడన్నట్లుగానే కెమెరాపట్టిన ప్రతివారూ ఫోటోగ్రాఫర్ కాలేరు. సరైన విధంగా ఫోటో తియ్యడం ఒక గొప్ప కళ. ఏది ఏమైతేనేం ఈనాడు మనదేశంలో ఫోటోగ్రఫీ వ్యాపారం 1100 కోట్ల రూపాయల టర్నోవర్‌ను కలిగివుండడం... గొప్ప విషయమే!

—జూపిటర్

పేపర్లో ఆ వార్తను కన్నయ్యదాసు చూశాడు.

పోలీసులకి తాను పట్టుబడి పోయినందుకు విచారించలేదు. హనుమంతు కన్నయ్యదాసు వాళ్లతో చేరి వేషాలేస్తూ తిరగబట్టి కానీ లేకపోతే ఎప్పుడో దొరికిపోయేవాడేమో.

అయినా తను తప్పు చేసేడు. కారణం ఏదైతేనేం? తప్పు తప్పే కదా? తప్పించుకొని ఎన్నాళ్లు తిరగగలడు. అలా తల్లిని తండ్రిని పెళ్లాన్ని పిల్లాడిని వదిలేసి తిరిగి ఏం లాభం? దొంగ బతుకు ఎంత బాధాకరం? తనకి నష్టం — తనని నమ్ముకొన్న ఇతరులకి నష్టం. ఇంకా నయం. తాను కన్నయ్యదాసు వాళ్ల నుంచి బయటపడ్డాక పట్టుబడ్డాడు. వాళ్ల దగ్గర వుండగానే పట్టుబడినట్లయితే సిగ్గుతో తల భూమిలోకి కూరుకోకపోయిందా?

కనుక పోలీసులు పట్టుకోటం కూడా ఓ విధంగా మంచిదే. నిన్ననే జరగాల్సింది ఇవాళన్న జరిగింది.

అయితే అతను బాధ పడింది తన తల్లిదండ్రుల్ని గురించి, భార్యను గురించి.

అతను వున్న సెల్ తలుపులు తెరుచుకున్నాయి.

''రేయ్ హనుమంతూ. నిన్ను చూడడానికెవరో వచ్చారు''

అదే అతనికోరిక. తను పోలీసులచేత అరెస్టు కాబడితేనేం? చాలా రోజుల తర్వాత తన ప్రాంతానికి వచ్చాడు. బస్తీలో పోలీసుల బందీగా వున్నాడు.

తన తల్లిదండ్రులు, భార్య, బిడ్డ తనకు అతిదగ్గరలో వున్నారు. అయినా చూడడానికి ఒక్కరు రాలేదు. తనక్కడ వున్నట్లు తెల్సి రాలేదా? తెలియక రాలేదా? తను పోలీసులను ప్రార్థించడమే తనక్కడున్నట్లు వాళ్లకు చెప్పమని, చెప్పేమని కూడా అన్నారుగా? మరెందుకు రారు?

అతనికి తన బాబును చూడుకోవాలని వుంది.

వాడెంత పెద్దవాడయ్యాడో? ముద్దుముద్దుగా మాట్లాడుతుంటాడేమో? చిరుపాదాలతో నడస్తుంటాడేమో! అసలు వాడెలా వుంటాడో? ఎవరి పోలికో?

ఆ బాధ ఇప్పుడు తీరబోతున్నది.

తన బాబును చూస్తాడు. చామంతి వచ్చిందేమో? అమ్మా, నాన్న అంతా వచ్చేవుంటారు. ఒకరు వచ్చి, మరొకరు రాకుండా ఎందుకుంటారు?

''అదుగో వాళ్లే. పది నిమిషాలు మాట్లాడుకోడానికి పర్మిషన్ ఇచ్చారు.''

హనుమంతు అటు చూశాడు.

కొయ్యబారిపోయాడు.

అక్కడున్నది చామంతి కాదు. తన బాబు కాదు.

''కిట్టయ్యా జైల్లో పడ్డావా? నీ కోసం సత్యభామ ఎక్కడెక్కడో వెతుక్కొంటుందయ్యా? అవునూ నాకు చెప్పకుండా ఎందుకు పారిపోయావ్? నేనంటే ఇష్టంలేదా? ఆంజలి అతని దగ్గరికి పరిగెత్తుకొంటూ వచ్చి చేతులు పట్టుకొని అంది.

హనుమంతుకు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఏమిటీ అనుబంధం?

"అంజలీ! నన్ను మన్నించు" అన్నాడు ఏడుపును ఆపుకుంటూ.

"ఛీఛీ... ఏంటిది? కిట్టయ్య ఏడవటమా?"

"నీ ప్రేమను భరించలేక పారిపోయాను అంజలీ. మీ మంచితనం ముందు సిగ్గుపడి పారిపోయాను. దాసుగారూ మీరు నాకు గురువులు. నన్ను క్షమించరూ?" అతను కన్నయ్యదాసు కాళ్లు పట్టుకున్నాడు.

'అసలేం జరిగింది హనుమంతూ? ఈ హత్య కేసేమిటి? అసలు నువ్వెవరు? నీ కథేమిటి?"


"అవన్నీ చెప్పే కాలం లేదు గురువుగారు. కానీ ఒక్క విషయం అంజలికీ మీకు చెప్తామనుకుని చెప్పలేక పారిపోయాను. అది చెప్తాను. నాకు తల్లిదండ్రులున్నారు. భార్య వుంది. బిడ్డ వున్నాడు"

కన్నయ్యదాసు కానీ అంజలి కానీ మాట్లాడలేదు.

"నా చామంతికి నేనంటే ప్రేమ సార్. అంజలిని వేషంలో చూచినపుడు నాకు దూరమైన నా చామంతే గుర్తుకొస్తాది. నా చామంతి అలా నాకోసం కనిపిస్తుందనుకొనేవాడిని? అందుకే నా వేషం బాగుండేదేమో!నేను నా చామంతికి తప్ప మరెవరికీ మనసును ఇవ్వలేను అంజలీ. నా బిడ్డకు అన్యాయం చెయ్యలేను. పెళ్లి అనేది ఎంతో పవిత్రమైనది కదా అంజలీ? అందుకే నిన్ను... నిన్ను నేనెప్పుడూ..."

అంజలి నవ్వింది. కన్నయ్యదాసు భయంగా ఆమెవైపు చూశాడు.

"ఓయి పిచ్చి కిట్టయ్యా. ఇందుకా పారిపోయావ్? ఏం తప్పు చేశావని పారిపోయావ్?



పెళ్లి చేసుకొన్న భార్యకు అన్యాయం చేస్తే తప్పు, పాపంకానీ వాళ్లమీద ప్రేమగా ఉండడం తప్పెలా గవుతుందయ్యా కిట్టయ్యా? అమమంతూ మవ్వు నన్ను పెళ్లి చేసుకోకపోయినా పర్వాలేదయ్యా. వేనలాంటి కోరికను ఆపు కోగలను. కానీ మవ్వు నా కిట్టయ్యవేనయ్యా. ఎప్పటికీ... నిన్ను రైల్లో మొదటిసారి చూచినప్పుడే నాకు నీలో కిట్టయ్య కన్పించాడు''.

సెంట్రీ వచ్చి టైం అయిపోతున్నదని హెచ్చరించి వెళ్లిపోయాడు.

కన్నయ్యదాసు వ్యవహారంలోకి వచ్చాడు. కేసును గురించి అడిగేడు.

''నేను తప్పు చేశాను గురువుగారూ. కానీ ఎందుకు చేశాను. ఎలా చేశాను. ఎవరితో చెప్పుకోను. నామాట ఎవరు వింటారు? నా తల్లిదండ్రులు, భార్య కూడా నన్ను చూడడానికి రాలేదు. మీరొచ్చారు. అదే పదివేలు. నాకు ఏం జరుగుతుందో జరగనివ్వండి''

''అట్టాగంటే నేనూరుకోను కిట్టయ్యా. మువ్వు నన్ను పెళ్ళి చేసుకోవద్దు నాతో బయట మాట్లాడొద్దు. నన్ను సూడద్దు. కానీ నువ్వు కిట్టుడి వేషం వేయాలి. నేను సత్తెభామ వేషం వేయాలి. నాకు ఆ తృప్తి చాలు. జైల్లో వుంటే నువ్వు వేషం ఎలా వేస్తావ్?''

''నేను నీ తరపున కోర్టులో వాదించడానికి ప్లీడర్ని పెట్టాను హనుమంతూ. కాదనకు. అంజలి ఏమంటోందో విన్నావుగా? దాని కోసం నా కోసమన్నా నువ్వు అందుకు అంగీకరించాలి.''

వారి అభిమానానికి హనుమంతు వళ్లు జలపాతాలయ్యాయి. గొంతు ఆనందంతో పూడుకుపోయింది.

ఆ స్థితిలో వుండగానే వాళ్ళతో మాట్లాడే టైమ్ అయిపోయింది.

* * *

కోర్టు—

జడ్జిగారు వచ్చి ధర్మాసనం అలంకరించారు.

బోనులోకి ముద్దాయి హనుమంతు ప్రవేశపెట్టబడ్డాడు.

ప్రాసిక్యూషన్ లాయర్‌గారు కేసును వివరిస్తున్నారు..

రత్తయ్య అనే వ్యక్తి ఎలా హత్య చేయబడిందీ వివరిస్తున్నాడు.

హనుమంతు హాలంతా ఆశగా కలయజూసాడు. అంజలి కన్నయ్యదాసు వున్నారు.

కానీ తన తల్లిదండ్రి భార్య బిడ్డ ఏరీ?

నిరాశ... ఆ రాత్రి నిద్ర పట్టలేదు. అసంతృప్తి.

మర్నాడు ఉదయం కన్నయ్యదాసు ప్లీడర్ని తీసుకొని వచ్చాడు.

''నిన్న హత్య ఎలా జరిగిందో ప్రాసిక్యూటర్ చెప్పింది విన్నావుగా?! అదంతా నిజమేనా? అలాగే జరిగిందా?''

"ఆయనేం సెప్పేరో నేనినలేదండీ కానీ ఎలా జరిగిందో చెప్పమంటే చెప్తాను" అంటూ జరిగింది పూస గుచ్చినట్టు మళ్ళీ చెప్పాడు.

"అలాగవుతే హత్య ఇన్‌టెన్షనల్‌గా చెయ్యలేదు. ఏక్సిడెంటల్ అని ప్రూవ్ చెయ్యవచ్చు. అసలు హత్య చేయలేదని నిరూపించవచ్చు కూడా. అవునూ? అదంతా జరుగుతూండగా ధనుంజయ్‌రావు కొడుకు శ్యామ్‌సుందర్ అక్కడే వున్నాడంటున్నావ్ నువ్వు! కాని ప్రాసిక్యూషన్ వారు అతని పేరే చెప్పలేదే!"

"నేను చెప్పింది నిజం సార్. భగవంతుడిమీద ప్రమాణం చేసి చెప్తున్నాను."

డిఫెన్సు లాయర్ హనుమంతు చెప్పిన కథమీద ఆధారపడి తన కేసును నిర్మించుకుని వాదన సాగించాడు.

శ్యామ్‌సుందర్ పేరు బయటికి రాగానే ధనంజయరావు గుండెల్లో బాంబు పేలింది. తన కొడుకు సాక్షిగా బోనులో నిలబడితే ఏం చెప్పబోయి ఏం చెప్తాడో.

కేసును ప్రక్కదారులు పట్టించే ప్రయత్నాలు చేసాడు ఆయన.

సాక్ష్యాల విచారణ దగ్గరకొచ్చింది.

ముందు ప్రాసిక్యూషన్ సాక్షుల విచారణ.

"కోర్టు వారి ముందు ఇపుడు ఇద్దరు ముఖ్యసాక్షుల్ని ప్రవేశపెట్టబోతున్నారు" అన్నాడు ప్రాసిక్యూటర్.

శ్యామ్‌సుందర్ బోనులోకి వస్తాడనుకున్నాడు హనుమంతు.

"నరసమ్మా... నరసమ్మా..."

నరసమ్మ! తన తల్లి. పోలీసుల తరఫున సాక్ష్యం చెప్తుందా? ఏమని? తనకు వ్యతిరేకంగానా? ఆశ్చర్యపోతున్నాడు మనసులో హనుమంతు.

నరసమ్మ సాక్షి బోను ఎక్కింది.

ఆమె చెప్పింది విని హనుమంతే కాదు కోర్టులో చాలా మంది ఆశ్చర్యపోయారు.

"ఆ అత్తె చేసింది అనుమంతుగాడేనండీ అయ్యా. నా కొడుకు —అనుమంతుగోడే. ఆడే



### ప్రేమ

"తాజ్‌మహల్‌ను చూసిన తర్వాత నీకెలాటి అనుభూతి కల్గింది?" రేవంత్‌ను అడిగాడు మహంత్.

"తన భార్యను ప్రేమించినది ఎంత నిజమో తెలియదుగానీ షాజహాన్ ఖచ్చితంగా పాలరాళ్ళను ప్రేమించాడని నాకన్పించింది!" రేవంత్ బదులిచ్చాడు.

—జోకర్ (హైదరాబాద్)

సెప్పేదు ఆ మాట. ఆడివి సిచ్చించండి. జైల్లో ఏయండి. కానీ నా బిడ్డను పంపొద్దు ఏడుస్తూ" వర్సమ్మ బోను దిగిపోయింది.

"ముద్దాయి హనుమంతును కన్న తల్లి చెప్పిన సాక్ష్యం అది. ఇపుడు మరో ముఖ్యసాక్షిని ప్రవేశ పెట్టబోతున్నారు."

ఎవరు? ఎవరు తన తండ్రా?

కాదు. భగవంతుడా?

చామంతి... చామంతి... తన చామంతి!

హనుమంతు చామంతి కళ్ళల్లోకి చూసే ప్రయత్నం చేసాడు. "చామంతీ" అని అరిచాడు కూడా.

"నా మొగుదు అనుమంతుకి నేనంటే సచ్చేంత పేమ. ఆ రత్తయ్య నన్ను గురించి సెడ్డగా నా బరత ముందు మాట్టాడేడంట. అందుమీదట కోపం పట్టలేక రత్తయ్యను అత్తె సేసేనని నా బరత అనుమంతు వాతో సెప్పేదు. నేనా రోజు వాదు రాలేదని ... కోనేరు దగ్గరికి పోతే ఆడ కనిపించి సెప్పేదు. మా అత్తమ్మ నేను కల్సి ఆడివి వూరి నుంచి పంపేశాం. మాకు బయమేసింది.

అయ్యా జడిజీ బాబుగారూ... అనుమంతు మంచోడే. నా బరతకు వురిసిచ్చ ఎయ్యకండి. నన్ను నా బిడ్డనీ అనాదల్ని సేయకండి. ఆదు సేసిన తప్పుకు జైల్లో ఏయండి బాబూ." బోనులోనే వెక్కి వెక్కి ఏడుస్తూ కూలబడిపోయిన చామంతిని కోర్టువారు మెల్లగా బయటికి పంపించారు.

హనుమంతుడు శిలా ప్రతిమ అయ్యాడు. అతని మనసు కాస్సేపు మొద్దుబారింది. ఆ తర్వాత అతనికి దుఃఖం పొర్లుకొచ్చింది. కోర్టు ఆ రోజుకు వాయిదాపడింది.

ఆ రాత్రి హనుమంతుకు నిద్ర పట్టడం మాట దేముడెరుగు అసలు ఊపిర్లోలేకపోయాడు. నిల్చోలేకపోయాడు. పిచ్చెక్కినట్లు గదంతా తిరిగేదు. జుత్తు పీక్కొన్నాదు. ఏద్చేదు.


ఆనాడు తాను హత్య చేసేననగానే తనకన్నా ఎక్కువగా హడిలిపోయి ఆరాటపడిపోయి తనకి ధయిర్యం చెప్పి పారిపోయేలా చేసింది వాళ్ళిద్దరే. వాళ్ళ కోసం తనని బ్రతుకమని పంపేరు.

కానీ ఇవాళ?

తను ఆనాడు చెప్పింది చెప్పినట్లుగా కోర్టులో సాక్ష్యమిస్తున్నారు. తనని కలవలేదు. మాట్లాడలేదు. తన బిడ్డను చూపించలేదు. కోర్టులోనైనా కనీసం తన మొహంవైపు చూడలేదు.

తనంత నేరం ఏం చేసాడు?

తను హంతకుడనని చెప్తున్నా తనని రక్షించడానికి ఆరాటపడ్డ ఆ తల్లి, ఆ భార్య ఇవాళ



తనని శిక్షించమని ఎందుకు చెప్తున్నారు జడ్జీగారికి. అదీ తన ఎదుట?

ఆలోచిస్తుంటే అతనికింకో అనుమానం వచ్చింది.

తను తూర్పు భాగవతులతో వుండి వేషాలేస్తున్నట్లు తన తల్లికి, భార్యకి మాత్రమే తెల్సు. మరి పోలీసులు తన కోసం వెతుక్కొంటూ తూర్పు భాగవతుల దగ్గరికెళ్ళినట్లు

కన్నయ్యదాసు చెప్పేడు.

కొంపతీసి తన ఆచూకీ పోలీసులకి తెల్పింది తన తల్లి, తన భార్యకాదు కదా?

పొద్దున్నే గోవర్ధనరావు వచ్చాడు అతని దగ్గరికి

''ఒరేయ్ నువ్వు రత్తయ్యను హత్య చేసేవు. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి తీగలన్నీ లాగకు. ఇబ్బందిలో పడ్తావ్.

ఎలాగూ నీకు శిక్ష పడక తప్పదు. మీ అమ్మ, భార్య నిన్న ఏం చెప్పేరో విన్నావుగా? ఇంకా అలాంటి సాక్ష్యాలు మా దగ్గర బోలెడున్నాయ్. కనుక మర్యాదగా హత్య చేసేవని ఒప్పేసుకో. ఉరిశిక్ష పడకుండా కొన్నేళ్ళు జైలుశిక్ష పడేలా నేను చూస్తాను. అలా కాకుండా శ్యామ్‌సుందర్ వున్నాడని, అదనీ ఇదనీ తీగంతా కదిలించావా వురిశిక్ష పడటం ఖాయం. గుర్తుంచుకో'' బెదిరించాడు.

హనుమంతు ఎగతాళిగా నవ్వేడు యస్ఐ కన్‌ఫ్యూజన్‌లో పడ్డాడు.

''ఏంట్రోయ్! ఎగతాళిగా నవ్వుతున్నావ్. నేనెవరనుకున్నావ్''

''మీరొక్క నిజం చెబితే నేను కోర్టులో హత్యచేసేనని వొప్పుకుంటాను సార్!''

''నేను చెప్పాల్సిన నిజం ఏంట్రా?''

''నా ఆచూకీ మీకెలా తెల్సింది ఎవరు చెప్పేరు?''

''పోలీసువాళ్ళకి వొకరు చెప్పేందేంట్రోయ్. నేను బదిలీ అయిపోబట్టిగాని లేకపోతే నీ ఆచూకీ అప్పుడే తెల్సుకుని పట్టుకునేవాడిని. నేనంటే మజాకా అనుకున్నావేమో?''

''అయితే నేను హత్య చేసినట్లు వొప్పుకోను.''

గోవర్ధనరావు మళ్ళీ స్వల్ప కన్‌ఫ్యూజన్‌లో పడ్డాడు.

తెప్పరిల్లుకొని నిజం చెప్పేశాడు.

''మీ అమ్మ నర్సమ్మ, నీ భార్య చామంతి పోలీస్‌స్టేషన్‌కొచ్చి మేము అడగకుండానే నీ ఆచూకీ చెప్పి పట్టుకోమని పంపేర్రా'' అంటూ వాళ్ళు మొదట్లో కొట్టినా ఎలా చెప్పిందీ, తర్వాత ఎలా చెప్పిందీ చెప్పేడు.

కాస్సేపటికి ప్లీడర్ని తీసుకుని కన్నయ్యదాసు వచ్చారు. ప్లీడరు హనుమంతును అతని తల్లిని గురించి భార్యను గురించి ఏవో ప్రశ్నలు వేయసాగేడు.

కానీ అప్పటికే హనుమంతు వో నిశ్చయానికొచ్చేసేడు.

తనను రక్షించటానికి ఆరాటపడ్డ కన్నతల్లి, కట్టుకున్న భార్యే వాళ్ళుగా వాళ్ళు వెళ్ళి చెప్పేరంటే ఏదో కారణం వుండే వుండాలి. తన మీద కోపం వచ్చిందా? రాయబారి ద్వారా తను చామంతికి కబురు పంపింది అంతకుముందే కదా. అప్పటిదాకా లేని కోపం అంతలోనే వాళ్ళకి తనమీద ఎందుకొచ్చింది. తనేం తప్పు చేసాడు.

కన్నతల్లి, కట్టుకున్న భార్య తనని అసహ్యించుకుంటున్నారు. తను జైలులో పడి వుండాలని కోరుకొంటున్నారు?

తనింక ఎవరి కోసం బతకాలి? ఎందుకు బతకాలి?

"బాబూ మా యమ్మ మహాదొడ్డ తల్లి. కౌసల్యమ్మంత గొప్ప తల్లి. నా భార్య సేమంతి సీతమ్మ తల్లి లాంటిది. నన్ను అజ్ఞాతవాసానికి పంపి తను అరణ్యవాసం చేస్తున్నది. నా తల్లికి, నా భార్యకి నేనంటే ఎంత ప్రేమో చెప్పటానికి నాకు మాటలు చాలవు."

'అంత ప్రేమ గలవారైతే నిన్న కోర్టులో సాక్ష్యం అలా ఇస్తారా అలాఎందుకిచ్చారంటావ్?

అది నిజం బాబూ. వాళ్ళు నిజమే చెప్పేరు. నేనూ నిజమే చెప్పబోతున్నాను. ఇక వాదనలు వద్దు బాబూ. నన్ను మన్నించండి.''

నిబ్బరంగా అన్నాడు హనుమంతు.

* *

''బాబూ రత్తయ్యను నేను హత్య చేసేనో లేదో నేను చెప్పలేను. ఎందుకంటే నా చామంతిని అతను ఏమేమో అన్నాడు. అపుడు ఆ కోపంలో నేను వొళ్ళు మరిచిపోయాను. కానీ అతని చేతిలో కత్తి వుంది. అయినా అతను కత్తిపోటువల్ల చనిపోయాడు. ఆ కత్తి నా చేతులో వుందపుడు. మేమిద్దరం కోపంతో మాటామాటా అనుకొన్నాం. పోట్లాడుకొన్నాం. ఆ కోపంలో కావాలని చంపకపోయినా రత్తయ్య చావుకు నేనే కారణమని అంగీకరిస్తున్నాను.

హత్య చేయడమే పెద్ద తప్పు. పారిపోయి నేను మరింత పెద్ద నేరంచేసేను. నేను పారిపోవడానికి తాము కారణమని నా భార్య తల్లి చెప్పేరు. కానీ పారిపోవాలన్న కోరిక నాకు లేకపోతే వారేం చెయ్యలేరు కదా? కనుక ఆ దోషం కూడా నాదే.

నాకు బతకాలన్న కోరిక లేదు. కనుక కనికరించమని కోరను. కానీ నేను తెలిసో తెలియకో అపరాధాలు చా లా చేసివుంటాను. చాలా మందికి అన్యాయాలు చేసివుంటాను. వారందరినీ



## కత్తితో చెలగాటం

మొరాకోలోని ''కాబిస్'' అనే తెగవారు... పెళ్ళి రోజున కత్తితో చెలగాటమాడతారట! నిజమేనండీ...! పెళ్ళిరోజున మతాధిపతి పెళ్ళి కూతురు మెడమీద పదునైన కత్తిని ఉంచుతాడు! ముహూర్తం సమయంలో ఆ కత్తిని కాస్త గట్టిగా మెడమీద ఆనిస్తాడు.

ఒక రక్తపుబొట్టు కిందపడగానే ఆ పెళ్ళి అయిపోయినట్లుగా వారు భావిస్తారు. ఏది ఏమైనా... పెళ్ళి పేరిట ఇలాంమూఢాచారాల్ని ఈనాటికీ నమ్మటం వారి దురదృష్టమే!

—జూపిటర్

నన్ను క్షమించవల్సిందిగా కోరుకుంటున్నాను. ముఖ్యంగా రత్తయ్య కుటుంబం వారికి నా క్షమాపణలు చెప్పుకొంటున్నాను. జడ్జి బాబూ గారూ నన్ను వురితీసేలా ఆజ్ఞాపించండి. నాకు బతకాలన్న కోరిక లేదు. లేనేలేదు."

అతను చివర రెండు వాక్యాలు చెప్పాలనుకొన్నాడు. కానీ గొంతుకు ఏదో అడ్డం పడినట్లయింది. బోనులో కూలబడి పోయాడు.

* * *

జడ్జిగారు హనుమంతు నిజాయితీని మెచ్చుకున్నాడు. అతను చేసిన తప్పుకు పశ్చాత్తాపం పడ్తున్నట్లు తనకు రుజువయింది కనుక శిక్ష చాలా తగ్గించి వేశాడు.

పోలీసుల మధ్య నిశ్చలంగా నడుస్తూ బయటికొచ్చాడు హనుమంతు. అంజలి కన్నీళ్ళతో ఎదురొచ్చింది.

"ఏడవకు అంజలీ అంత పిచ్చి ప్రేమ కూడదు. అయినా నాకు వురిశిక్ష వెయ్యలేదుగా? మళ్ళీ నీ పక్కన కిష్టుడి వేషం వేసే యోగం నాకుందిలే."

"జైల్లో అల్లరి వేషాలెయ్యకు కిట్టయ్యా! కిట్టయ్య వేషం కట్టి అందరినీ ఆనందింపచెయ్యి. మంచోళ్లకు శిక్ష కాలం తగ్గిస్తారంటగా?"

హనుమంతు కళ్లు వెతుకుతున్నాయి.

దూరంగా నర్సమ్మ ఎంకన్న

వాళ్ళు అతని వేపే సిగ్గుగా చూస్తూ తల వంచుకుంటున్నారు.

'అమ్మా... అయ్యా..."

వాళ్ళిద్దరూ పరుగున అతని చెంతకొచ్చారు.

పోలీసులు అభ్యంతరపెట్టలేదు. కసురుకోలేదు.

"నిన్ను పట్టించామని కోపమొచ్చిందనా అనుమంతూ ఈయమ్మ మీద నీకు కోపం వచ్చిందా?"

"లేదమ్మా కోపం ఎందుకు? దొంగలా ఎంతకాలం తిరగగలను? కానీ మీకు నా మీద అంత అసహ్యం ఎందుకేసిందమ్మా? నేనంటే కోపం ఎందుకొచ్చింది? నిజం చెప్పమ్మా జైలుకు నిశ్చింతంగా పోతాను."

నర్సమ్మ అల్లంత దూరంలో వున్న అంజలిని చూసిందోసారి.

'బిడ్డా అనుమంతూ... తన బిడ్డ కుర్రూపైనా దుర్మార్గుడైనా తల్లి కడుపులో పెట్టుకుంటుందిరా. అటువంటి తల్లి దర్మానికి వెతిరేకంగా నేను నిన్ను పోలీసులకు పట్టించామురా. కడుపుతీపి/ సంపుకొని ఆ పని సేసేను. ఎందుకో తెల్సురా?" ఆమె ఓ క్షణం ఆగింది. కన్నయ్యదాసు, అంజలిని మార్చిమార్చి చూచింది. కొడుకు దగ్గరికి వచ్చి రహస్యం చెప్తున్నట్లు

అంది.

''మారుమనువు మన ఇంటావంటా లేదురా? నమ్మి నట్టింటికొచ్చిన ఆడకూతుర్ని అన్నాయం సేత్తే కులం కులం తగలడి బుగ్గయిపోతుందిరా. అట్టాంటి పనులు నా కొడుకు సేయకూడదు. నా కొడుకు కిట్ట పరమాత్ముడిలాంటోడు కాదు. శ్రీరామసెంద్రుడు. లాంటోడు ఆడు. ఖైదు నుంచి శ్రీరామసెంద్రుడిలా తిరిగొస్తాడు. అట్టా నువ్వు శ్రీరామసెంద్రుడిలా ఎప్పటికీ వుండాలని నేనీ పని సేసేనురా నా బిడ్డ. నువ్వు సల్లంగా ఎల్లి సేమంగా రా... నీ కోసం అయ్యా అమ్మా ఎదురు సూత్తంటారని మర్చిపోకేం? తల్లి తండ్రీ పక్కకి తప్పుకున్నారు.

పోలీసులు మరో పదడుగులు నడిపించారు హనుమంతుచేత. ఆ పదడుగులు హనుమంతు ఎలా నడిచాడో ఏమో.

అడుగులు మళ్ళీ ఆగేయి.


"అనుమంతూ"

చామంతి? తన భార్య చామంతి. తన బిడ్డతో వస్తోంది పరుగెత్తుకుని. భుజాన బిడ్డ. అదుగో— తన దగ్గరికొచ్చింది. భుజాన బిడ్డను క్రిందికి దించింది. తనని కౌగలించుకొంది. నిజమే. ''హనుమంతూ... నా అనుమంతూ నా మావా...''

ఇది కలా నిజమా?

నిజమే సర్వం మర్చిపోయాడు హనుమంతు.

''చామంతీ...'' ఆమెను గుండెలకు దగ్గరగా హత్తుకున్నాడు.



ఎంత మధురానుభూతి? ఇద్దరి కళ్లల్లో నీళ్ళు... తియ్యటి నీళ్ళు— అమృత ధారలు.

"మొగుడిని సాయంగా పోలీసోళ్ళకి అప్పసెప్పి జైలుకి పంపిత్తన్న — పాపిట్టి దాన్నయ్యా నేను. కానీ ఏం సెయ్యను. నీ మీద పేమ లేక కాదయ్యా మేం ఇట్టా సేసింది. అత్తయ్య సెప్పిందంతా యిన్నావుగా?"

"నా కిప్పుడంతా అర్థమయింది చామంతి. మీది ధర్మ నిర్ణయమే. ఎందుకంటే ఆనాడు నన్ను పోలీసులకు అందకుండా పంపించేసినపుడు నేను హత్య చేసే మనిషినో కానో మీకు తెల్పు. నేను పొరపాటున చేసిన ఆ హత్య వెనక గల ప్రేరణను చూచేరు. నన్ను నిర్దోషిగా భావించి రక్షించారు. ఇవాళ భర్తగా నేను ధర్మం తప్పు తున్నానని భావించారు మీరు. దారి తప్పుతున్న నన్ను దోవలో వుంచటానికి పోలీసులకు పట్టించారు. ఆ నాడు ఈనాడు నావల్ల మీకు సుఖం లేదు నష్టమే. మీ స్వార్థం లేదిందులో—"

"చమించయ్యా! నా బరత సీరామసెంద్రుడిగా వుంటే సాలు నాకు. ఎన్నాళ్ళకు అంగ్గొణ్ణవాసం సేయగలను.

ఇదిగో మావా నీ బిడ్డ ఇడిగో సూడు మావా ఈ డిదచ్చం నీ పోలికే. ఈడికోసమన్నా నువ్వు జైలు నుంచి చీరామసెంద్రుడిలా తిరిగి రా మావా కిట్టపరమాతమ ఏసాలని మర్చిపో. సీతమ్మలా నీ కోసం ఎదురు సూత్తంటా."

"అట్లాగే చామంతీ శ్రీరామచంద్రుడిలా ఎప్పటికీ దారి తప్పనని మాట ఇస్తున్నాను. సరేనా?"

హనుమంతు బిడ్డనెత్తుకొని ముద్దులాడేడు.

కన్నయ్యదాసు, అంజలి అంత దూరంలో నిల్చొని వున్నారు. అతను వారికి సౌంజ్ఞ చేసేడు. వాళ్ళు అతని దగ్గరికొచ్చారు.

"చామంతీ... మట్టిమోసే మనిషిని — నన్ను కృష్ణపరమాత్మగా మార్చింది వీళ్ళే. నాకు రెండో జన్మనిచ్చిన బ్రహ్మాయీనాయన. నా గురువు — యీ అమ్మాయి — అంజలి వేషంలోనే సత్యభామ. నిజ జీవితంలో... లక్ష్మణదేవుని భార్య ఊర్మిళదేవో, రుక్మిణీదేవో నాకు తెలియదు. కానీ నాకు మాత్రం గురుపుత్రిక."

"చామంతీ. నాతో కిట్టయ్య వేషం కట్టినా నీ మొగుడెప్పుడూ శ్రీరామసెంద్రుడేనమ్మా. దారి తప్పని మనిషి"

హనుమంతు పోలీసుల మధ్య నిశ్చలంగా నడిచివెళ్తున్నాడు. భర్తనే చూస్తూ మంచుబొమ్మలా నిలబడ్డ చా మంతి అంజలి మాటలకి వులిక్కిపడింది. సజల నేత్రాలతో ఆమె కళ్ళల్లోకి చూచింది.

అంజలి ఆమె చేతిని ఆప్యాయంగా తన చేతుల్లోకి తీసుకొంది.

ఇద్దరి మనసులూ రెండు నదుల్లా పొంగేయి.

రెండూ రెండు రకాల నదులు



దేని పవిత్రత దానిదే. దేని ధర్మం దానిదే.

దారి తప్పనంతవరకు ఏ ధర్మమైనా మంచిదేగా?

హనుమంతు క్రమంగా వారి దృష్టి పథానికి దూరమయిపోసాగేడు. కానీ మహోపథానికి ఎప్పుడూ దగ్గరగావే వుంటాడు!

(అయిపోయింది)